


ESTD: 1999 www.voodayam.com

# వుదయం




హైదరాబాద్ 10-04-2026 శుక్రవారం సంపుటి : 27 | సంచిక : 38 SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY రూ. 3.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily

Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal Follow us on

2020 వరకు దరఖాస్తులు అందిన బైనామాల క్రమబద్ధీకరణకు నిర్ణయం

ఆర్డీవో పరిశీలన తరువాత భూ భారతిలో యాజమాన్య హక్కులు

# సాదా జై నామా

కొనుగోలుదారు అఫిడవిట్ సమర్పణ తప్పనిసరి



**హైదరాబాద్, ఏప్రిల్ 9 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణలో తెల్ల కాగితాలపై జరిగిన భూ లావాదేవీల (సాదాబైనామాలు)తో రైతులు ఎదుర్కొంటున్న చట్టపరమైన, ఆర్థిక సమస్యలకు పరిష్కారం లభించనుంది. 2020లో అందిన దరఖాస్తుల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కొనుగోలుదారు అఫిడవిట్ సమర్పిస్తే.. ఆర్డీవో పరిశీలన అనంతరం భూ భారతిలో యాజమాన్య హక్కులు కల్పించనున్నారు. ఈ మేరకు సీసీఎల్ఏ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో ప్రస్తుతం 2,26,693 సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయి. ఈ పత్రాలకు సరైన రిజిస్ట్రేషన్ లేకపోవడంతో భూమిపై రైతులకు పూర్తిస్థాయి యాజమాన్య హక్కులు లేకుండాపోయాయి. దీంతో భూభారతి పోర్టల్‌లో భూమి వివరాలు నమోదు కాక.. రైతుబంధు, రైతుబీమా వంటి ప్రభుత్వ పథకాలు అందడం లేదు. బ్యాంకు నుంచి పంట రుణాలు పొందటం కూడా రైతులకు సాధ్యపడటం లేదు. భూముల ధరలు పెరగడంతో.. పాత యజమానులు, వారి వారసులు వివాదాలకు దిగడంతో రైతులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. భూమి రికార్డులు స్పష్టంగా లేకపోవడంతో క్రయవిక్రయాలు చేయడం కూడా రైతులకు కష్టతరంగా మారింది. ఈ నేపథ్యంలో సాదాబైనామా సమస్యల పరిష్కారం విషయంలో సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ వ్యాప్తంగా 2020 అక్టోబరు 12 నుంచి నవంబరు 10వ తేదీ వరకు స్వీకరించిన సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు భూ పరిపాలన ప్రధాన కమిషనర్ లోకేష్ కుమార్ గురువారం అందుకు సంబంధించిన మార్గదర్శకాలు జారీ చేశారు. ఇటీవల అఫిడవిట్ నిబంధన సవరించిన నేపథ్యంలో.. వీలైనంత త్వరగా సాదా బైనామా భూముల క్రమబద్ధీకరణను పూర్తి చేయాలని సర్కార్ ఆదేశించింది. భూమి కొనుగోలుదారు మాత్రమే ఆధారాలతో కూడిన అఫిడవిట్ జత చేయాల్సి ఉంటుందని మార్గదర్శకాల్లో పేర్కొంది. ఆర్డీవో ఓకే అంటే.. 30 రోజుల్లో పరిష్కారం ఆర్డీవో ఆధారాలు పరిశీలించి క్రమబద్ధీకరణకు సిఫార్సు చేస్తారని.. 30 రోజుల్లోగా భూ యజమాని పేరును భూ భారతిలో నమోదు చేసి అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు భూ పరిపాలన ప్రధాన కమిషనర్ లోకేష్ కుమార్ తెలిపారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే.. క్రమబద్ధీకరణ ప్రక్రియను నిలిపివేసి పరిశీలన చేస్తారన్నారు. సాదా బైనామాకు సంబంధించి అక్రమమని తేలితే.. క్రిమినల్ కేసు నమోదుకు సిఫార్సు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ వ్యవహారాన్నంతటిని ఆయా జిల్లాల కలెక్టర్లు పర్యవేక్షించాలని సీసీఎల్ఏ కమిషనర్ జారీ చేసిన మార్గదర్శకాల్లో సూచించారు.

**ఎఫ్‌టీఎస్ సిబ్బంది సంఖ్య కుదింపు**

భూభారతి రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో ఎమ్మార్వో సంయుక్త సబ్ రిజిస్ట్రార్‌కు సహాయకారిగా ఉండేందుకు నియమించిన ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ సంఖ్యను కుదిస్తూ రెవెన్యూశాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా 636 మంది ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ పనిచేస్తున్నారు. 2020 నుంచి ఇప్పటి వరకు వారి

మిగతా 2లో

# విరమణ విలవిల

## ఆగని ఇజ్రాయెల్ దాడులు, అమెరికా ప్రతిపాదనలకు ఇరాన్ నో

మా డిమాండ్లు నెరవేర్చకపోతే ఇరాన్ పై తీవ్రమైన దాడులు తప్పవు, మా సైన్యం అక్కడే ఉంది : ట్రంప్

ఇజ్రాయెల్ దాడుల నీడలో దౌత్యం బతకజాలదని ఇరానియన్ల వ్యాఖ్య

పాక్ లో చర్చలకు సన్నాహాలు, యుద్ధం పట్ల అమెరికాలో వ్యతిరేకత

లెబనాన్ పై దాడులు ఆగకపోతే సంధి నుంచి తప్పుకుంటాం : ఇరాన్



**వుదయం డెస్క్, ఏప్రిల్ 9:** సున్నితమైన కాల్పుల విరమణ అంశం పై అనుమానాలను రేకెత్తిస్తూ, అమెరికా దళాలు ఇరాన్ చుట్టూ మోహరించి ఉంటాయని, వాషింగ్టన్ డిమాండ్లను నెరవేర్చడంలో టెహ్రాన్ విఫలం అయితే, తీవ్రమైన సైనిక చర్య తప్పదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. నిజమైన ఒప్పందంగా ఆయన అభివర్ణించిన ఒప్పందం పూర్తిగా అమలు అయ్యే వరకూ అమెరికా దళాలు, విమానాలు, నావికా దళాలు తమతమ స్థానాల్లో ఉంటాయని బుధవారం ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్ లో పోస్ట్ చేశారు. "నిజమైన ఒప్పందం పూర్తిగా అమలయ్యే వరకు, అమెరికా నౌకలు, విమానాలు, సైనిక సిబ్బంది అందరూ ఇరాన్‌లోనూ, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ యథాతథంగా కొనసాగుతాయి," అని ట్రంప్ పేర్కొన్నారు.

మిగతా 2లో

**ఇలా అయితే కుదరదు : ఇరాన్**

లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనిక దాడులను కొనసాగిస్తే, ఇరాన్ అమెరికాతో కుదుర్చుకున్న కాల్పుల విరమణ ఒప్పందం నుండి వైదొలగవచ్చనే వార్తలు ఇప్పటికే ప్రారంభం అయ్యాయి. ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని నిరంతరం ఉల్లంఘిస్తున్న నేపథ్యంలో టెహ్రాన్ పరిస్థితిని సమీక్షిస్తోందని, విశ్వసనీయ వర్గాల సమాచారం ఉన్న ఒక అధికారి ఇరాన్ కు చెందిన తస్నిమ్ న్యూస్ ఏజెన్సీకి తెలిపారు.

మిగతా 2లో

# సూర్యుడి వాడి 40° దాటిన వేడి




- మరో 3 డిగ్రీలు పెరుగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక
- ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్
- మిగతా అన్ని జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు
- అప్రమత్తంగా ఉండాలన్న నిపుణులు

**హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఎఎంఎస్) :** రాష్ట్రంలో ఎండలు దంచి కొడుతున్నాయి. ఉదయం 8 దాటిందంటే చాలు భానుడి భగభగలు ప్రజల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇక ఉదయం 10 తర్వాత రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. హైదరాబాద్ నగరంతో పాటు చాలా పట్టణాల్లో ఇదే పరిస్థితి. ఇక తీవ్రమైన ఎండలకు తోడు ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల కింద సేదతీరుతున్నారు. కాగా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మరో 3 డిగ్రీలు పెరుగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలకు గురువారం ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు.


మిగతా 2లో

# భారీ పోలింగ్, ప్రశాంతం

## అసోం, కేరళ, పుదుచ్చేరి శాసన సభ ఎన్నికల ఓటింగ్ లో స్వల్ప ఘటనలు





**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 (వుదయం) :** కట్టుదిట్టమైన భద్రత మధ్య గురువారం అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ అక్కడక్కడ చెదురు మదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 5 గంటలకు ముగిసిన పోలింగ్‌లో అత్యధికంగా పుదుచ్చేరిలో 86.92 శాతం, అసోంలో 84.42 శాతం, కేరళంలో 75.01 శాతం నమోదు అయిందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. గురువారం ఉదయం అసోం (126), కేరళం (140), పుదుచ్చేరి (30) లలో పోలింగ్ ప్రారంభమైంది. ఉదయం ఏడుగంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగింది. నుంచే తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాల ఎదుట బారులు తీరారు. ఈ ఎన్నికల సందర్భంగా ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. ఆయా రాష్ట్రాలోని పోలింగ్ కేంద్రాల వద్ద భారీగా భద్రతా సిబ్బందిని మోహరించారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. ఈ ఏడాది మార్చి రెండో వారంలో దేశంలోని నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలోని అసెంబ్లీలకు కేంద్రం ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ప్రకటించింది. అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీలకు ఏప్రిల్ 9వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపింది. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23వ తేదీన ఒకే దశలో ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామని వెల్లడించింది. పశ్చిమ బెంగాల్‌లోని 294 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు విడతలుగా ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామని పేర్కొంది. మే 4వ తేదీన ఈ ఐదు రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టడతామని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. కేరళలో, 140 మంది సభ్యులు గల శాసనసభకు అధికార లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్), కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్



ఫ్రంట్ (యుడిఎఫ్) ,బీజేపీ నేతృత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్డీయే) మధ్య హోరాహోరీ పోరు జరుగుతుండగా, 2.71 కోట్ల మంది ఓటర్లు 883 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్ణయించనున్నారు.

**అస్సాం** .. అస్సాంలో 126 స్థానాలకు నేడు పోలింగ్ జరిగింది. ఇక్కడ 2.50 కోట్లకు పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి అర్హులు కాగా, 722 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ వరుసగా మూడోసారి అధికారాన్ని చేపట్టాలని ప్రయత్నిస్తోంది. కాంగ్రెస్ నేతృత్వంలోని ఈ కూటమిలో రాజోర్ దళ్ సీపీఐ(ఎం) కూడా ఉన్నాయి.

**పుదుచ్చేరి:** అదేవిధంగా, పుదుచ్చేరిలోని 30 మంది సభ్యుల శాసనసభకు, 10,14,070 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి అర్హులు.

**ఉప ఎన్నికలు:** నాగాలాండ్‌లోని మొకోక్‌చుంగ్ జిల్లాలో గల కోరిడాంగ్ అసెంబ్లీ నియోజకవర్గానికి పోలింగ్ జరిగింది. నవంబర్ 2025లో సిట్టింగ్ బీజేపీ ఎమ్మెల్యే ఇమ్‌కాంగ్ ఎల్. ఇమ్‌చెన్ మరణం కారణంగా ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది. అదేవిధంగా, కర్ణాటకలోని బాదామి (బాగాల్‌కోట్) ,దావణగెరె దక్షిణ అసెంబ్లీ నియోజకవర్గాలలో కూడా పోలింగ్ నిర్వహించారు. సీనియర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హెచ్.వై. మేటి, షమనూరు శివశంకరప్పల మరణాల కారణంగా ఈ ఉప ఎన్నికలు అవసరమయ్యాయి. ఉత్తర త్రిపురలోని ధర్మనగర్ అసెంబ్లీ ఉప ఎన్నికకు పోలింగ్ జరిగింది. ఇది డిసెంబర్ 2025లో బిజెపి నాయకుడు, అసెంబ్లీ స్పీకర్ బిస్వా బంధు సేన్ మరణంతో అవసరమైంది.

# ఎమ్మెల్యే పల్లాకు సైబర్ ఉచ్చు టోపీ

నియోజకవర్గ ప్రజలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షలు రుణం ఇప్పిస్తామని ఫోన్ లో నమ్మించి రూ. లక్ష కాజేసిన వ్యక్తి



**హైదరాబాద్, ఏప్రిల్ 9 (ఎఎంఎస్) :** జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడ్డారు. కేంద్ర పథకం వికసిత్ భారత్ పథకం కింద ఆ నియోజకవర్గ ప్రజలకు రూ. పది లక్షల వరకు రుణాలు ఇప్పిస్తామని నమ్మించిన ఓ నిందితుడు ఎమ్మెల్యే నుంచి రూ. లక్ష కాజేశాడు. పల్లా కు ఫోన్ చేసిన సదరు నిందితుడు తాను కేంద్రంలో ఉన్నత హోదాలో ఉన్నానని నమ్మించి బురిడి కొట్టించాడు. అతని మాటలు నమ్మిన పల్లా.. గంట వ్యవధిలోనే సదరు నిందితుడు

మిగతా 2లో



ప్రముఖ రచయిత ఉదయభాను కన్నుమూత

2

# త్వరలోనే 15 వేల అంగన్‌వాడీ పోస్టులు

మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

ప్రభుత్వ పరిశీలనలో జీతాల పెంపు అంశం

ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులోనూ అంగన్‌వాడీలకు ప్రాధాన్యం



**మహబూబాబాద్, ఏప్రిల్ 9 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలో అంగన్‌వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు భర్తీ చేస్తామని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 15వేల అంగన్‌వాడీ పోస్టులను త్వరలోనే ప్రకటించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు జీతాలు పెంచే అంశంపై తమ ప్రభుత్వం సానుకూలంగా ఉందన్న ఆమె ఆ అంశాన్ని పరిశీలిస్తోన్నట్లు వెల్లడించారు. గురువారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో 1368 మంది అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్లు అందజేశామనీ రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 37 వేల మందికి ఈ ఫోన్లు పంపిణీ చేస్తామన్నారు.

# బడిలో ఆకలికి చోటుండదు

## జూన్ రెండు నుంచి పాఠశాలల్లో అల్పాహారం, కళాశాలల్లో మధ్యాహ్న భోజనం

- రాష్ట్రంలో ప్రతి బిడ్డ ఎంత చదువుకుంటే అంత వరకు అన్ని సౌకర్యాలు కల్పించి మన విద్యార్థులను మంచి మానవ వనరులుగా తీర్చిదిద్దాలన్నదే సిఎం రేవంత్ ఆశయం
- యంగ్ ఇండియా ఇంటిగ్రేటేడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తోపాటు నియోజకవర్గానికి ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్
- విద్యతోనే అంతరాలు లేని, ఆదర్శ సమాజ నిర్మాణం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ఖమ్మం, ఏప్రిల్ 9 (వుదయం ప్రతినిధి) :** వచ్చే విద్యాసంవత్సరంలో స్కూళ్లల్లో అల్పాహారం, కాలేజీల్లో మధ్యాహ్న భోజనం పథకాలను అమలు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. రాష్ట్రంలో పుట్టిన ఏ బిడ్డ అర్థాకలితో బడికి పోకూడదన్నారు. అర్థాకలితో బడికి పోయిన విద్యార్థి సరిగా పాఠాలను అర్థం చేసుకోలేడన్న ఆయన చదువుపై ఏకాగ్రత చూపలేడని చెప్పారు. ఇదే ఉద్దేశ్యంతో ఈ పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. , జూన్ రెండో తేది నుంచి రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న 20 లక్షల మంది విద్యార్థులకు




అల్పాహార పథకం, ఇంటర్మీడియట్ కళాశాల విద్యార్థులకు ఉచితంగా మధ్యాహ్న భోజనం ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. విద్యార్థులకు రాష్ట్ర భవిష్యత్తు, వారి ఎదుగుదలే రాష్ట్ర సంపూర్ణ ఎదుగుదల గా భావించి బడ్జెట్లో విద్యాశాఖకు 13.5 శాతం నిధులు కేటాయించినట్లు వివరించారు. గత పదేండ్లు అధికారంలో ఉన్నా బీఆర్ఎస్ నేతలు సమృద్ధిగా ఉన్న రాష్ట్ర వనరులను దేనికోసం ఖర్చు పెట్టాలో తెలియక వెచ్చించలేదన్నారు. దీంతో రాష్ట్రం దోపిడీకి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన ఖమ్మం జిల్లాలో పర్యటించిన భట్టి విక్రమార్క... బోనకల్లు,, ఎర్రుపాలెం మండల కేంద్రాల్లో అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఇంటర్ కళాశాలల విద్యార్థులకు ఉచితంగా సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ద్వారా కూడా స్పష్టమైందన్నారు. అక్షరమే ఆయుధంగా మలుచుకొని తెలంగాణ బిడ్డలు చదువుకొని బాగా ఎదగాలన్నారు. ఏ ఆయుధం తెలంగాణ బిడ్డలను నిలబెట్టలేదని చెప్పారు.

మిగతా 2లో

# కెసిఆర్‌ను కలిసి చేరుతా

## కెటిఆర్‌తో జీవన్ రెడ్డి

- జీవన్ రెడ్డి నిబద్ధత కలిగిన నేత
- 2014లోనే కేసీఆర్ ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించారు
- ఆయన అనుభవం, సేవలను కాంగ్రెస్ వినియోగించుకోలేకపోయింది
- బీఆర్ఎస్ లో చేరాలని ఆయన్ను కోరా
- మీడియాతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- జగిత్యాలలో జీవన్ రెడ్డితో భేటీ



**జగిత్యాల, ఏప్రిల్ 9 (వుదయం ప్రతినిధి) :** మాజీ మంత్రి జీవన్ రెడ్డి ప్రస్తుత రాజకీయాల్లో అత్యంత నిబద్ధత కలిగిన నాయకుడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కితాబిచ్చారు. 2014 ఎన్నికల ముందే కేసీఆర్ ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించారని తెలిపారు. కానీ జీవన్ రెడ్డి తన నిబద్ధతతో కాంగ్రెస్ లోనే కొనసాగారని చెప్పారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ ఆయనకున్న సుదీర్ఘ అనుభవాన్ని, సేవలను వినియోగించుకోలేకపోయిందని విమర్శించారు. కేసీఆర్ సూచన మేరకు జీవన్ రెడ్డిని బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించామన్నారు. గురువారం జగిత్యాలలో జీవన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కేటీఆర్ ఆయనతో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న జీవన్ రెడ్డి తో, కేసీఆర్‌కు నాలుగు దశాబ్దాల పరిచయం, స్నేహం ఉందన్నారు. కేసీఆర్ తొలిసారి ముఖ్యమంత్రి అయిన తర్వాత కరీంనగర్ జిల్లాలో పర్యటించారు. అప్పుడు ముందుగా జీవన్ రెడ్డికి మైక్ ఇవ్వాలని కేసీఆర్ సూచించారు. బోర్నపల్లికి ఒక బ్రిడ్జి కావాలని జీవన్ రెడ్డి గతంలో కేసీఆర్ ను కోరారు. వారి మీదున్న గౌరవంతో రూ. 75 కోట్ల బ్రిడ్జిని కేసీఆర్ వెంటనే మంజూరు చేశారని గుర్తు చేశారు. షుగర్ ఫ్యాక్టరీ తెరిపించేందుకు చాలా ప్రయత్నించారని చెప్పారు. జీవన్‌రెడ్డి రెండ్రోజుల్లో కేసీఆర్‌ను కలుస్తానని చెప్పినట్లు వివరించారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసుగు చెందారన్న ఆయన రైతులకు రూ.27 వేల కోట్ల రైతు భరోసా నిధులు ఎగ్గొట్టారని ఆరోపించారు. హామీలు అమలు చేయలేకపోతోన్న కాంగ్రెస్ మంత్రులు, నాయకులు అనవసర మాటలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. సీఎం రేవంత్ రెడ్డి భాషపై జనాల్లో చర్చ జరుగుతోందన్నారు.

**కేసీఆర్ ను కలిశాక బీఆర్ఎస్ లో చేరుతా: జీవన్ రెడ్డి**

బీఆర్ఎస్ లో చేరాలని నిర్ణయించుకున్నట్లు మాజీ మంత్రి జీవన్ రెడ్డి తెలిపారు.

# విరమణ విలవిల

మొదటి పేజీ తరువాయి

ఏ కారణం చేతనైనా అది జరగకపోతే, కాల్పులు మొదలవుతాయి, మునుపెన్నడూ ఎవరూ చూడనంత భారీగా, మెరుగ్గా, బలంగా ఉంటాయని అన్నారు.

పాకిస్తాన్ మధ్యవర్తిత్వంతో వాషింగ్టన్– తెహ్రాన్‌ల మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన ఒక రోజు తర్వాత ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఈ ఒప్పందం ఆరు వారాల పోరాటానికి విరామం ఇచ్చి, హొర్ముజ్ జల సంధిలో అంతరాయాల గురించి ఆందోళన చెందుతున్న ప్రపంచ మార్కెట్లను కొద్దిసేపు శాంతపరిచింది. అయినప్పటికీ, కాల్పుల విరమణ ఎంత త్వరగా విచ్ఛిన్నం కాగలదో ట్రంప్ వాడిన భాష స్పష్టం చేసింది. ఇరాన్ ఎలాంటి అణ్వాయుధ ఆశయాలనైనా విడనాడాలని, కీలకమైన నౌకా రవాణా మార్గం గుండా సురక్షిత ప్రయాణాన్ని కల్పించాలని అమెరికా డిమాండ్లను ఆయన పునరుద్ఘాటించారు. అదే సమయంలో, అమెరికా బలగాలు తమ తదుపరి విజయం కోసం ఎదురుచూస్తూ, సన్నద్ధమై విశ్రాంతి తీసుకుంటున్నాయి అని గొప్పగా చెప్పుకున్నారు. ఇలా ఉండగా, గురువారం ఇరాన్‌లో, దేశ పారామిలిటరీ దళమైన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) యుద్ధ సమయంలో హొర్ముజ్ జలసంధిలో సముద్ర మైన్‌లను అమర్చిందని సూచిస్తూ, ఇస్నా, తస్నిమ్ వార్తా సంస్థలు ఒక చార్ట్‌ను ప్రచురించాయి. ఆ చార్టులో, జలసంధి గుండా ఓడలు ప్రయాణించే మార్గమైన ట్రాఫిక్ సెపరేషన్ స్కీమ్ మీద, ఫార్సీ భాషలో ప్రమాదకర ప్రాంతంగా గుర్తిస్తూ ఒక పెద్ద వృత్తం చూపారు. ఆ చార్టు ప్రకారం, ఓడలు లారాక్ ద్వీపం సమీపంలో ఇరాన్ ప్రధాన భూభాగానికి దగ్గరగా ఉన్న జలాల గుండా మరింత ఉత్తరానికి ప్రయాణించాలి. యుద్ధ సమయంలో కొన్ని ఓడలు ఈ మార్గంలోనే ప్రయాణించడం గమనించారు. దానిపై ఫిబ్రవరి 28 నుంచి ఏప్రిల్ 9 వరకు తేదీ వేసి ఉంది, అప్పటి నుంచి ఐఆర్‌జిసి ఆ మార్గంలో మైన్‌లను తొలగించిందో లేదో స్పష్టంగా తెలియదు.

### యుద్ధ విరమణకు అర్థమే లేదు

ఇరాన్‌లో క్షేత్రస్థాయిలో తీవ్ర సందేహం నెలకొని ఉంది. అమెరికా కొనసాగిస్తున్న బెదిరింపులు, ఆ ప్రాంతమంతటా ఇజ్రాయెల్ సాగిస్తున్న సైనిక చర్యల నీడలో దౌత్యం నిలబడగలదా అని తెహ్రాన్‌లోని చాలా మంది ఇరానీయులు ప్రశ్నించారు.

**కాల్పుల విరమణ ఒప్పందంలోనే అనేక వైరుధ్యాలు**

అమెరికా చేసిన సమగ్ర ప్రతిపాదనను తెహ్రాన్ తిరస్కరించి, దానికి బదులుగా లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులను నిలిపివేయడం, ఆంక్షలను ఎత్తివేయడం వంటి తన సొంత డిమాండ్లను ముందుకు తెచ్చింది – అయితే ఈ షరతులను వాషింగ్టన్ అంగీకరించలేదు.

**పాకిస్థాన్‌లో అమెరికా-ఇరాన్ చర్చలు**

అనిశ్చితి ఉన్నప్పటికీ, రాబోయే రోజుల్లో అమెరికా ప్రతినిధులతో చర్చల కోసం ఒక ప్రతినిధి బృందం ఇస్లామాబాద్‌కు వెళ్తుందని ఇరాన్ అధికారులు ధృవీకరించినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్‌లోని ఇరాన్ రాయబారి, రెజా అమీరి మొఘాదం, ఇరాన్ ప్రతిపాదించిన 10 అంశాల ఆధారంగా చర్చల కోసం ఈ రాత్రి ఇస్లామాబాద్‌కు ఒక ప్రతినిధి బృందం వస్తుంది అని గురువారం ఎక్స్‌పై పేర్కొన్నారు. అయితే, ఆయన తర్వాత ఆ పోస్ట్‌ను తొలగించారు.పాకిస్తాన్ రాజధానిలోని అధికారులు బుధవారం ఎటువంటి కారణం చెప్పకుండా, ఆకస్మికంగా రెండు రోజుల పాటు స్థానికంగా సెలవులను ప్రకటించిన తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. యుద్ధ విరమణ విశ్వసనీయతను దెబ్బతీసేందుకు ఇజ్రాయెల్ ఇప్పటికే చర్యలు చేపట్టింది. ఇరాన్‌పై ప్రత్యక్ష దాడులను వాషింగ్టన్ నిలిపివేయడాన్ని సమర్థిస్తున్నట్లు పైకి కనిపిస్తూనే, అది లెబనాన్‌పై తన దాడిని తీవ్రతరం చేసింది. ఫిబ్రవరి తర్వాత జరిగిన అత్యంత ఘోరమైన దాడులను ప్రారంభించి, ఒక్క రోజులోనే కనీసం 182 మందిని హతమార్చింది. ఉద్రిక్తతలు పెరగడంతో, ఇలాంటి పరిస్థితుల్లో చర్చలు కొనసాగించడం అసమంజసం కావచ్చని తెహ్రాన్ హెచ్చరించింది.

ఇదిలా ఉండగా, అమెరికాలో యుద్ధానికి వ్యతిరేకత పెరుగుతోంది. తాను అనధికార సైనిక చర్యగా అభివర్ణించిన దానిని అరికట్టడానికి, యుద్ధ అధికారాల తీర్మానం కింద ఓటింగ్‌ను జరిపించేందుకు డెమోక్రాట్లు ప్రయత్నిస్తారని సెనేటర్ కోరీ బుకర్ అన్నారు.

### ఇలా అయితే కుదరదు : ఇరాన్

మొదటి పేజీ తరువాయి

లెబనాన్‌పై దాడులు కొనసాగితే ఇరాన్ తన నిబద్ధతను పునఃపరిశీలిస్తుందని ఆ అధికారి పేర్కొన్నారు.

లెబనాన్ కు చెందిన ఇస్లామిక్ ప్రతిఘటనకు వ్యతిరేకంగా జరుగుతున్న దాడులతో సహా అన్ని రంగాలలో పోరాటాన్ని నిలిపివేయడం కాల్పుల విరమణ ఒప్పందంలో భాగమని ఇరాన్ వాదిస్తున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. అయినప్పటికీ, ఇజ్రాయెల్ తన కార్యకలాపాలను కొనసాగిస్తోందని, ఇవి ఒప్పందాన్ని స్పష్టంగా ఉల్లంఘించడమేనని తెహ్రాన్ పేర్కొంది. ప్రస్తుత దాడుల పరంపర ప్రారంభమైనప్పటి నుంచి ఇదే అతిపెద్ద సమన్వయ దాడి అని పేర్కొంటూ, బీరూట్, బెకా లోయ, దక్షిణ లెబనాన్ వ్యాప్తంగా కేవలం 10 నిమిషాల వ్యవధిలో 100కి పైగా స్థావరాలపై దాడులు జరిపినట్లు ఇజ్రాయెల్ బలగాలు తెలిపాయి. నవంబర్ 2024 నుండి కాల్పుల విరమణ అమల్లో ఉన్నప్పటికీ, మార్చి 2న హిజ్బుల్లా జరిపిన సరిహద్దు దాడి అనంతరం దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ తన వైమానిక, భూతల కార్యకలాపాలను కొనసాగిస్తోంది. ఇజ్రాయెల్ దాడుల కారణంగా ఇప్పటివరకు కనీసం 1,530 మంది మరణించారని, 4,812 మంది గాయపడ్డారని లెబనీస్ అధికారులు వెల్లడించారు; ఇది కొనసాగుతున్న సంఘర్షణ తీవ్రతను స్పష్టం చేస్తోంది.

# దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్ జెండర్ల సంక్షేమానికి ప్రాధాన్యత

**అన్ని వర్గాల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి**

**హైదరాబాద్ జిల్లా ఇన్ ఛార్జీ మంత్రి పొన్నం**



**హైదరాబాద్, ఏప్రిల్ 9 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని హైదరాబాద్ జిల్లా ఇన్ ఛార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రధానంగా దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్ జెండర్ల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం హైదరాబాద్ కలెక్టరేట్ లో మంత్రి సమత కిచెన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్థిక పునరావాస పథకం కింద ఆరు మంది ట్రాన్స్‌జెండర్ లబ్ధిదారులకు రూ. 75 వేల చొప్పున ఆర్థిక సహాయం చెక్కులలను అలాగే ఐదు మంది దివ్యాంగులకు రూ. 1,18,500 విలువగల బ్యాటరీ ఆధారిత వీల్‌చైర్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధిగా అభివర్ణించారు. సమతా కిచెన్ ద్వారా దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు ఇతర అట్టడుగు వర్గాలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. సమాజంలోని వృద్ధులు దివ్యాంగులు ట్రాన్స్ జెండర్ లను ఆర్థిక కార్యకలాపాల్లో భాగస్వామ్యం చేయడం ద్వారా వారికి ఆర్థిక తోడ్పాటు అందించి సమగ్ర అభివృద్ధికి బాటలు వేస్తున్నామన్నారు. సమతా కిచెన్ లో ఆరు మంది ట్రాన్స్ జెండర్స్, ఒక దివ్యాంగుడికి ఉపాధి కల్పించడం హర్షణీయమన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో సుమారు 10.47 లక్షల దివ్యాంగులు, 10 లక్షల మంది వృద్ధులు ఉన్నారన్నారు. అందులో హైదరాబాద్ జిల్లాలో సుమారు 2 లక్షల మంది వృద్ధులు నివసిస్తున్నారని తెలిపారు. వీరికి 50 వేలకు పైగా సదరం సర్టిఫికెట్లు, 5 వేల యుడిఐడి కార్డులు జారీ చేశామన్నారు. 29,902 మంది దివ్యాంగులకు పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. హైదరాబాద్ జిల్లాలో 404 మంది ట్రాన్స్‌జెండర్‌లకు గుర్తింపు పత్రాలు జారీ చేశామన్నారు. రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ, ట్రాన్స్‌జెండర్లు సమాజంలో అంతర్భాగమనీ వారి సామాజిక స్వీకరణ, గౌరవప్రద జీవనానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సమత కిచెన్ కు ఎంపీ ల్యాడ్స్ నిధులను తన వంతుగా సహకారం అందిస్తానని తెలిపారు.ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ, ట్రాన్స్‌జెండర్లకు పెరుగుతున్న అవకాశాలపై సంతోషం వ్యక్తం చేశారు. పోలీస్ శాఖలో ట్రాఫిక్ వాలంటీర్లుగా ఉపాధి కల్పన వంటి చర్యలు సమాజ మార్పుకు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో వారికి రాజకీయ, పరిపాలనా వ్యవస్థలో మరింత ప్రాతినిధ్యం అవసరమని అభిప్రాయపడ్డారు.జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి మాట్లాడుతూ నిరంతర సహాయక చర్యలతో పాటు, సమతా కిచెన్ వంటి ఉపాధి ఆధారిత కార్యక్రమాల ద్వారా స్థిరమైన జీవనోపాధిని కల్పించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు వారి ఆసక్తులకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందించి, ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యం అని వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) జితేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, జిల్లా దివ్యాంగులు, వృద్ధులు మరియు ట్రాన్స్‌జెండర్ సంక్షేమ అధికారి రాజేందర్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి అశన్న, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కోటాజీ, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి ప్రవీణ్, జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి ఇలియా అహ్మద్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పవన్ కుమార్, ఏవో విజయలక్ష్మి , సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రముఖ రచయిత ఉదయభాను కన్నుమూత


**హైదరాబాద్, ఏప్రిల్ 9 (వుదయం ప్రతినిధి) :** ప్రముఖ రచయిత, కథకుడు ఎం. ఉదయభాను ఏప్రిల్ 8వ తేదీన ఉదయం హైదరాబాదులో కన్నుమూశారు.



అనారోగ్యంతో కొద్ది రోజులుగా చికిత్స పొందుతున్న ఆయన తన స్వగృహంలోనే తనువు చాలించారు. ఆంధ్రజ్యోతి దినపత్రిక ఆదివారం అనుబంధంలో 'అపరాధి' శీర్షికన సుమారు పది సంవత్సరాల పాటు 2002 నుంచి 2012 వరకు క్రైమ్ స్టోరీస్‌ను ఉదయభాను నిరంతరాయంగా రచించారు. తద్వారా పాఠకులను ఆకర్షించారు. తెలుగు సాహిత్య రంగంలో వందలాది కథలు రచించిన అనుభవం శ్రీ ఉదయభాను గారికి ఉంది. తెలుగునాట ఉన్న అన్ని ప్రముఖ వారపత్రికల్లో వందలాది కథలు ప్రచురితం అయ్యాయి. అలాగే నవలా రచయితగా కూడా శ్రీ ఉదయభాను గారికి అనుభవం ఉంది. ఆయన రాసిన 'ది గైడ్' నవల ఆంధ్రభూమి వారపత్రికలో ఉత్తమ నవలగా ఎంపికై ప్రచురితమైంది. అలాగే ట్రావెల్ రచయితగా వేలాది ఆర్టికల్స్‌ను ప్రముఖ వారపత్రికల్లోనూ, దినపత్రికల్లోనూ రచించిన అనుభవం శ్రీ ఉదయభాను గారికి ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ట్రావెల్ రచయితగా ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా రెండు పర్యాయాలు అవార్డుతో పురస్కరించింది. ఉద్యోగరీత్యా ఆంధ్రప్రదేశ్ టూరిజం కార్పొరేషన్‌లో సుమారు 28 సంవత్సరాల పాటు వివిధ హోదాల్లో సేవలను అందించి, 2011 సంవత్సరంలో డివిజనల్ మేనేజర్‌గా రిటైర్ అయ్యారు. ఉదయభాను మహాకవి దాశరథికి స్వయాన మేనల్లుడు కావడం విశేషం. ఆయన రాసిన కథల్లో 'బుద్బుదం', 'అమ్మ కావాలి', 'ఆమె కోరిక', 'ఇంగ్లీష్ పేషెంట్' వంటి కథలు ఉత్తమ రచనలుగా పురస్కారం అందుకున్నాయి. కథలతో పాటు అనువాదకుడిగా కూడా శ్రీ ఉదయభాను గారికి చక్కటి అనుభవం ఉంది. ప్రముఖ ఆంగ్ల, హిందీ చిత్రాలకు అనువాద రచయితగా పనిచేసిన అనుభవం ఉదయభాను కు ఉంది. అదే సమయంలో ఆయన రచనల్లో మానవత్వం, సామాజిక బాధ్యత, విలువలు స్పష్టంగా ప్రతిబింబించేవి. సాధారణ మనుషుల జీవితాల్లోని భావోద్వేగాలను, సామాజిక వాస్తవాలను అతి సహజంగా కథల రూపంలో వ్యక్తీకరించడం ఆయన ప్రత్యేకతగా నిలిచింది. తెలుగు భాష పట్ల ఆయనకు అపారమైన అభిమానం ఉండేది. తన రచనల్లో తెలుగు భాషకు ప్రాధాన్యత ఇస్తూ, భాష పరిరక్షణపై పాఠకుల్లో చైతన్యం కలిగించేందుకు ప్రయత్నించేవారు.ఆయన రాసిన 'డైనోసార్స్ అండ్ తెలుగుస్' కథ ప్రత్యేకంగా గుర్తించదగినది. భవిష్యత్తులో డైనోసార్‌ల మాదిరిగానే తెలుగు భాష కూడా అంతరించిపోతుందా అనే ప్రశ్నను వ్యంగ్యంగా, విమర్శనాత్మకంగా ఆ కథలో ప్రతిబింబించారు. ఈ కథ పాఠకులను ఆలోచింపజేసే విధంగా ఉండి విపరీతంగా ఆకట్టుకుంది. తెలుగు భాష భవిష్యత్తుపై ఆయన వ్యక్తం చేసిన ఆందోళన, రచయితగా ఆయనలో ఉన్న బాధ్యతను స్పష్టంగా చూపించింది.

# కెసిఆర్‌ను కలిసి చేరుతా

మొదటి పేజీ తరువాయి



రెండు రోజుల్లో కేసీఆర్ ను కలుస్తానని ఆ తర్వాత ఈ విషయాన్ని ప్రకటిస్తానని చెప్పారు. తన శేష జీవితంలో కేసీఆర్‌తో పనిచేసే అవకాశం వచ్చిందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌తో కలిసి పనిచేస్తే.. రాష్ట్ర భవిష్యత్‌కు పాటుపడవచ్చన్నారు. 27 నెలల కాంగ్రెస్ పాలనలో చాలా క్షోభ అనుభవించినట్లు వెల్లడించారు. పరిపాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. మూడు సార్లు రైతుబంధు ఎగ్గొట్టిన ఈ ప్రభుత్వంపై రైతులు మండిపడుతున్నారన్నారు. ప్రభుత్వం 70 లక్షల మంది రైతులకు రూ.27 వేల కోట్లు బాకీ ఉందన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి స్థాయికి తగని మాటలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. మూడు నెలల్లో హామీలన్నీ అమలు చేస్తామని చెప్పింది మీరే కదా అని ప్రశ్నించారు. గ్యారెంటీ కార్డులు ప్రజలకు ఇచ్చింది కాంగ్రెస్ కాదా అని నిలదీశారు. నికార్సయిన కాంగ్రెస్ నాయకులను రేవంత్ రెడ్డి అవమానిస్తున్నారన్నారు. అధికారం ఉందనే అహంకారంతో రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని విమర్శించారు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసినప్పుడు.. భావోద్వేగానికి గురయ్యానని జీవన్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ కంటే మెరుగైన పాలన అందిస్తారని ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేశారన్నారు. కానీ కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో రాష్ట్రం తిరోగమన దిశలో నడిచిందని చురకలంటించారు.

# సూర్యుడి వాడి 40 దాటిన వేడి

మొదటి పేజీ తరువాయి

మిగతా అన్ని జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు. నేటి ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు. ఆ మేరకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 8న రాష్ట్రంలోని 20 జిల్లాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వాతావరణశాఖ తెలిపింది. వచ్చే మూడ్రోజులు ఈ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరుగుతాయని చెప్పింది. గతేడాదితో పోలిస్తే అన్ని జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వెల్లడించింది. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలో రాష్ట్రంలోనే అత్యధికంగా 41.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెంలో 41.5 డిగ్రీల సెల్సియస్, నల్లగొండ జిల్లా నేరడుగొమ్మలో 41.5 డిగ్రీల సెల్సియస్, సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో 41.4 డిగ్రీల సెల్సియస్, జనగామ జిల్లా పాలకుర్తిలో 41.2 డిగ్రీల సెల్సియస్, వరంగల్ జిల్లా సంగెంలో 41.2 డిగ్రీల సెల్సియస్, హైదరాబాద్‌లో 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని తెలిపారు.

**అప్రమత్తంగా ఉండండి..** పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్రమైన వడగాల్పుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎండలో శరీరం నుంచి చెమట రూపంలో నీరు, లవణాలు బయటకు పోతాయని.. కాబట్టి దాహం వేయకపోయినా తరచుగా నీరు తాగుతూ ఉండాలని చెబుతున్నారు. మంచినీటితో పాటు కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం వంటివి తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్స్ అందుతాయని అంటున్నారు. చక్కెర శాతం ఎక్కువగా ఉండే శీతల పానీయాలు, కెఫిన్ అధికంగా ఉండే కాఫీ, టీలకు దూరంగా ఉండటం మంచిదని సూచిస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత అత్యధికంగా ఉంటుందని.. అత్యవసరమైతే తప్ప ఈ సమయంలో బయటకు వెళ్లకపోవడమే మంచిదని అంటున్నారు. బయటకు వెళ్లాల్సి వస్తే వదులుగా ఉండే కాటన్ దుస్తులను ధరించాలని.. తలకు ఎండ తగలకుండా గొడుగు, టోపీ వంటివి ధరించాలి అంటున్నారు. కళ్లకు రక్షణగా సన్ గ్లాసెస్ వాడటం మంచిదని చెబుతున్నారు. వేసవిలో తేలికపాటి ఆహారం తీసుకోవాలని.. వృద్ధులు, చిన్న పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

# మహిళా కోటాపై కేంద్ర కేబినెట్ ఏకపక్ష నిర్ణయం

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**



**హైదరాబాద్, ఏప్రిల్ 9 (వుదయం ప్రతినిధి) :** మహిళా రిజర్వేషన్ల బిల్లు విషయంలో బీజేపీ మోసపూరితంగా వ్యవహరిస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఈ బిల్లు అమలులో 2011 జనాభా లెక్కలను ప్రతిపాదికగా తీసుకుంటామని చెప్పటం మహిళా లోకాన్ని మోసం చేయడమే అన్నారు. మహిళా కోటాకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో గురువారం ఆమె వీడియో సందేశం విడుదల చేశారు. ప్రస్తుతం చేపట్టే జనగణనలో ఓబీసీ గణన చేయాలని డిమాండ్ చేశారు. జనగణన లో కులం కాలమ్ ఉన్నా వాళ్లు ఓబీసీలకు చెందుతారు అనే క్లాసిఫికేషన్ లేదన్నారు. దీంతో బీసీల జనాభా ఎంత అనే లెక్క తేలదన్నారు. జనగణన లో ఓబీసీలను లెక్కించి ఆ తర్వాతే మహిళలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. మహిళా కోటా విషయంలో బీజేపీ చేస్తున్న అన్యాయంపై పోరాటానికి బీసీ మహిళలంతా సిద్ధం కావాలని కవిత పిలుపునిచ్చారు.

# ఎమ్మెల్యే పల్లాకు సైబర్ ఉచ్చు టోపీ

మొదటి పేజీ తరువాయి

చెప్పిన అకౌంట్ లో రూ. లక్ష జమా చేశారు. తర్వాత అనుమానం వచ్చి ఆరా తీయగా.. అది ఫేక్ కాల్ అని నిర్ధారణకు వచ్చారు. వెంటనే జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే... జనగామ ఎమ్మెల్యే పల్లా రాజే శ్వర్ రెడ్డికి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి, తనను తాను తెలంగాణ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ సెక్రెటరీ అనంత రామిరెడ్డిగా పరిచయం చేసుకున్నాడు. ప్రభుత్వ యంత్రాంగంలో కీలక పదవిలో ఉన్న వ్యక్తిగా నమ్మించడంతో ఎమ్మెల్యే సదరు వ్యక్తి మాటలను విశ్వసించారు.

# అరైవ్ అలైవ్ తో రోడ్డు భద్రత

**రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు విస్తృత అవగాహన**

**ఈ నెల 13 నుంచి 18 వరకు వారాంతరపు కార్యక్రమం**

**అన్ని జిల్లాల్లో రోడ్డు భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి**

**జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశాలు నిర్వహించుకోవాలి**

**జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో సీఎస్ రామకృష్ణా రావు**

**హైదరాబాద్, ఏప్రిల్ 9 (వుదయం ప్రతినిధి) :** అన్ని జిల్లాల్లో రోడ్డు భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పరిష్కార మార్గాలు అన్వేషించాలని సూచించారు. వెంటనే జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశాలు నిర్వహించడంతో పాటు ఈ నెల 13 నుంచి 18 వరకు వారాంతర "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు. ఇందులో స్థానిక ప్రజాప్రతినిధులనూ భాగస్వామ్యం చేసి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో "అరైవ్ అలైవ్" కార్యక్రమం అమలుపై ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు భద్రతపై తగిన చర్యలను చేపడుతున్నప్పటికీ, రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతూనే ఉందని ఆయన తెలిపారు. వాహనాల సంఖ్య పెరగడం, అతి వేగంతో డ్రైవింగ్ చేయడమే ఈ ప్రమాదాలకు కారణమని ఆయన పేర్కొన్నారు. ఈనెల 13 నుంచి 18వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా "అరైవ్–అలైవ్" కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి వివిధ కార్యకలాపాలను నిర్వహించాలన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రజల ప్రాణాలను రక్షించడానికి, రాష్ట్రవ్యాప్తంగా సురక్షిత రహదారులను ఏర్పాటు చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని సిఎస్ పేర్కొన్నారు. రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. "అరైవ్ అలైవ్" సాధారణ కార్యక్రమం కాదన్నారు. పలు శాఖల సమన్వయంతో కూడిన సమగ్ర చర్య అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ప్రధాన కార్యదర్శి క్రిస్టినా జోంగ్తు, కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్వీ కర్ణన్, సిఐపిఆర్ ప్రియాంక, జిల్లా కలెక్టర్లు, పోలీస్ సూపరింటెండెంట్లు, పోలీస్ కమిషనర్లు పాల్గొన్నారు.

13 నుంచి 18 వరకు కార్యక్రమ షెడ్యూల్ వివరాలు ఇలా ఉన్నాయి:

*13: గ్రామ స్థాయి రోడ్డు భద్రత కమిటీల ఏర్పాటు.

*14: అంబేద్కర్ జయంతి సందర్భంగా డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాల వద్ద రోడ్డు భద్రత ప్రమాణం చేయించడం.

*15: "చిల్డ్రన్ రోడ్ సేఫ్టీ డే" – నాలుగేళ్లకు పైబడిన పిల్లలకు సీట్ బెల్ట్ వినియోగంపై అవగాహన కార్యక్రమాలు.

*16: ప్రభుత్వ ఉద్యోగుల కోసం ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు – హెల్మెట్ , సీట్ బెల్ట్ వినియోగాన్ని ప్రోత్సహించడం, అలాగే సోషల్ మీడియాలో అవగాహన సందేశాలు, ఫోటోలు పంచుకోవడం.

*17: ప్రమాదాల అనంతరం తక్షణ సహాయం మెరుగుపరచడానికి "గోల్డెన్ అవర్" అత్యవసర స్పందన శిక్షణ కార్యక్రమాలు.

ఏప్రిల్ 18: ట్రాఫిక్ ఉల్లంఘనదారులకు కౌన్సెలింగ్ కార్యక్రమాలు – ప్రవర్తనా మార్పు, ట్రాఫిక్ నియమాల పాటించడంపై దృష్టి.

# ఏపీ, తెలంగాణ ఆదాయపన్ను ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా సురేశ్

**ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర**

**ప్రత్యక్ష పన్నుల బోర్డు**

**గతంలో హైదరాబాద్ రీజియన్‌లో**

**చీఫ్ కమిషనర్‌గా విధులు**



**హైదరాబాద్, ఏప్రిల్ 9 (వుదయం ప్రతినిధి) :** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఆదాయపన్ను ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా సీనియర్ ఐఆర్ఎస్ అధికారి సురేశ్ బత్తిని నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈ బాధ్యతల్లో ఉన్న మోరంపూడి అనిల్ కుమార్ స్థానంలో సురేశ్ బత్తిని బాధ్యతలు స్వీకరించనున్నారు. అనిల్ కుమార్ కూడా తెలుగు అధికారి కావడం, ఆయన స్థానంలో మరోసారి మరొక తెలుగు అధికారికి ఈ అత్యున్నత పదవి దక్కడం విశేషం. సురేశ్ బత్తిని గతంలో హైదరాబాద్ రీజియన్‌లోనే చీఫ్ కమిషనర్‌గా పనిచేసి మంచి గుర్తింపు పొందారు. రెండు రాష్ట్రాల్లోని పన్నుల పరిపాలన, ఆదాయ వసూళ్ల లక్ష్యాలు, శాఖాపరమైన అంశాలపై ఆయనకు పూర్తిస్థాయి అవగాహన ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆదాయపన్ను శాఖకు సంబంధించి ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ అనేది అత్యున్నత పదవి. పన్ను వసూళ్ల లక్ష్యాలను పర్యవేక్షించడంతో పాటు చెల్లింపుదారులకు మెరుగైన సేవలు అందించడం, శాఖాపరమైన పరిపాలనను సమన్వయం చేయడం వంటివి ఆయన ప్రధాన బాధ్యతలు. త్వరలోనే సురేశ్ బత్తిని హైదరాబాద్‌లోని ఆదాయపన్ను కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు చేపట్టనున్నారు.

# కవిత, రేవంత్ మధ్య రహస్య ఒప్పందాలు

**కవితకు సీఎం రేవంత్ స్పాన్సర్ షిప్**

**బీసీ సామాజిక వర్గాల పూర్తి మద్దతుతో తెలంగాణలో బీజేపీ బలోపేతం**

**జగిత్యాల ఎమ్మెల్యే ఎక్కడుంటే శని అక్కడ**

**రాష్ట్రంలో నాయకుల వలసలు, అంతర్గత కుమ్ములాటలతో విసిగిపోతున్న జనం**

**మీడియాతో నిజామాబాద్**

**ఎంపీ ధర్మపురి అర్వింద్**



**నిజామాబాద్, ఏప్రిల్ 9 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేపడుతోన్న కార్యక్రమాలకు, పార్టీ కార్యకలాపాలకు సీఎం రేవంత్ రెడ్డి స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆరోపించారు. వీరిద్దరి మధ్య రహస్య ఒప్పందాలు ఉన్నాయని విమర్శించారు. తెలంగాణలో బీసీ సామాజిక వర్గాల పూర్తి మద్దతుతో బీజేపీ బలోపేతం అవుతోందన్న ఆయన రానున్న రోజుల్లో పార్టీ మరింత పుంజుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. గురువారం నిజామాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం, రేవంత్, కవిత లోపాయికారీ ఒప్పందం.. పరస్పర సహకారంతో రాష్ట్రంలో రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఎక్కడుంటే అక్కడ శని ఉంటుందని అర్వింద్ విమర్శించారు. గతంలో బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు డాక్టర్ శ్రావణిని పార్టీ నుండి పంపించారన్న ఆయన ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరి సీనియర్ నేత జీవన్‌రెడ్డిని ఇబ్బందుల్లోకి నెట్టారని విమర్శించారు. ఈ విషయంలో సీనియర్ నేత జీవన్ రెడ్డి తొందరపడుతున్నారని అర్వింద్ అభిప్రాయపడ్డారు. సంజయ్ మళ్ళీ కాంగ్రెస్ వదిలి బీఆర్ఎస్‌లోకి వెళ్లడం ఖాయమని జోస్యం చెప్పారు. ఆయన వెళ్లే వరకు అక్కడ ప్రశాంతత ఉండదని ఎద్దేవా చేశారు. తెలంగాణ రాజకీయాల్లో నాయకుల వలసలు, అంతర్గత కుమ్ములాటలు చూస్తుంటే ప్రజలు విసిగిపోతున్నారన్నారు. అందుకే ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు చూస్తున్నారని అర్వింద్ పేర్కొన్నారు.

# జీవన్ రెడ్డి విమర్శలను జనం పట్టించుకోరు

**సీఎం రేవంత్ పోవాలని**

**చెప్పడానికి ఆయన ఎవరూ..?**

**ముందు గతంలో బీఆర్ఎస్‌పై చేసిన విమర్శలకు సమాధానం చెప్పాలి**

**కాంగ్రెస్ జీవన్ రెడ్డికి**

**14 సార్లు బి-ఫామ్ ఇచ్చింది**

**పొంగులేటిపై నిరాధార ఆరోపణలు వద్దు**

**ఆధారాలు తీసుకొస్తే గాంధీభవన్ లో చర్చకు సిద్ధం**

**మంత్రివర్గ విస్తరణ ఇప్పట్లో ఉండదు**

**మీడియాతో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**



**హైదరాబాద్, ఏప్రిల్ 9 (వుదయం ప్రతినిధి) :** కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి జీవన్ రెడ్డి చేస్తోన్న విమర్శలను ప్రజలు పట్టించుకునే పరిస్థితిలో లేరని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి పోవాలని చెప్పడానికి జీవన్ రెడ్డి ఎవరని ప్రశ్నించారు. కాంగ్రెస్ ను విమర్శించే ముందు జీవన్ రెడ్డి గతంలో బీఆర్ఎస్‌పై చేసిన విమర్శలకు సమాధానం చెప్పాలన్నారు. గురువారం గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ జీవన్ రెడ్డికి 14 సార్లు బి–ఫామ్ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా మించిదేమీ లేదన్నారు. పార్టీ మార్పుపై జీవన్ రెడ్డి పునరాలోచన చేయాలన్నారు. బీఆర్ఎస్, బీజేపీ వేర్వేరు కాదన్న ఆయన ఈ రెండు పార్టీలు రేపైనా కలుస్తాయన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో ఎవరు బాగుపడ్డది లేదని మార్పు వచ్చింది కాబట్టి బీఆర్ఎస్ పోయిందన్నారు. మంత్రులపై ఆరోపణలు సరికాదనీ వాటికి సంబంధించి హరీశ్ రావు వద్ద ఆధారాలు ఉంటే తీసుకురావాలన్నారు. పొంగులేటిపై వచ్చిన భూ కబ్జా, అక్రమాల ఆరోపణలపై ఆధారాలు ఉంటే బయటపెట్టాలని బీఆర్ఎస్ నేతలకు డిమాండ్ చేశారు. ఆ తర్వాత పొంగులేటి విషయంలో కాంగ్రెస్ ఆలోచిస్తుందన్నారు. పొంగులేటి పై విమర్శలు చేయడం కాదు ఆధారాలు ఉంటే గాంధీ భవన్‌కు వచ్చి ఇవ్వాలన్నారు.

**ఇప్పట్లో మంత్రివర్గ విస్తరణ లేదు:** మంత్రివర్గ విస్తరణ సీఎం పరిధిలోని అంశం అని మహేశ్ కుమార్ గౌడ్ తేల్చి చెప్పారు. తనకున్న సమాచారం ప్రకారం మంత్రి వర్గ విస్తరణలో ఇప్పట్లో ఉండదన్నారు. తాము అంతా కూడా ఎన్ఎస్‌యూఐ నుంచి వచ్చిన వాళ్ళమేనన్నారు. అందుకే నేడు ఎన్ఎస్ యూఐ ఆవిర్భావ దినోత్సవం జరుపుకుంటున్నామని చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్, వంశీ చంద్ రెడ్డి, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ , ఎస్సీ సెల్ చైర్మన్ శంకర్ నాయక్ అందరం అక్కడ నుంచి వచ్చిన వాళ్లమేనన్నారు.



# గ్రేటర్ హైదరాబాద్



## విద్యాశాఖ అధికారికి కౌన్సిలర్ విజ్ఞప్తి

**షాద్ నగర్ ఏప్రిల్ 09 (వుదయం) :**



షాద్ నగర్ మున్సపాలిటీ 16వ వార్డ్ క్రిస్టియన్ కాలనీ లో గల చిన్న కుంట బడిని 1 వ తరగతి నుండి 5 వ తరగతి కలదు కావున ఇట్టి స్కూల్ ను 1 వ తరగతి నుండి 7 వ తరగతి వరకు పొదగించాలని స్థానిక కౌన్సిలర్ ఒగ్గు జయలక్ష్మి కిషోర్ మండల అధికారి వినతి పత్రం అందచేశారు గతంలో కూడా మాజీ వైస్ చేర్మెన్ నటరాజ్ మాజి కో అప్షన్ సభ్యులు ఒగ్గు కిషోర్ ప్రతి పాధన చేసారు అప్పట్లో 16 లక్షల తో కాంపౌండ్ వాల్ నిర్మాణం స్కూల్ బెంచీలు వాష్ రూమ్స్ నిర్మించడం జరిగింది అని ఈ సందర్భంగా గుర్తు చేసారు IDBI బ్యాంక్ ద్వారా వాటర్ ప్లాంట్ మరియు కంప్యూటర్ లు కూడా ఏర్పాటు చేయడానికి కృషి చేశామని గుర్తు చేసారు వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఈసారి 20262027 అకాడమీక్ ఇయర్ అయినా అప్పర్ ప్రైమరి స్కూల్ గా ఏర్పాటు చేయాలనీ మండల విద్యాశాఖ అధికారికీ వినతి ప్రత్రం అందచేశారు.

## హరీష్ రావుకు స్వాగతం



గొల్లపల్లి - చీర్కపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి వ్యతిరేకంగా బహిరంగ సభలో పాల్గొనేందుకు వనపర్తి జిల్లాకు బయలుదేరిన మాజీ మంత్రి హరీష్ రావును బైపాస్ లో స్వాగతం పలికిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, బీఆర్ఎస్ శ్రేణులు.

# రూ.8కోట్లతో అభివృద్ధి పనులు

### శ్రీకారం చుట్టిన పట్నం మహేందర్ రెడ్డి

**మేడ్చల్, మల్కాజిగిరి, ఏప్రిల్ 9 (వుదయం ప్రతినిధి ) :**

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ డిగ్రీ తదితర కళాశాలలతో పాటు పాఠశాలల్లోనూ మౌలిక సదుపాయాల కల్పన కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. గురువారం మేడ్చల్ జిల్లా కూకట్పల్లి లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ. 8 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. మేడ్చల్ జిల్లాలోని అంగన్వాడి సెంటర్ల టీచర్లకు సెల్ఫోన్లను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కలెక్టర్ మను చౌదరి తో కలిసి పంపిణీ చేశారు. రూ.4.95 కోట్ల పీఎం ఉషా గ్రాంట్స్ నిధులతో కళాశాల జీ,1 భవనం ప్రారంభించగా, రూ. 2.84 కోట్ల డీఎంఎఫ్టీ నిధులతో జీ 2 లో అదనపు గదులు, మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జీవీ(జువీ ) కింద నవ గురుకుల సంస్థ ద్వారా 86 మంది నిరుపేద విద్యార్థులకు ఉచిత లాప్ టాప్ పంపిణీ తో పాటు ఏడాది పాటు శిక్షణ శిబిరం ప్రారంభించారు.



ఈ సందర్భంగా పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా అభివృద్ధికి ప్రభుత్వం చేస్తుందన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో చదవడం అనేది రేషన్ గా మారిన తరుణంలో గతంలో ఆలోచిస్తే గొప్ప వాళ్ళంతా ప్రభుత్వ విద్యాలయాల్లో చదివారని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటుతో రాష్ట్రంలో విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులు వస్తాయని మహేందర్ రెడ్డి తెలిపారు. పాఠశాల తో పాటు ఇంటర్ డిగ్రీ విద్యార్థులు కష్టపడి చదవాలని మంచి ఫలితాలు సాధించి రాష్ట్ర గౌరవ ప్రతిష్టలను దేశ వ్యాప్తం చేయాలని మహేందర్ రెడ్డి విద్యార్థులకు సూచించారు.

కూకట్పల్లి లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలకు స్థలం కోసం ముఖ్యమంత్రి కి నివేదిస్తామని అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు సహజసిద్ధమైన, సృజనాత్మకతతో గొప్ప వ్యక్తులుగా ఎదగాలని తెలిపారు. తాము గతంలో ఇంజనీరింగ్ ప్రస్తుతం మేడ్చల్ విద్యాసంస్థలను నిర్వహించామని కూకట్ పల్లిలో అవసరమైతే ఆ సంస్థల ద్వారా డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల అభివృద్ధికి సహకరిస్తామని వివరించారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ ప్రణాళిక ప్రకారం క్రమశిక్షణ తో చదవాలని, విజయాలు వెతుక్కుంటూ వస్తాయని చెప్పారు. ఏఐ ని సద్వినియోగం చేసుకోవాలని తద్వారా వార్తా పత్రికలు, ప్రచార సాధనాలను తమ జీవిత లక్ష్యాల సాధన కోసం వాడుకొని రాష్ట్ర, దేశ, ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా విద్యాభ్యాసం సాగించాలన్నారు. తను ప్రభుత్వ కళాశాలలోనే చదువుతూ ఆవిష్కరణలకు ప్రయత్నించి విజయం సాధించాలని వెల్లడించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ గతంలో నియోజకవర్గంలో అభివృద్ధి కోసం తమకు మహేందర్ రెడ్డి ఎంతో సహకరించారని చెప్పారు.

కూకట్పల్లి డిగ్రీ , జూనియర్ కళాశాలలకు ప్రభుత్వం ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. గతంలో జిల్లా పరిషత్ చైర్పర్సన్ గా సునీత రెడ్డి, మంత్రిగా మహేందర్ రెడ్డి సహకరించినట్లుగా కళాశాల అభివృద్ధికి తాము సహకరిస్తాం.

కళాశాల ప్రిన్సిపల్ చందన మాట్లాడుతూ కళాశాలలో 1687 మంది డిగ్రీ విద్యార్థులు, 1700 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నట్టు వివరించారు. కళాశాలలో చాలామంది చదువుకున్న విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిష్టించారని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింగ్ యాదవ్ లు, తదితరులు పాల్గొన్నారు.

## సికింద్రాబాద్ జీఎంకు లేఖ



**శంకర్ పల్లి ఏప్రిల్ 09 (వుదయం) :**

రావులపల్లి కలాన్ మండల్ శంకర్పల్లి పరిధిలో కరుణ టైంలో రైలు ఆపకపోవడం వల్ల గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. అయితే కరుణం పూర్తయి ఎన్నో సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ రైలు స్టాప్ పునరుద్ధరించకపోవడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోంది. ఉద్యోగులు, విద్యార్థులు, రైతులు, మహిళలు నిత్యం ప్రయాణానికి ఇబ్బందులు పడుతూ ఇతర స్టేషన్లకు వెళ్లాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు.

ఈ సమస్యపై గురువారం రోజున గ్రామ ప్రజాప్రతినిధులు సికింద్రాబాద్లోని రైల్వే నిలయానికి వెళ్లి జీఎంకు వినతిపత్రం అందజేశారు. వానరాసి సువర్ణ కృష్ణమూర్తి సర్పంచ్, బొజ్జ సరిత వెంకట్ రెడ్డి ఉపసర్పంచ్, మాజీ జెడ్పీటీసీ కె. నారాయణ, మాజీ సర్పంచ్ ఉత్తరపల్లి ప్రేమవర్తి రాములు, ఎం. ప్రభు, కె. బుచ్చయ్య, కె. నర్సింలు తదితరులు రైల్వే అధికారులను కలిసి గ్రామ ప్రజల సమస్యను వివరించారు.

ఈ కార్యక్రమంలో వార్డ్ నెంబర్ సుప్రజ, శ్రీకాంత్ రెడ్డి, పి. మీనా, మల్లేశం, ఉత్తరపల్లి ప్రభాకర్, పట్నం రాజు, జి. సురేష్, ఎండి. అంజిత్, బి. సునీత, సురేందర్, ఎండి. సద్దాం తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు. రైలు స్టాప్ పునరుద్ధరించకపోతే ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరిస్తూ, ఇప్పటికైనా ట్రైన్ ఆపాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

## ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ ఖండన



**చేవెళ్ల,ఏప్రిల్ 9 (వుదయం) :**

భారతీయ జనతా పార్టీ (బీజేపీ), ఆర్ఎస్ఎస్లపై కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలను భాజపా చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అత్తిలి అనంతరెడ్డి తీవ్రంగా ఖండించారు.చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో గురువారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ...దేశ నిర్మాణంలో విశేష సేవలు అందించిన సంస్థలపై నిరాధార ఆరోపణలు చేయడం దురదృష్టకరమని అన్నారు. ఆర్ఎస్ఎస్ దేశభక్తి, సేవా భావంతో దశాబ్దాలుగా సమాజానికి సేవలందిస్తున్నదని, అలాంటి సంస్థను రాజకీయ ప్రయోజనాల కోసం లక్ష్యంగా చేసుకోవడం సరికాదని స్పష్టం చేశారు.నాయకులు ప్రజల మధ్య విభేదాలు సృష్టించే విధంగా, దేశ సమగ్రతకు భంగం కలిగించే విధంగా వ్యాఖ్యలు చేయడం తగదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు ,బాధ్యతాయుతంగా వ్యవహరించి, ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలను నివారించాలని సూచించారు. భాజపా దేశ అభివృద్ధి, సంక్షేమం కోసం కట్టుబడి పని చేస్తోందని, ప్రజల ఆశీస్సులతో ముందుకు సాగుతోందని తెలిపారు. దేశ ప్రజలు నిజానిజాలను అర్థం చేసుకునే స్థితిలో ఉన్నారని, ఇలాంటి వ్యాఖ్యలను వారు ఖండిస్తారని అన్నారు.ఇకపై జాతీయ భావజాలాన్ని దెబ్బతీసే విధంగా ఎవరైనా వ్యాఖ్యలు చేస్తే భాజపా తరపున తగిన రీతిలో ప్రతిస్పందిస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో పార్టీ నాయకులు అశోక్ చంద్రశేఖర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

## కో-ఆప్షన్ సభ్యుల ఎంపిక పూర్తి

**శంకర్ పల్లి ఏప్రిల్ 09 (వుదయం)**



శంకర్పల్లి మున్సిపాలిటీలో కోఆప్షన్ సభ్యుల ఎంపిక ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. ఈ మేరకు మున్సిపల్ చైర్పర్సన్ సాతా ప్రవీణ్ కుమార్ గురువారం అధికారికంగా కోఆప్షన్ సభ్యుల పేర్లను ప్రకటించారు. మున్సిపాలిటీ పరిధిలో పాలనను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ ఎంపిక ప్రక్రియ చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. కోఆప్షన్ సభ్యుల నియామకం ద్వారా పట్టణ అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా ముందుకు సాగుతాయని చైర్పర్సన్ అభిప్రాయపడ్డారు.

ఈ సమావేశంలో కౌన్సిల్ సభ్యుల సమక్షంలో కోఆప్షన్ సభ్యుల ఎంపికపై చర్చ జరిపి, అనంతరం ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. మున్సిపాలిటీలో ప్రజా ప్రతినిధిత్వాన్ని మరింత విస్తరింపజేయడంతో పాటు వివిధ వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పించేందుకు కోఆప్షన్ విధానం ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. ప్రత్యేక అనుభవం కలిగిన కేటగిరీ కింద చంగల్ బాలకృష్ణారెడ్డి, ముల్తంకర్ రజని మణి గార్డెన్లను కోఆప్షన్ సభ్యులుగా ఎంపిక చేసినట్లు చైర్పర్సన్ వెల్లడించారు.

అల్పసంఖ్యాక వర్గాల ప్రతినిధిత్వాన్ని మరింత బలోపేతం చేసేందుకు అల్పసంఖ్యాక కేటగిరీ కింద ఎండి. మహమూద్ (గొల్లగు), సౌజియా సుల్తానాలను కోఆప్షన్ సభ్యులుగా ఎంపిక చేసినట్లు తెలిపారు.

మొత్తంగా ఐదుగురిని కౌన్సిల్ సభ్యుల పూర్తి ఆమోదంతో ఏకగ్రీవంగా కోఆప్షన్ సభ్యులుగా ఎంపిక చేసినట్లు చైర్పర్సన్ సాతా ప్రవీణ్ కుమార్ ప్రకటించారు. శంకర్పల్లి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయడం, పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడం కోసం ప్రతి ఒక్కరూ సమిష్టిగా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానన్ని పెంచుకోవాలి

**మేడ్చల్ / మల్కాజ్గిరి, ఏప్రిల్ 9 (వుదయం ప్రతినిధి ) :**



చదువుతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని అందులో నైపుణ్యతను పొంది మీ ప్రతిభను మెరుగు పరుచుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి విద్యార్థులకు బోధించారు. గురువారం కూకట్ పల్లి మండలంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ (బాలురు) స్కూల్ మరియు జూనియర్ కాలేజీ ని సందర్శించి విద్యార్థులతో కలిసి కలెక్టర్ మధ్యాహ్న భోజనం చేసారు. ఈ సందర్భగా కలెక్టర్ మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం విద్యార్థులకు మెనూ ప్రకారం ప్రతి రోజు సమయానికి పౌష్టిక ఆహారాన్ని అందించాలని, వసతి గృహంలో అందుతున్న బోధన పై ప్రిన్సిపల్ ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ చదువుతో పాటు మీకు ఇష్టమైన స్పోర్ట్స్, గేమ్స్, మీ అభిరుచులలో కూడా మీ ప్రతిభను బయటపెట్టి అందులో మీరు రాణించేలా మీకు అవసరమైన శిక్షణను అందించడానికి ప్రభుత్వం సిద్దంగా ఉందని అన్నారు. మీ పై మీకు ఆత్మవిశ్వాసం ఉండాలని, బిడియాన్ని వదిలి మీకు తెలిసిన విషయాన్ని నలుగురిలో మాట్లాడగలగాలని అప్పుడు మీపై మీకు నమ్మకం కలుగుతుందన్నారు. చదువుతో పాటు మారుతున్న టెక్నాలజీని ఎలా వినియోగించుకోవాలో తెలుసుకొని ఎక్కువ శ్రమ పడకుండా స్మార్ట్ వర్క్ చేయాలని తద్వారా టైమ్ సేవ్ అవుతుందన్నారు. ప్రస్తుతం చాట్ జిపిటి, జెమిని, పెర్ప్లెక్సిటి వంటి ఎఐ టూల్స్ ఎక్కువగా వినియోగించడం జరుగుతుందన్నారు. ఎఐ టూల్స్ ద్వారా పెయింటింగ్, వెబ్ డిజైనింగ్, ప్రోగ్రామింగ్, ఫ్యాషన్ టెక్నాలజీ చాలా అభివృద్ధి చెందిందన్నారు. మంచి అలవాట్లను అలవర్చుకోండి, అవి మీ భవిష్యత్తు ప్రయత్నాలలో ఎల్లప్పుడూ తోడ్పడతాయని, ఆత్మవిశ్వాసంతో ఉండాలంటే మీకు సబ్జెక్ట్ మీద అవగాహన ఉండాలని, సబ్జెక్ట్ అంటే కేవలం అకాడమిక్స్ మాత్రమే కాదని, ప్రపంచంలో ఏం జరుగుతుందో తెలుసుకొని ఆ అంశం పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి తహసీల్దార్ స్వామి, ప్రిన్సిపల్ టీచర్లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## కౌకుంట్లలో బెల్ట్ షాపుల నిషేధం



**చేవెళ్ల, ఏప్రిల్ 9 (వుదయం) :**

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలోని కౌకుంట్ల గ్రామంలో బెల్ట్ షాపుల నిర్మూలనకు గ్రామస్థులు కీలక నిర్ణయం తీసుకున్నారు. గురువారం మహిళా సంఘాలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్, గ్రామ సెక్రటరీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం ఆమోదించారు.గ్రామంలో బెల్ట్ షాపుల ద్వారా విచ్చలవిడిగా మద్యం విక్రయం జరుగుతోందని, దీని వల్ల అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని సమావేశంలో సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం వ్యసనం కారణంగా కొందరు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు, కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతిన్న విషయాలను ప్రస్తావించారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని బెల్ట్ షాపులను పూర్తిగా నిషేధించాలని నిర్ణయించారు.


**కఠిన చర్యలు ప్రకటింపు**

నిబంధనలు ఉల్లంఘించి మద్యం విక్రయించే వారిపై రూ.1 లక్ష జరిమానా మద్యం కొనుగోలు చేసే వారిపై రూ.50,000 జరిమానా సమాచారం అందించిన వారికి రూ.10,000 ప్రోత్సాహకం ఈ నిర్ణయంపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, గ్రామ అభివృద్ధి కోసం ఇది మంచి ముందడుగు అని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లారెడ్డి, సెక్రటరీ సునీత, పాలకవర్గ సభ్యులు, యువజన సంఘాలు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రూ.40 లక్షల రోడ్ల పనులకు శంకుస్థాపన

**శంకర్ పల్లి, ఏప్రిల్ 09 (వుదయం):**

గ్రామాల అభివృద్ధికి రహదారులే ప్రాణమని, సీసీ రోడ్లు నిర్మాణం ద్వారా గ్రామాలు మట్టి దారుల నుంచి శాశ్వత అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నాయని చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య అన్నారు. గురువారం శంకర్పల్లి మండలంలో అభివృద్ధి పనులకు మరింత ఊపునిచ్చేలా సంకేపల్లి గ్రామంలో రూ.20 లక్షలు, మాసాని గూడ గ్రామంలో రూ.20 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన ఘనంగా శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు పట్టణ స్థాయిలో సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామాల ముఖచిత్రం మారేలా అభివృద్ధి పనులను నిరంతరం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ గ్రామాల్లో ఇప్పటికీ చాలా చోట్ల మట్టి రోడ్లు ఉండటంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.



వర్షాకాలంలో రోడ్లు బురదమయమై ద్విచక్ర వాహనదారులు పడిపోవడం, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేక ఇబ్బంది పడటం, మహిళలు, వృద్ధులు రాకపోకల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం వంటి సమస్యలు తరచూ కనిపిస్తున్నాయని అన్నారు. వేసవిలో దుమ్ము ధూళి కారణంగా శ్వాసకోశ వ్యాధులు పెరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులకు పూర్తిస్థాయి పరిష్కారం సీసీ రోడ్లేనని, ఇవి నిర్మితమైతే ప్రజల జీవనశైలి పూర్తిగా మారిపోతుందని ఎమ్మెల్యే వివరించారు. రోడ్లు అభివృద్ధి అయితే గ్రామాల్లో ఆర్థిక చలనం కూడా పెరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. గ్రామస్థులు మాట్లాడుతూ సీసీ రోడ్ల నిర్మాణం వల్ల గ్రామాల్లో అభివృద్ధి వేగం పెరుగుతుందని, ముఖ్యంగా పిల్లలు పాఠశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు తగ్గుతాయని అన్నారు. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను సులభంగా తరలించగలరని, గ్రామాల్లో వ్యాపారాలు పెరిగే అవకాశాలు కూడా ఏర్పడతాయని తెలిపారు. మహిళలు, వృద్ధులు రాకపోకల్లో ఎదుర్కొనే సమస్యలు పూర్తిగా తీరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక అధికారులు కూడా పనులు త్వరగా ప్రారంభించి నిర్ణీత గడువులో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సహకారంతో శంకర్పల్లి మండలాన్ని అభివృద్ధి పరంగా ఆదర్శంగా నిలబెట్టేందుకు అందరూ కలిసి పనిచేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు.

## 'అరైవ్ అలైవ్' ను సమర్థవంతంగా నిర్వహించాలి

**రంగారెడ్డి జిల్లా, ఏప్రిల్ 09 (వుదయం):**



99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా "అరైవ్ అలైవ్" కార్యక్రమం అమలుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు గురువారం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, సమీక్షించారు.

ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు భద్రతపై తగిన చర్యలను చేపడుతున్నప్పటికీ, రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతూనే ఉందని ఆయన తెలిపారు. వాహనాల సంఖ్య పెరగడం, అతి వేగంతో డ్రైవింగ్ చేయడమే ఈ ప్రమాదాలకు కారణమని ఆయన పేర్కొన్నారు.

దీనిపై జిల్లా కలెక్టర్లు రోడ్డు భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పరిష్కారాలను కనుగోనాలని ఆయన ఆదేశించారు. జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశాలను తక్షణమే నిర్వహించి, వారాంతర "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. దీనిలో భాగంగా స్థానిక ప్రజాప్రతినిధులను కూడా భాగస్వామ్యం చేసి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆయన పేర్కొన్నారు.

ఈనెల 13 నుంచి 18వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా "అరైవ్అలైవ్" కార్యక్రమాన్ని నిర్వహించబడుతుందని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి వివిధ కార్యకలాపాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేస్తూ ప్రజల ప్రాణాలను రక్షించడానికి, రాష్ట్రవ్యాప్తంగా సురక్షిత రహదారులను ఏర్పాటు చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని సిఎస్ పేర్కొన్నారు.

రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి గారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం సాధారణ కార్యక్రమం కాదని, ఇది పలు శాఖల సమన్వయంతో కూడిన సమగ్ర చర్య అని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా పాదచారులు ,ద్విచక్ర వాహనదారులే బాధితులవుతున్నారని, దీనిపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను చేపట్టడం అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. గత మూడు నెలల్లో రోడ్డు భద్రత చర్యల్లో గణనీయమైన పురోగతి సాధించినట్లు కూడా తెలిపారు.


**IN THE COURT OF THE HON'BLE VII JUNIOR CIVIL JUDGE COURTCITY CIVIL COURT HYDERABAD AT:HYDERABAD**

**O.S.No: 726 OF 2026**

**Between:**

Ksheera Sagar Geetha Rani ...**Plaintiff**

**AND**

1. Mandal Revenue Office Golconda,13-6-823/6/A, Fort Rd, Mehdi Colony,Langar Houz, Hyderabad, Telangana 500008
2. All concerned

...**Defendants**

Please take notice that the Plaintiff herein has filed the above suit to declare the Plaintiff as the legal heir of Late Ksheera Sagar Ajay who died intestate on Dated: 05.11.2024

The above said suit is posted on Dated:13.04.2026 at 10:30 A.M, for your (Defendant No.1) appearance, either in person or through, your learned counsel duly instructed to answer the claim, failing which the above matter will be decided in your absence as per law.

**(BY ORDER OF THE COURT)**

Sd/-
**M/s. Aditya Law Firm**
**Laxmikantham T Vukkalkar**
**Pawan T Vukkalkar**
**Manoj T Vukkalkar**
**Vinay T Vukkalkar**
**Karthik T Vukkalkar**
**Advocates**
**9704829022, 9010268633**


## శ్రద్ధాంజలి

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 9, (వుదయం ప్రతినిధి ):** లక్ష్మీనారాయణ ఆకస్మిక మరణం పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 17వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో కాలనీ వాసులు ఘనంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ అందరూ ఘన నివాళులర్పించారు.




# సీఆర్పీఎఫ్ శౌర్య దివస్‌ను ఘనంగా నిర్వహణ

శంకర్ పల్లి, ఏప్రిల్ 09 (వుదయం) శంకర్పల్లి పట్టణంలో యువ శౌర్య సేన ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్ శౌర్య దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించి, వారి త్యాగాలను స్మరించుకున్నారు. దేశభక్తి భావాలను పెంపొందించేలా నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజల్లో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపింది.

ఈ సందర్భంగా యువ శౌర్య సేన ఫౌండర్/ప్రెసిడెంట్ రవీందర్ యాదవ్ మాట్లాడుతూ, 1965 ఏప్రిల్ 09 తెల్లవారుజామున పాకిస్తాన్ సైన్యం గుజరాత్‌లోని సర్దార్ పోస్టుపై మెరుపు దాడి చేసిన చారిత్రక ఘటనను గుర్తు చేశారు. ఆ సమయంలో విధులు నిర్వహిస్తున్న రెండవ బెటాలియన్ సీఆర్పీఎఫ్ జవాన్లు అత్యంత ధైర్యసాహసాలతో పోరాడి పాక్ సైన్యాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టారని తెలిపారు. ఈ పోరాటం భారత సరిహద్దు భద్రత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు.

ఈ వీరోచిత పోరాటంలో ఆరుగురు సీఆర్పీఎఫ్ జవాన్లు దేశం కోసం ప్రాణాలు అర్పించి అమరులయ్యారని రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. అయితే వారి త్యాగం వృథా కాలేదని, సీఆర్పీఎఫ్ సిబ్బంది 34 మంది పాక్ సైనికులను హతమార్చి మరో నలుగురిని బందీలుగా పట్టుకున్నారని వివరించారు. దేశ రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయని జవాన్ల శౌర్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు.




ప్రతి సంవత్సరం ఏప్రిల్ 09ను దేశ వ్యాప్తంగా సీఆర్పీఎఫ్ శౌర్య దివస్‌గా జరుపుకోవడం వెనుక ఉన్న ఉద్దేశ్యం దేశభక్తి, నిస్వార్థ సేవ, సరిహద్దు రక్షణలో జవాన్ల త్యాగాలను గుర్తుచేసుకోవడమేనని తెలిపారు. ఈ రోజు భారతదేశానికి గర్వకారణమైన రోజు అని, జవాన్ల ధైర్యసాహసాలు ఎప్పటికీ మరువలేనివని యువత హృదయాల్లో నిలిచిపోతాయని పేర్కొన్నారు. దేశాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరూ ఈ శౌర్య దివస్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.


ఈ కార్యక్రమంలో యువ శౌర్య సేన వైస్ ప్రెసిడెంట్ పి. గంగాధర్‌తో పాటు పలువురు సభ్యులు పాల్గొని అమర వీరులకు నివాళులు అర్పించారు. అలాగే యువ శౌర్య సేన ఫౌండర్/ప్రెసిడెంట్ రవీందర్ యాదవ్ బ్లాక్ బెల్ట్ సిక్స్ డాన్‌గా గుర్తింపు పొందిన వ్యక్తిగా, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ మరియు ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ గ్రహీతగా పేరొందిన విషయాన్ని ఈ సందర్భంగా సభ్యులు ప్రస్తావించారు. దేశభక్తి కార్యక్రమాలతో పాటు యువతకు శౌర్యం, క్రమశిక్షణ, సేవాభావం నేర్పించడమే యువ శౌర్య సేన ప్రధాన లక్ష్యమని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా శంకర్‌పల్లి ప్రాంత ప్రజల్లో దేశభక్తి భావం మరింత బలపడిందని, ఇలాంటి కార్యక్రమాలు కొనసాగించాలని పలువురు అభిప్రాయపడ్డారు. యువ శౌర్య సేన సభ్యులు దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల స్ఫూర్తితో సమాజసేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని నిర్ణయించారు.



> "పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల జాబితాలను పరిపాలనాపరంగా సాధారణంగా నవీకరించడానికి విరుద్ధంగా, 'తార్కిక స్థిరత్వం' వంటి ఏకపక్ష ప్రమాణాలు, పారదర్శకమైన, క్షేత్రస్థాయి ధృవీకరణకు బదులుగా సర్ అల్గోరిథమ్–ఆధారిత మినహాయింపులపై ఆధారపడి, సామూహిక ఓటు హక్కును హరించే ఒక క్రమబద్ధమైన చర్య సర్ అని మేం మొదటి నుంచీ భావిస్తూ వస్తున్నాం. ఓటరును అనుమానితుడిగా పరిగణించారు. తాము అనుమానితులు కాదని నిరూపించుకోవాల్సిన భారం వారిపైనే పడింది. ఇది ఆర్థిక నష్టం, అసౌకర్యం, మానసిక క్షోభ మరణాలకు కూడా కారణమైంది. ఇటువంటి తొలగింపులు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 కింద ఓటు హక్కుకు కల్పించిన రాజ్యాంగ హామీని ఉల్లంఘిస్తాయి."
>
> –ఎం.ఏ. బేబీ. ప్రధాన కార్యదర్శి, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)

## వే'మన'పద్యం

**మాటలాడు టొకటి మనసులో నొక్కటి**
**ఒడలిగుణము వేరె యోజవేరె**
**ఎట్లుగల్గు ముక్తి యీలాగు తానుండ**
**విశ్వదాభిరామ! వినురవేమ**



## సంపాదకీయం

# పోలీసులకు మరణశిక్షలు

ఇంత ఘాతుకానికి పాల్పడినవారికి యావజ్జీవశిక్షతో సరిపుచ్చడం సరికాదు– తమిళనాడులోని సత్తంకుళం జంట లాకప్ హత్యల కేసులో ఒకేసారి తొమ్మిది మంది పోలీసులకు మరణశిక్ష విధిస్తూ ఇచ్చిన తీర్పులో జడ్జి అన్న మాటలివి. నేర మనస్తత్త్వం గలవారిలో భయాన్ని కలిగించి అటువంటి ఘాతుకాలకు మళ్ళీ పాల్పడకుండా చేస్తాయనే ఆశతోనో, ఇంతటి అమానుషాన్ని తగినరీతిలో శిక్షించాలనే ధర్మ కసితోనో జడ్జి వారికి మరణ శిక్ష విధించారని అర్థమవుతున్నది.మంచి పోలీసులు, మంచి సమాజం కోసం జడ్జి పడిన ఆరాటం ఎంతైనా అర్థం చేసుకోదగినది.ఇటువంటి తీర్పులు వెలువడినప్పుడు సమాజం తనను తాను సరిచేసుకునే ప్రయత్నాన్ని ఏ కొంచెమైనా చేస్తుంది. కాని ఒక నేరస్థుణ్ణి ఉరితీసినంతమాత్రాన అటువంటి నేరం మళ్ళీ జరగబోదనే గ్యారంటీ ఉండబోదు.నిర్భయ కేసులో తీవ్ర శిక్షలు విధించినంత మాత్రాన అటువంటి దారుణాలు ఆగిపోయాయా? ఎంత కఠినంగా శిక్షించినా అదే తరహా నేరాలు పదే పదే సంభవిస్తున్నాయి. 2020 జూన్ 19 న కోవిడ్ తరుణంలో, వేళ మీరి సెల్ ఫోన్ దుకాణాన్ని నడుపుతున్న జయరాజ్ ను తమిళ నాడులోని సత్తంకుళం పోలీసులు అరెస్టు చేశారు.ఆ రోజు కర్ఫ్యూ ప్రకటించిన తర్వాత 15 నిమిషాల కు కూడా షాప్ నడుస్తోంది అన్నది పోలీసుల అభియోగం. జయరాజ్ పోలీసులతో వాగ్వాదానికి దిగడం ఇందులోని ముఖ్యాంశం. తండ్రిని విడిపించడానికి వెళ్లిన జయరాజ్ కుమారుడు బెన్నిని కూడా లోపలకు తీసుకుపోయి పోలీసులు చితక బాదడం ప్రారంభించారు. అలా కొన్ని గంటలపాటు నిర్దాక్షిణ్యంగా కొట్టడంతో తండ్రి కొడుకు లిద్దరూ విపరీతంగా రక్తం కోల్పోయారు, ఆ రక్తాన్ని వారి చేతనే వారి గుడ్డలతోనే తుడిపించి ఆ తర్వాత ఆసుపత్రిలో చే ర్పించగా ఒకరి తర్వాత ఒకరు మరణించారు. నిందితులతో తప్పు ఒప్పించడానికి లాకప్ ను పోలీసులు ఎంత బీభత్సంగా వాడుకుంటారో అందరికీ తెలుసు. ఇది సినిమాల్లో చూపిస్తున్నదానికంటే వాస్తవంలోనే ఎక్కువ అమానుషంగా ఉంటుందనడం అతిశయోక్తి కాదు. మన పోలీస్ సంస్కృతి మనం నెలకొల్పుకున్న ప్రజాస్వామ్య వ్యవస్థకు అనుకూలమైనది కాదు.బ్రిటిష్ వారి అణచివేత ధోరణి, మన ఫ్యూడల్ పెత్తందారీ వారసత్వం కలగలిసి పోలీసు వ్యవస్థను వరించాయి. తమను ప్రశ్నించరాదు, తమ ఎదుట నిటారుగా నిలబడరాదు , తాము అడిగింది నిరాకరించరాదు, అలా చేస్తే తమ చేతిలో చావు తప్పదు.కూలంకషంగా దర్యాప్తు చేసి నేర నిర్ధారణ చేయడానికి బదులు తమ కనుచూపు మేరలోని పేదవారిని నేరస్థులుగా పరిగణించి జైళ్లకు పంపించడంలో పోలీసులదే ఎక్కువ బాధ్యత అనే అభిప్రాయం నెలకొని వుంది.సమాజం మీద చట్టబద్ధంగా రుద్దబడిన ఈ పోలీస్ వ్యవవస్థకు అధికారంలో ఉండే రాజకీయ శక్తుల దన్ను దానిని మరింత క్రూరంగా మారుస్తున్నది. ఒకే సారి తొమ్మిది మంది పోలీసులకు విధించిన ఉరి శిక్ష చివరికి నిలుస్తుందో లేదో చెప్పలేము. వ్యక్తి సాటి వ్యక్తిని చంపడానికి, చట్టమే ఉరి తీయడానికి తేడా వుంది. ఈ తేడాను గమనించిన చాలా దేశాలు ఉరి శిక్ష ను రద్దు చేశాయి. సమాజం చైతన్యవంతం అవుతున్నకొద్దీ లాకప్ హింసలు, హత్యలు, అత్యాచారాలు కూడా తగ్గుతున్నాయి. ప్రజ ల లో ప్రజాస్వామిక స్ఫూర్తి పెరగడమొక్కటే అన్ని ముష్కరత్వాలకు సరైన విరుగుడు. ఈ కేసులో పోలీస్ స్టేషన్క లోని పు మరకలను చూపి తోడ్పడిన ఆ నాటి మహిళ పోలీస్ రేవతి ఎంతయినా అభినందనీయురాలు. చట్టం తమకు ఇచ్చిన అపరిమితమైన అధికారాలు తమవి కావనే స్పృహ పోలీసుల్లో పెరగాలి. అప్పుడే వారు దారికి రాగలరు.

### రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# విప్లవం నుంచి ఆధునిక అభివృద్ధి నమూనా వరకు

1957 సంవత్సరంలో భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక విశిష్ట ఘట్టం ఆవిష్కృతమైంది. స్వాతంత్ర్యం అనంతరం తొలి దశలోనే దేశ రాజకీయాల్లో ప్రధానంగా జాతీయ కాంగ్రెస్ ఆధిపత్యం కొనసాగుతున్న సమయంలో, ప్రజాస్వామ్య పద్ధతిలోనే ఒక కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి రావడం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ఆ చారిత్రక సంఘటన కేరళ రాష్ట్రంలో చోటుచేసుకుంది. భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ రాజకీయ విప్లవానికి నాయకత్వం వహించినవారు ఇ. ఎం. ఎస్. నంబూద్రిపాద్. ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రపంచంలోనే తొలి కమ్యూనిస్టు ప్రభుత్వం ఇదేనని చరిత్రకారులు గుర్తిస్తారు. ఇది కేవలం ఒక పార్టీ విజయం మాత్రమే కాదు, శతాబ్దాల తరబడి పేరుకుపోయిన సామాజిక అసమానతలపై సామాన్యుడు సాధించిన సంచలనాత్మక విజయం.భారతదేశ రాజకీయ పటంలో కేరళ రాష్ట్రానిది ఒక ప్రత్యేకమైన గుర్తింపు. వైవిధ్య భరితమైన భౌగోళిక పరిస్థితులు, అత్యధిక అక్షరాస్యత, విలక్షణమైన సామాజిక చైతన్యం కేరళను దేశంలోని ఇతర రాష్ట్రాల కంటే భిన్నంగా నిలబెట్టాయి.

1950వ దశకంలో కేరళ సామాజిక చిత్రం అత్యంత క్లిష్టంగా ఉండేది. భూస్వామ్య వ్యవస్థ వేళ్లూనుకుని ఉండటం వల్ల సామాన్య రైతాంగం తీవ్ర దోపిడీకి గురయ్యేది. కుల వివక్ష పరాకాష్టకు చేరుకుని, అంటరానితనం వంటి సామాజిక రుగ్మతలు సమాజాన్ని పీడిస్తున్న నేపథ్యంలో, అణగారిన వర్గాల్లో అసంతృప్తి జ్వాలలు ఎగిసిపడ్డాయి. ఈ తరుణంలో కమ్యూనిస్టు సిద్ధాంతాలు శ్రామిక వర్గాల్లో ఆశలు రేకెత్తించాయి. ఎలమకుళం మనక్కల్ శంకరన్ నంబూద్రిపాద్ (ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్) వంటి మేధావి నాయకత్వంలో కమ్యూనిస్టు పార్టీ క్షేత్రస్థాయిలో ప్రజలను సమీకరించింది. దీని ఫలితంగానే 1957లో జరిగిన తొలి శాసన సభ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ 126 స్థానాల్లో 60 స్థానాలను కైవసం చేసుకుని, స్వతంత్ర అభ్యర్థుల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. తద్వారా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రపంచపు మొట్టమొదటి కమ్యూనిస్టు ప్రభుత్వంగా ఇది చరిత్ర పుటల్లోకెక్కింది.

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నంబూద్రిపాద్ అద్భుతమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా భూసంస్కరణల చట్టం ద్వారా భూస్వాముల గుప్పిట్లో ఉన్న వేల ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్న కౌలు రైతులకు, భూమి లేని పేదలకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నారు. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పెనుమార్పులకు దారితీసింది. అదేవిధంగా, విద్యా రంగంలో ప్రైవేట్ యాజమాన్యాల గుత్తాధిపత్యాన్ని తగ్గించి,

> ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నంబూద్రిపాద్ అద్భుతమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా భూసంస్కరణల చట్టం ద్వారా భూస్వాముల గుప్పిట్లో ఉన్న వేల ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్న కౌలు రైతులకు, భూమి లేని పేదలకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నారు. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పెనుమార్పులకు దారితీసింది. అదేవిధంగా, విద్యా రంగంలో ప్రైవేట్ యాజమాన్యాల గుత్తాధిపత్యాన్ని తగ్గించి, ప్రభుత్వ నియంత్రణను పెంచుతూ విద్యా సంస్కరణల బిల్లును ప్రవేశపెట్టారు.

ప్రభుత్వ నియంత్రణను పెంచుతూ విద్యా సంస్కరణల బిల్లును ప్రవేశపెట్టారు. అయితే, ఈ విప్లవాత్మక మార్పులు సమాజంలోని పెత్తందారీ వర్గాలను, మతపరమైన సంస్థలను కలవరపెట్టాయి. చర్చిలు, నాయర్ సర్వీస్ సొసైటీ వంటి సంస్థలు ఏకమై ప్రభుత్వంపై 'విమోచన సమరం' (Liberation Struggle) పేరుతో ఆందోళనలు చేపట్టాయి. ఈ అశాంతిని సాకుగా చూపుతూ 1959లో అప్పటి కేంద్ర ప్రభుత్వం వివాదాస్పదమైన ఆర్టికల్ 356ను ప్రయోగించి, నంబూద్రిపాద్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసింది. ఇది భారత ఫెడరల్ వ్యవస్థలో ఒక చేదు జ్ఞాపకంగా మిగిలిపోయినప్పటికీ, ఆ ప్రభుత్వం వేసిన అభివృద్ధి పునాదులు మాత్రం చెక్కుచెదరలేదు.

1960వ దశకంలో కమ్యూనిస్టు పార్టీలో సంభవించిన చీలిక ఫలితంగా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) ఆవిర్భవించింది. ఆ తర్వాతి కాలంలో కేరళ రాజకీయాలు రెండు ప్రధాన ధ్రువాల చుట్టూ తిరగడం ప్రారంభమైంది. ఒకటి సిపిఐ(ఎం) నాయకత్వంలోని లెఫ్ట్ డెమోక్రాటిక్ ఫ్రంట్ (LDF), రెండోది కాంగ్రెస్ నాయకత్వంలోని యునైటెడ్ డెమోక్రాటిక్ ఫ్రంట్ (UDF). ఈ రెండు కూటముల మధ్య జరిగిన పోరు కేరళ ఓటర్లలో అద్భుతమైన చైతన్యాన్ని నింపింది. 1980 నుండి 2016 వరకు కేరళ ఓటర్లు ఒక విలక్షణమైన తీర్పును ఇస్తూ వచ్చారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి ప్రభుత్వాన్ని మార్చడం అక్కడ ఒక అనవాయితీగా మారింది. ఒకసారి ఎల్.డి.ఎఫ్ గెలిస్తే, మరుసటి ఎన్నికల్లో యు.డి.ఎఫ్ గెలవడం ద్వారా ఏ పార్టీ కూడా అధికార మదంతో విర్రవీగకుండా ప్రజలు అదుపు చేస్తూ వచ్చారు. ఈ మార్పు కేవలం రాజకీయ మార్పు మాత్రమే కాదు, పాలనలో జవాబుదారీతనం కోరే ప్రజల ఆకాంక్షకు ప్రతీక. ఈ సంప్రదాయాన్ని 2021 ఎన్నికలు సమూలంగా మార్చివేశాయి. 2016లో అధికారంలోకి వచ్చిన పినరయి విజయన్ ప్రభుత్వం, తన ఐదేళ్ల పాలనలో ఎదుర్కొన్న సవాళ్లను సమర్థవంతంగా తిప్పికొట్టింది. వరుసగా సంభవించిన ప్రళయకాల వరదలు, నిపా వైరస్ విజృంభణ, ఆపై కోవిడ్–19 మహమ్మారి వంటి విపత్కర





పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రదర్శించిన చొరవ ప్రజల మనసు గెలుచుకుంది. ముఖ్యంగా 'కేరళ మోడల్' అభివృద్ధిలో భాగంగా ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయడం, సంక్షేమ పింఛన్లను ఇంటికే చేరవేయడం, ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో ఆధునీకరించడం వంటి చర్యలు పినరయి విజయన్ కు భారీ ప్రజాదరణను తెచ్చిపెట్టాయి. ఫలితంగా 2021 ఎన్నికల్లో 140 స్థానాలకు గాను 99 స్థానాలు గెలుచుకుని, నాలుగు దశాబ్దాల 'ప్రత్యామ్నాయ పాలన' రికార్డును తిరగరాస్తూ వరుసగా రెండోసారి LDF ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

ప్రస్తుత కేరళ రాజకీయాల్లో LDF, UDFల మధ్య ప్రధాన పోటీ కొనసాగుతున్నప్పటికీ, భారతీయ జనతా పార్టీ (BJP) తన ఉనికిని చాటుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తోంది. శబరిమల వివాదం వంటి అంశాలను ఆధారం చేసుకుని హిందూ ఓటు బ్యాంకును ఆకట్టుకోవాలని చూస్తున్నప్పటికీ, కేరళలో ఉన్న బలమైన లౌకిక వాదం మరియు సామాజిక చైతన్యం వల్ల బీజేపీ ఇప్పటికీ అక్కడ మూడవ స్థానానికే పరిమితమవుతోంది. అయితే ఆ పార్టీ ఓట్ల శాతం క్రమంగా పెరుగుతుండటం భవిష్యత్తులో త్రిముఖ పోటీకి దారితీసే సూచనలు కనిపిస్తున్నాయి. కేరళ సాధించిన విజయాల వెనుక 'అధికార వికేంద్రీకరణ' అతిముఖ్యమైన పాత్ర పోషించింది. 1996లో ప్రవేశపెట్టిన 'పీపుల్స్ ప్లానింగ్ క్యాంపెయిన్' ద్వారా అభివృద్ధి నిధులను నేరుగా స్థానిక సంస్థలకు (పంచాయితీలకు) బదిలీ చేయడం వల్ల గ్రామీణ స్థాయిలోనే సమస్యలు పరిష్కారమయ్యే సంస్కృతి ఏర్పడింది. నేడు కేరళ మానవాభివృద్ధి సూచికలో (HDI) నార్వే, స్వీడన్ వంటి అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడుతోంది. నూటికి నూరు శాతం అక్షరాస్యత, తక్కువ శిశు మరణాల రేటు, మెరుగైన లింగ నిష్పత్తి కేరళను దేశానికే మార్గదర్శిగా నిలిపాయి.

అయితే, ఈ ప్రగతి పథంలో సవాళ్లు కూడా లేకపోలేదు. కేరళ ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా విదేశీ వలసదారుల (ముఖ్యంగా గల్ఫ్ దేశాల నుండి) ఆదాయంపై ఆధారపడి ఉంది. మారుతున్న అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా వలసలు తగ్గితే తలెత్తే ఆర్థిక ఇబ్బందులు, పెరుగుతున్న నిరుద్యోగిత, మరియు రాష్ట్రం ఎదుర్కొంటున్న భారీ అప్పుల భారం ఆందోళన కలిగిస్తున్నాయి. పారిశ్రామికీకరణ ఆశించిన స్థాయిలో లేకపోవడం వల్ల విద్యావంతులైన యువత ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు లేదా దేశాలకు వలస పోవాల్సి వస్తోంది. అలాగే పర్యావరణపరంగా సున్నితమైన పశ్చిమ కనుమల రక్షణ మరియు తరచూ సంభవిస్తున్న ప్రకృతి వైపరీత్యాలు పాలనలో పెను సవాళ్లుగా మారాయి.

ముగింపుగా చెప్పాలంటే, 1957లో నంబూద్రిపాద్ వేసిన సామాజిక న్యాయ బీజం నేడు మహావృక్షమై కేరళకు రక్షణ కవచంలా నిలిచింది. కమ్యూనిస్టు భావజాలం మరియు ప్రజాస్వామ్య విలువలు సమ్మిళితమై సామాన్య మానవుడి జీవితంలో మార్పును ఎలా తీసుకురావచ్చో కేరళ నిరూపించింది. రాజకీయం అంటే కేవలం అధికార మార్పిడి మాత్రమే కాదు, అది సామాజిక పరివర్తనకు ఒక సాధనం అని కేరళ చరిత్ర చాటి చెబుతోంది. భవిష్యత్తులో ఎదురయ్యే ఆర్థిక, ఉపాధి సవాళ్లను ఈ రాష్ట్రం ఎలా అధిగమిస్తుందో చూడాలి గానీ, భారత ప్రజాస్వామ్య ప్రయోగశాలలో కేరళ ఎప్పటికీ ఒక ప్రకాశవంతమైన నక్షత్రంలానే ఉంటుంది. ప్రజల అవసరాలకు అనుగుణంగా స్పందించే పాలన, పౌర చైతన్యం ఉన్నంత కాలం కేరళ తన విశిష్టతను కాపాడుకుంటూనే ఉంటుంది.



సంగనబట్ల
9440595494

# 'పెంబి' ఆదివాసీల పాదపోరు

నిర్మల్ జిల్లాలోని మారుమూల అటవీ ప్రాంతం పెంబి మండలం. దశాబ్దాలుగా ఇక్కడి గిరిజన గూడాలు అభివృద్ధికి ఆమడ దూరంలో, పాలకుల నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యాలుగా నిలిచాయి. ప్రాథమిక హక్కుల కోసం కూడా పోరాడాల్సిన దుస్థితి నెలకొన్న తరుణంలో గతనెలలో సిపిఎం చేపట్టిన 75 కిలోమీటర్ల పాదయాత్ర ఈ ప్రాంతానికి ఊరట నిస్తోందని చెప్పక తప్పదు. "పోరాడితేనే




పరిష్కారం" అన్న నినాదంతో సాగిన ఈ యాత్ర, నేడు అధికారయంత్రాంగాన్ని కదిలించేలా చేసింది. ఆదివాసీ గూడాల్లో అభివృద్ధి వెలుగులను ప్రసరింపజేసేందుకు అడుగులు పడేలా చేసింది. సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యులు ఉడుత రవీందర్, నిర్మల్ జిల్లా కార్యదర్శి గౌతమ్ కృష్ణ నాయకత్వంలో ఆ ప్రాంతం ఆదివాసీలు యాపాగూడెం నుండి నిర్మల్ వరకు సాగిన ఈ పాదయాత్ర కేవలం ఒక నిరసన కాదు, అది ఆదివాసీల ఆత్మగౌరవ ప్రతీక. ఈ పాదయాత్రలో నాయకులు ప్రతి గూడెం తిరుగుతూ ప్రజా సమస్యలను తలకెత్తుకున్నారు. తాగునీరు, వైద్యం, విద్యుత్ వంటి కనీస సౌకర్యాల కోసం అధికారులు చూపుతున్న ఉదాసీనతను జిల్లా కేంద్రం సాక్షిగా ఎండగట్టారు. ఈ పోరాట సెగ తాజాగా ప్రభుత్వ యంత్రాంగంలో చలనం తెచ్చి, వరుస విజయాలకు దారితీసింది. విజయం చిన్నదే అయినప్పటికీ పెద్ద సందేశం ఇస్తోందని గుర్తించక తప్పదు.

ఈ పాదయాత్ర ఫలితంగా తాజాగా మూడు ప్రధాన సమస్యలు పరిష్కార మార్గానికి రావడం ప్రజా పోరాటానికి దక్కిన గౌరవంగా భావించవచ్చు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రెగ్యులర్ డాక్టర్ లేక గిరిజనులు గాలిలో దీపాల్లా బతుకుతున్న దుస్థితిని పాదయాత్ర బృందం బలంగా వినిపించింది. దీంతో స్పందించిన ప్రభుత్వం, తాజాగా ఆసుపత్రికి రెగ్యులర్ మెడికల్ ఆఫీసర్‌ను నియమించింది. ఇప్పుడు అత్యవసర సమయంలో పేదలకు వైద్యం అందే మార్గం సుగమమైంది. రావిగూడ గ్రామంలో మూలన పడ్డ మిషన్ భగీరథ ట్యాంకును సిపిఎం పాదయాత్ర తర్వాతే అధికారులు పట్టించుకున్నారు. నీటి సరఫరాను పునరుద్ధరించారు. గిరిజన మహిళల నీటి కష్టాలు తీరడంతో ఆ గూడాల్లో కాస్త ఉపశమనం కలిగింది దాహంతో అలమటిస్తున్న రాముగూడ ప్రజల కోసం సిపిఎం నిలదీసిన వెంటనే అధికారులు స్పందించారు. నూతనంగా బోర్వెల్ ఏర్పాటు చేయించి నీటి సౌకర్యం కల్పించడంతో ఆ ప్రాంత ప్రజలు తమ దశాబ్దాల కష్టాల నుండి విముక్తి పొందినట్లుగా భావిస్తున్నారు. ప్రస్తుత విజయాలు సంతోషాన్నిస్తున్నా, ఇవి కేవలం ఆరంభం మాత్రమే. అడవి బిడ్డల సంపూర్ణ అభివృద్ధికి ఇంకా అనేక అడ్డంకులు ఉన్నాయి. ప్రధానంగా దోత్తి వాగు, కడం వాగులపై వంతెనలు లేక వర్షాకాలంలో పెంబి మండలం బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోతుంది. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనా, అటవీ శాఖ అనుమతుల పేరుతో గృహ నిర్మాణాలను అడ్డుకోవడం గిరిజనుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే. పట్టాలు పొందిన భూములకు రైతుబంధు వంటి పథకాలు, సత్తుగూడ గ్రామ పునరావాసం వంటి అంశాలు ఇంకా పరిష్కారానికి నోచుకోవాల్సి ఉంది. పెంబి మండల ఆదివాసీల పోరాటం నేటి తరానికి ఒక గొప్ప సందేశం ఇస్తోంది. సమస్యలున్నప్పుడు మౌనంగా భరించడం కంటే, వ్యవస్థను నిలదీసే చైతన్యం ముఖ్యమని ఇది నిరూపించింది. ఎర్రజెండా వెనుక ఐక్యమైన గిరిజనం సాధించిన ఈ విజయం, ప్రజా గళం నినదిస్తే ఫలితం రాకుండా ఉండదని చాటిచెప్పింది. అధికారులు కేవలం తాత్కాలికంగా బోర్వేల్లు వేసి, డాక్టర్లను నియమించి చేతులు దులుపుకోకుండా, పెంబి మండల సమగ్ర అభివృద్ధి కోసం శాశ్వత మౌలిక సదుపాయాలు కల్పించాలి. సీపీఎం పార్టీ కూడా ఇదేదో పాదయాత్ర కార్యక్రమంలాగా కాకుండా ఆదివాసీలకు పూర్తిస్థాయిలో అండగా నిలువాలి. దీర్ఘకాలిక ఉద్యమానికి శ్రీకారం చుట్టాలి. అడవి బిడ్డలు రగిల్చిన ఈ చైతన్య జ్వాల మండలం మొత్తానికి వెలుగులు నింపే వరకు విశ్రమించదని స్పష్టమవుతోంది. ఈ విజయం..ఆదివాసీల ఐక్యతకు, ప్రజా పోరాటాల ఆవశ్యకతకు ఒక నిలువుటద్దాం.



రాజేందర్ దామెర

# కన్నవారి చట్టంతో సామాజిక న్యాయం

కొడుకుల 'బిడ్డల నిరాదరణకు గురౌతున్న వారి కోసం కేంద్ర ప్రభుత్వం 2007 లో తల్లి తండ్రుల వయోవృద్ధుల పోషణ' సంరక్షణ చట్టాన్ని తీసుకొచ్చింది. ప్రతి డివిజన్ స్థాయిలో ఒక ట్రిబ్యునల్ కమిటీ ఏర్పాటుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వృద్ధుల సమస్యల పరిష్కారం' సంక్షేమం 'హక్కుల రక్షణ కొరకు నియమావళిని రూపొందించారు. కమిటీకి "ఛైర్మన్ గా" రెవెన్యూ డివిజన్ స్థాయి అధికారి వ్యవహరిస్తారు జిల్లా వికలాంగుల సహాయ సంచాలకులు 'వయోవృద్ధులు

> వయోవృద్ధుల ఆస్తులు రాయించుకొని వారిని ఇంటి నుండి బైటకు గెంటి వేస్తున్నారు. వృద్ధాశ్రమల్లో చేర్పిస్తు న్నారు. బలవంతంగా వృద్ధుల చేత ఆస్తులు రాయించుకున్నారు. ఇలాంటి సందర్భాల్లో ఆస్తి విక్రయానికి సంబంధించిన సొమ్ము వృద్ధుని ఖాతాలో జమ ఆయినా విషయం రూడి చేసుకుని అధికారులు తగు చర్యలు తీసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వృద్ధులు నిరక్షరాస్యులు వారికి బ్యాంక్ ఖాతాలు ఉండవు. డివిజన్ స్థాయి అధికారులు తమ రెగ్యులర్ ఉద్యోగ బాధ్యతల్లో తీరిక లేకుండా వుండం వల్ల వయోవృద్ధుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. మండల స్థాయిలో సీనియర్ సిటిజన్స్ చట్టం అమలుకు ప్రత్యేక అధికారిని నియమించాలి. ప్రభుత్వం ప్రతి మండల స్థాయిలో వయోవృద్ధులు సమస్యలు పరిష్కారం సంక్షేమం హక్కుల రక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలి.

శాఖ సహాయ సంచాలకులు కన్వీనర్లుగా స్వచ్ఛంద సంస్థల నుండి ఒకరు లేదా ఇద్దరు ప్రతినిధులు వుంటారు .ఈ కమిటీకి కోర్టుకు వుండే అధికారాలు వుంటాయి. కమిటీ తల్లి తండ్రుల కేసులు విచారించి 90 రోజుల్లో తీర్పులు ఇస్తాయి. కాని క్షేత్ర స్థాయిలో వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం ఆశించిన విధంగా జరగడం లేదు. రెవెన్యూ



డివిజన్ స్థాయి అధికారి తన రెగ్యులర్ ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడం వల్ల సమయం లేకపోవడం వల్ల వయోవృద్ధుల సమస్యలు పరిష్కారానికి నోచుకోని స్థితి. దాపురించింది. రాష్ట్రంలో వృద్ధులను బెదిరించి వారి ఆస్తులను తమ పేరు మీద రాయించుకోవడం రిజిస్ట్రేషన్ చేయించుకోవడం గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ఒంటరి వృద్ధులు ఆస్తులు కోల్పోయి బజారున పడిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్లు ఒంటరి మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పలు పథకాలు ప్రవేశ పెట్టడం అభినందనీయం కానీ గ్రామీణ ప్రాంతాల్లో నివసించే నిరక్షరాస్యులైన వయోవృద్ధుల సంక్షేమం వారి హక్కుల రక్షణకు సమగ్రమైన చర్యలు చేపట్టాలి.

వయోవృద్ధుల ఆస్తులు రాయించుకొని వారిని ఇంటి నుండి బైటకు గెంటి వేస్తున్నారు. వృద్ధా శ్రమల్లో చేర్పిస్తు న్నారు. బలవంతంగా వృద్ధుల చేత ఆస్తులు రాయించుకున్నారు. ఇలాంటి సందర్భాల్లో ఆస్తి విక్రయానికి సంబంధించిన సొమ్ము వృద్ధుని ఖాతాలో జమ ఆయినా విషయం రూడి చేసుకుని అధికారులు తగు చర్యలు తీసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వృద్ధులు నిరక్షరాస్యులు వారికి బ్యాంక్ ఖాతాలు ఉండవు. డివిజన్ స్థాయి అధికారులు తమ రెగ్యులర్ ఉద్యోగ బాధ్యతల్లో తీరిక లేకుండా వుండం వల్ల.వయోవృద్ధుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. మండల స్థాయిలో సీనియర్ సిటిజన్స్ చట్టం అమలుకుప్రత్యేక అధికారిని నియమించాలి. ప్రభుత్వం ప్రతి మండల స్థాయిలో వయోవృద్ధులు సమస్యలు పరిష్కారం సంక్షేమం హక్కుల రక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలి. గ్రామసభ ' సీనియర్ సిటిజన్స్ చట్టం పట్ల అవగాహన కల్పించాలి. గ్రామ పంచాయితీ కార్యదర్శి, గ్రామంలోని వృదుల సంఖ్య పై సర్వే నిర్వహించాలి. గ్రామసభలో వయోవృద్ధుల పోషణ 'సంక్షేమం 'హక్కుల రక్షణ' సీనియర్ సిటిజన్స్ చట్టం పట్ల అవగాహన చైతన్యం కలిగించాలి.వృద్ధుల ఆరోగ్యం సంక్షేమం అభివృద్ధి పథకాల మీదచర్చ జరగాలి. ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి వయోవృద్ధుల జనాభా సేకరించి ప్రతి నెల వృద్ధుల కొరకు ఉచిత విద్య ఆరోగ్య శిబిరంనిర్వహించాలి. ప్రతి గ్రామములో మహిళా సంఘాలు 'తల్లుల కమిటీలు మాదిరి వయోవృద్ధుల కమిటీ ఏర్పాటు చేయాలి. వయోవృద్ధులు సంక్షేమం కమిటీలుగా ఏర్పడాలి..

### సీనియర్ సిటిజన్స్ మీడియా ప్రచారం చెయ్యాలి

కేంద్రం వయోవృద్ధులు సంక్షేమం కోసం ప్రవేశ పెట్టిన టోల్ ఫ్రీ నెంబర్14567 మీధ విస్తృత ప్రచారం చెయ్యాలి .మీడియా 'ప్రసార మాధ్యమాలు 'ఎలక్ట్రానిక్ మీడియా క్రియాశీల పాత్ర పోషించాలి.కేంద్ర ప్రభుత్వం 2007 లో ప్రవేశ పెట్టిన తల్లి తండ్రుల వయోవృద్ధులు పోషణ సంక్షేమం సంరక్షణ చట్టం మీధ వృద్ధులకు అవగాహన చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలి. గ్రామాల్లో వయో వృద్ధులను బెధిరించి ఆస్తిని అక్రమంగా పట్టా చేసుకున్న వారిపై 1977 చట్టాన్ని అమలు చేసి కేసులు నమోదు చేసి కఠిన శిక్షలు జరిమానాలు విధించి తిరిగి వయోవృద్ధుల ఆస్తిని వారి పేరు మీద రిజిస్టర్ చెయ్యాలి. సీనియర్ సిటిజన్స్ ఎదుర్కొనే సమస్యలు జిల్లా కలెక్టర్ రెవెన్యూ డివిజన్ అధికార్లకు నివేదించాలి. వృద్ధులను మానవ వనరుల అభివృద్ధికి సారథులుగా సమాజం ప్రభుత్వం గుర్తించాలి.



గమనిక

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు, తెలంగాణ ఎకనామిక్ ఫోరం
9440245771




# జాతీయం-అంతర్జాతీయం



## ఊపందుకున్న భారత్- అమెరికా వాణిజ్య చర్చలు

**ఈ నెల వాషింగ్టన్‌ను సందర్శించనున్న ప్రతినిధి బృందం**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 (ఉదయం) :**



ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలను ముందుకు తీసుకెళ్లడానికి ఈ నెల చివరలో ఒక భారతీయ ప్రతినిధి బృందం వాషింగ్టన్‌కు వెళ్లనుందని భారతదేశానికి అమెరికా రాయబారి సెర్గియో గోర్ గురువారం తెలిపారు. ఈ తాజా సమాచారాన్నిఎక్స్‌పై పంచుకుంటూ, అమెరికా వాణిజ్య ప్రతినిధి జామీసన్ గ్రీర్‌తో తన సమావేశం అత్యంత ఫలవంతమైందని అమెరికా రాయబారి అభివర్ణించారు. ఈ సమావేశం, దక్షిణ, మధ్య ఆసియాలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య ప్రాధాన్యతలను ముందుకు తీసుకెళ్లడంపై దృష్టి సారించింది.

అమెరికా, భారతదేశం గతంలోనే ఒక వాణిజ్య ఒప్పందానికి అంగీకరించాయి. ఈ నెల చివరలో వాషింగ్టన్‌కు రానున్న భారత ప్రతినిధి బృందానికి స్వాగతం పలకడానికి మేము ఎదురుచూస్తున్నాం, అని గోర్ అన్నారు.

**పర్యటనను రద్దు చేసుకున్న సీతారామన్; పార్లమెంటు అజెండాపై దృష్టి**

ప్రతినిధి బృందంలో భాగమవుతారని భావించిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాషింగ్టన్ పర్యటనకు హాజరుకావడం లేదు. దానికి బదులుగా, లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలును వేగవంతం చేసే లక్ష్యంతో రూపొందించిన బిల్లుల ప్రవేశంతో సహా, పార్లమెంటు కార్యకలాపాలలో పాల్గొనేందుకు ఆమె దేశంలోనే ఉండనున్నారు.

**విమర్శల నడుమ చారిత్రాత్మక ఒప్పందం**

నెలల తరబడి సాగిన చర్చల అనంతరం, 2026 ఫిబ్రవరి 2న భారతదేశం అమెరికా ఒక ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించాయి. ఈ ఒప్పందాన్ని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇరువురూ చారిత్రాత్మకంగా అభివర్ణించినప్పటికీ, భారతదేశంలోని ప్రతిపక్ష పార్టీల నుంచి విమర్శలు ఎదురయ్యాయి.

**కీలక అంశాలు :** సుంకాల తగ్గింపులు, భారీ పెట్టుబడులు

ఈ ఒప్పందంలోని ప్రధాన నిబంధనలలో ఒకటి, భారతీయ వస్తువులపై సుంకాలను 50% నుండి 18%కి తగ్గించడం. ఇంధనం, విమానయానం, లోహాలు, బొగ్గు, సాంకేతికతతో సహా వివిధ అమెరికా రంగాలలో, ఐదేళ్ల వ్యవధిలో 500 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టడానికి భారతదేశం కట్టుబడి ఉంటుందని కూడా ఈ ఒప్పందం పేర్కొంటోంది.

వైట్ హౌస్ ఫ్యాక్ట్ షీట్ ప్రకారం, రష్యా చమురు, పెట్రోలియం ఉత్పత్తుల కొనుగోళ్లను భారతదేశం తగ్గించుకోవడం కూడా ఈ చట్రంలో భాగంగా ఉంది. అయితే, ఇరాన్‌తో కొనసాగుతున్న సంఘర్షణ నేపథ్యంలో, మాస్కోకు ఆర్థిక లాభాలను చేకూర్చకుండా రష్యా చమురును పరిమితంగా కొనుగోలు చేయడానికి అమెరికా అనుమతించింది.

## ఇరాన్‌లో భారీ ర్యాలీ

**ఖమేనీ హత్య జరిగి 40 రోజులైన సందర్భంగా సంతాపం**



**ఉదయం డెస్క్, ఏప్రిల్ 9:**

ఆయతుల్లా అలీ ఖమేనీ హత్య జరిగి 40 రోజులు పూర్తయిన సందర్భంగా, గురువారం తెహ్రాన్‌లో భారీ ర్యాలీ జరిగింది. వేలాదిమంది ప్రజలు వీధుల్లోకి తరలివచ్చి, తమ సంతాపాన్ని, రాజకీయ ధిక్కారాన్ని ప్రదర్శించారు. ఇరాన్ అమెరికా ఇటీవల ప్రకటించిన రెండు వారాల కాల్పుల విరమణపై పెరుగుతున్న ప్రజా సందేహాలను కూడా ఈ ర్యాలీ వ్యక్తం చేసింది. కొనసాగుతున్న ప్రాంతీయ ఉద్రిక్తతల నేపథ్యంలో, హాజరైన వారిలో చాలామంది ఈ ఒప్పందం శాశ్వతత్వాన్ని, ఉద్దేశాన్ని ప్రశ్నించారు.

**ఒత్తిడిలో హిజ్బుల్లా**

లెబనాన్ ప్రభుత్వం తీసుకున్న వైఖరిని ప్రతిధ్వనిస్తూ, హిజ్బుల్లా కూడా ఇజ్రాయెల్ తాజా దాడులను తీవ్రంగా ఖండించింది. హిజ్బుల్లాను నిరాయుధీకరణ చేయడం అనే తమ ప్రాథమిక సైనిక లక్ష్యాన్ని సాధించడంలో విఫలమైనప్పుడు, ఇజ్రాయెల్ ఉద్దేశపూర్వకంగా పౌరులను లక్ష్యంగా చేసుకుంటోందని ఆ సంస్థ ఆరోపించింది.

అయితే, ఇరాన్ మద్దతుగల ఆ కూటమి ప్రస్తుతం మరింత క్లిష్టమైన స్థితిలో చిక్కుకుంది. లెబనాన్‌కు కూడా వర్తించేలా ఒక విస్తృత కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదిర్చడం అనేది తెహ్రాన్‌పైనే ఆధారపడి ఉంది. లెబనాన్‌లో ఉద్రిక్తతలను తగ్గించడం అనేది విస్తృత స్థాయి అవగాహనలో ఒక భాగమేనని ఇరాన్ అధికారులు సూచించినప్పటికీ, ఇజ్రాయెల్, అమెరికా కూడా ఆ వాదనను గట్టిగా తిరస్కరించాయి. ప్రస్తుత కాల్పుల విరమణ ఒప్పంద పరిధిలో లెబనాన్ చేరదని ట్రంప్ కూడా స్పష్టం చేశారు.

**వెలుగులోకి వచ్చిన యుద్ధ విరమణ పరిమితులు**

అనిశ్చితి కొనసాగుతున్నప్పటికీ, హిజ్బుల్లా సరిహద్దుల ఆవలకు రాకెట్ దాడులను కొనసాగిస్తూ, దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ భూతల కార్యకలాపాలను నెమ్మదింపజేయడానికి ప్రయత్నించింది. ఇజ్రాయెల్ ఆకాశంపై నియంత్రణను నిలుపుకుంది, ఇది నిరంతర వైమానిక దాడులను నిర్వహించడానికి వీలు కల్పించింది. ఈ దాడుల ఫలితంగా విస్తృతమైన విధ్వంసం, పౌర ప్రాణనష్టం సంభవిస్తున్నాయి. లెబనీస్ ఫ్రంట్‌ను శాంతింపజేయడానికి ఇరాన్ తన ప్రభావాన్ని ఉపయోగించుకుంటుందనే దానిపై హిజ్బుల్లా భావించింది. దాని వ్యూహం ఈ అంశంపైనే ఆధారపడి ఉంది, కానీ ఆ అంచనా ఇంకా నెరవేరలేదు. ఈ పరిస్థితి ప్రస్తుత కాల్పుల విరమణ ఒప్పందం పరిమితులను స్పష్టం చేస్తోంది.

## లెబనాన్‌పై ఇజ్రాయెల్ మళ్లీ దాడి

**ఉదయం డెస్క్, ఏప్రిల్ 9:**



సున్నితమైన కాల్పుల విరమణకు ముప్పు తెస్తూ, గురువారంనాడు లెబనాన్‌పై ఇజ్రాయెల్ తాజా దాడులకు పాల్పడడంతో మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. ఈ సంఘర్షణలో ఇప్పటివరకు ఇజ్రాయెల్ జరిపిన అత్యంత ఘోరమైన దాడుల పరంపర తర్వాత ఈ తాజా దాడులు జరిగాయి. ఆ దాడులలో 250 మందికి పైగా మరణించినట్లు సమాచారం, దీనితో ఉద్రిక్తతలు పెరిగే అవకాశం ఉందనే భయాలను పెరిగాయి. దౌత్య ప్రయత్నాలు ఊపందుకుంటున్న తరుణంలోనే ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. శనివారం నాడు అమెరికా ప్రతినిధి బృందంతో జరగనున్న తొలి విడత శాంతి చర్చల కోసం ఇరాన్ ప్రతినిధులు పాకిస్థాన్‌కు వెళ్లనున్నారు.

**వెనక్కి తగ్గడానికి ఇరాన్ నిరాకరించడంతో కాల్పుల విరమణపై ఒత్తిడి**

అమెరికా, ఇరాన్‌ల మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ప్రకటించినప్పటికీ, తెహ్రాన్ హోర్ముజ్ జలసంధిపై తన దిగ్బంధనాన్ని ఎత్తివేసినట్లు ఎటువంటి సూచన లేదు. ఈ దిగ్బంధనం ప్రపంచ ఇంధన సరఫరాలకు తీవ్ర అంతరాయాన్ని కలిగించింది.

ఈ క్రమంలో ఇరాన్ తన వైఖరిని స్పష్టం చేసింది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నంత కాలం ఏ ఒప్పందమూ నిలవదు. హిజ్బుల్లాను లక్ష్యంగా చేసుకుని జరిగిన తాజా దాడులకు ప్రతిస్పందనగా, దానిని తాత్కాలికంగా తిరిగి తెరవాలన్న తన మునుపటి నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటూ, తెహ్రాన్ గురువారం నాడు ఆ వ్యూహాత్మక జలమార్గాన్ని మళ్లీ మూసివేసినట్లు సమాచారం.

**హిజ్బుల్లాపై దాడులు కొనసాగిస్తామని నెతన్యాహు ప్రతిజ్ఞ**

హిజ్బుల్లాపై సైనిక చర్యను సమర్థిస్తూ, అవసరమైన చోటల్లా ఆపరేషన్లు కొనసాగుతాయని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు అన్నారు. హిజ్బుల్లా సెక్రటరీ జనరల్ నయీమ్ ఖాసెమ్‌కు సన్నిహితుడు అలీ యూసఫ్ ఖర్షీని ఇజ్రాయెల్ దళాలు హతమార్చాయని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. దక్షిణ లెబనాన్‌లోని ఆయుధ డిపోలు, ప్రయోగ స్థలాలు, కార్యాచరణ ప్రధాన కార్యాలయాలతో సహా కీలక మౌలిక సదుపాయాలపై ఇజ్రాయెల్ రక్షణ దళాలు రాత్రిపూట దాడులు చేశాయని నెతన్యాహు చెప్పారు.

మా సందేశం స్పష్టం: ఇజ్రాయెల్ పౌరులకు వ్యతిరేకంగా వ్యవహరించేవారిపై దాడి చేస్తాం, అని ఆయన అన్నారు. ఉత్తర ఇజ్రాయెల్‌లో భద్రత పునరుద్ధరించే వరకు ఈ ఆపరేషన్లు కొనసాగుతాయని కూడా ఆయన తెలిపారు.

**పౌర ప్రాంతాలపై దాడి, మృతుల సంఖ్యలో తేడాలు**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో కాల్పుల విరమణను ప్రకటించిన కొన్ని గంటలకే, బీరూట్ నగర కేంద్రంలోని రద్దీగా ఉండే వాణిజ్య, నివాస ప్రాంతాలపై ఈ దాడులు జరిగినట్లు సమాచారం.

మృతుల సంఖ్యపై స్పష్టత లేదు. రాయిటర్స్ 250కి పైగా మరణాలు సంభవించాయని నివేదించగా, అసోసియేటెడ్ ప్రెస్ మృతుల సంఖ్యను 182గా పేర్కొంది.

**కాల్పుల విరమణ ఒప్పందం లెబనాన్‌కు వర్తించదన్న అమెరికా, ఇజ్రాయెల్**

అమెరికా, ఇరాన్‌ల మధ్య కుదిరిన రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందంలో లెబనాన్‌ను చేర్చలేదని నెతన్యాహు అన్నారు. ఈ అభిప్రాయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా పునరుద్ఘాటించారు. టెలివిజన్ ప్రసంగంలో నెతన్యాహు మాట్లాడుతూ, ఇజ్రాయెల్ కొన్ని నిమిషాల వ్యవధిలోనే సుమారు 100 లక్ష్యాలపై దాడి చేసిందని, గతంలో జరిగిన ఆపరేషన్ల తర్వాత హిజ్బుల్లాకు తగిలిన అత్యంత ముఖ్యమైన దెబ్బలలో ఇది ఒకటని పేర్కొన్నారు. లెబనాన్, సిరియా, గాజాలలో తమ సరిహద్దులకు ఆవల ఇజ్రాయెల్ భద్రతా మండలాలను ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు.

## మూతపడిన జలసంధి వెనుదిరుగుతున్న నౌకలు



**ఉదయం డెస్క్, ఏప్రిల్ 9:**

ఇరాన్, అమెరికాల మధ్య రెండువారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరి, కొద్దిసేపు హోర్ముజ్ జలసంధి తెరుచుకుని కొన్ని నౌకలు దానిని దాటిన విషయం తెలిసిందే. తాజాగా, లెబనాన్‌పై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులపై ఆగ్రహించిన ఇరాన్ తిరిగి జలసంధిని మూసివేస్తున్నట్టు ప్రకటించడమే కాదు, దీని మీదుగా వెళ్లాల్సిన నౌకలను బలవంతంగా వెనక్కి పంపుతున్నట్టు అంతర్జాతీయ మీడియా వార్తలు వస్తున్నాయి. గ్రీకు యాజమాన్యంలోని బల్క్ క్యారియర్ ఎన్‌జె ఎర్త్ , లైబీరియా జెండా కలిగిన డేటోనా బీచ్ జలసంధిని దాటాయి అని మెరైన్ ట్రాఫిక్ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ఈ క్రమంలో 'అరోరా' అనే చమురు నౌక కూడా జలసంధిని దాటేందుకు సిద్ధమైంది. అయితే, అప్పటికే లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తుండటంతో.. ఇరాన్ హర్మూజ్‌ను పూర్తిగా మూసివేసింది. దీంతో ముసందమ్ తీరం సమీపంలో ఈ నౌక బలవంతంగా వెనుదిరగాల్సి వచ్చింది. అంతర్జాతీయ రవాణాకు అత్యంత కీలకమైన ఈ మార్గంలో ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం. దీంతోపాటు మరికొన్ని నౌకలు కూడా ఇలానే వెనుదిరిగినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇక, మంగళవారం నాటికి సరకుతో నిండిన 187 ట్యాంకర్లు సహా వెయ్యికి పైగా నౌకలు హర్మూజ్ జలసంధి సమీపంలోనే ఉన్నాయని క్లెప్లర్ పేర్కొంది. పరిస్థితులు చక్కబడి సాధారణ రాకపోకలు ప్రారంభమైనా.. ఈ నౌకలు జలసంధిని దాటేందుకు రెండు వారాలకు పైనే పడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## మణిపూర్ లోయ జిల్లాల్లో నిరసన ర్యాలీలు

**బాంబు దాడి నిందితుల అరెస్టుకు డిమాండ్**

**ఇంఫాల్, ఏప్రిల్ 9 (ఉదయం) :**



బిష్ణుపూర్ జిల్లాలో ఇద్దరు చిన్నారుల ప్రాణాలను బలిగొన్న బాంబు దాడికి నిరసనగా, కర్ఫ్యూను ధిక్కరిస్తూ మణిపూర్‌లోని ఐదు లోయ జిల్లాల వ్యాప్తంగా వేలాది మంది ప్రదర్శనకారులు నిరసన ర్యాలీలు నిర్వహించి, టైర్లను తగలబెట్టారు. ఇంఫాల్ వెస్ట్ జిల్లాలోని టిడ్డిమ్ లైన్ వద్ద, ఆల్ మణిపూర్ యునైటెడ్ క్లబ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వందలాది మంది ప్రజలు క్వాకేథెల్ సమీపంలోని తమ కార్యాలయం నుండి ర్యాలీ నిర్వహించి, హత్యలను ఖండిస్తూ, దోషులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దాడిలో మరణించిన ఇద్దరు మైనర్ల పోస్టర్లను పట్టుకుని పలువురు పిల్లలు కూడా ఈ ర్యాలీకి హాజరయ్యారు. అయితే, క్వాకైథెల్ సమీపంలో ఈ ర్యాలీ మరింత ముందుకు సాగకుండా భద్రతా దళాలు అడ్డుకున్నాయి.

తరువాత, తమ సమస్యలను తెలియజేయడానికి ఎఎంయుసిఒ ప్రతినిధులను, ఇతరులను ముఖ్యమంత్రి వై. ఖేమ్‌చంద్ సింగ్‌ను కలిసేందుకు తీసుకువెళ్లారు.

ఏప్రిల్ 7న, బిష్ణుపూర్ జిల్లాలోని ట్రోంగ్లాయోబిలో అనుమానిత మిలిటెంట్లు ఒక ఇంటిపై బాంబు విసరడంతో, 5 ఏళ్ల బాలుడు, అతని 6 నెలల సోదరి మరణించారు.

ఈ సంఘటన జరిగిన వెంటనే, ట్రోంగ్లావోబికి కొన్ని వందల మీటర్ల దూరంలో ఉన్న గెల్మోల్ సమీపంలోని సీఆర్పీఎఫ్ శిబిరంపై సుమారు 500 మంది నిరసనకారుల గుంపు దాడి చేసి, భద్రతా వాహనాలను ధ్వంసం చేసి, తగలబెట్టారు. అనంతరం సిబ్బంది జరిపిన కాల్పుల్లో ముగ్గురు నిరసనకారులు మరణించగా, 30 మంది గాయపడ్డారు. బిష్ణుపూర్‌లో ఉద్రిక్త నిశ్శబ్దం నెలకొంది. సోషల్ మీడియాలో పుకార్లు వ్యాప్తి చేయవద్దని మణిపూర్ ప్రభుత్వం హెచ్చరించింది. గురువారం నాడు, ఇంఫాల్ వెస్ట్ జిల్లాలోని సమౌరూ వద్ద, వందలాది మంది నిరసనకారులు ముఖ్యమంత్రి అధికారిక నివాసం వైపు వెళ్ళడానికి ప్రయత్నించగా, పోలీసులు వారిని అడ్డుకున్నారు.

బిష్ణుపూర్ జిల్లాలోని మోయిరాంగ్ లమ్‌ఖాయ్, నింగ్తౌఖోంగ్ వద్ద నిరసనకారులు టైర్లను దహనం చేసి, వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. ఇంఫాల్ తూర్పు జిల్లాలోని ఖురాయ్, అలాగే థౌబాల్, కాక్చింగ్ జిల్లాలలోని కొన్ని ప్రాంతాల నుండి కూడా టైర్ల దహనానికి సంబంధించిన ఇటువంటి ఘటనలే నమోదయ్యాయి.

బుధవారం రాత్రి, ఇంఫాల్ తూర్పు జిల్లాలోని ఖురాయ్ లామ్లాంగ్ వద్ద నిరసనకారులకు, భద్రతా దళాలకు మధ్య ఘర్షణలు చెలరేగాయి. ఆందోళనకారులు రాళ్ల దాడికి పాల్పడటంతో, గుంపును చెదరగొట్టడానికి భద్రతా దళాలు బాష్పవాయువును ప్రయోగించాయి. అంతకుముందు, ట్రోంగ్లావోబి ఘటన అనంతరం జరిపిన ఆపరేషన్లలో యునైటెడ్ కుకీ నేషనల్ ఆర్మీకి చెందిన ముగ్గురు అనుమానిత కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. అయితే, అరెస్టు అయిన వారికి ఆ పేలుడుతో ప్రత్యక్ష సంబంధం ఉందో లేదో పోలీసులు ఇంకా నిర్ధారించలేదు.

### మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించే సవరణలకు

## కేంద్ర కాబినెట్ ఆమోదం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 (ఉదయం) :** 2011 జనాభా లెక్కల డేటాను ఉపయోగించి లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను అమలు చేసేందుకు ఉద్దేశించిన నారీ శక్తి వందన అధినియమ్ (లేదా మహిళా రిజర్వేషన్ బిల్లు)కు ప్రతిపాదిత రాజ్యాంగ సవరణలకు, డీలిమిటేషన్ బిల్లుకు కేంద్ర మంత్రివర్గం బుధవారం రాత్రి ఆమోదం తెలిపిందని అధికార వర్గాలను ఉటంకిస్తూ ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పేర్కొంది. ఏప్రిల్ 16 నుంచి 18 మధ్య జరగనున్న పార్లమెంటు మూడు రోజుల సమావేశాలకు ముందు, మంత్రివర్గం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ బిల్లు అమలును వేగవంతం చేయడానికి పార్లమెంటు ప్రత్యేక సమావేశం దోహదపడుతుందని గత వారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. దక్షిణ రాష్ట్రాల ప్రాతినిధ్యానికి ఎటువంటి విఘాతం కలగదని ప్రధాని మోదీ నొక్కి చెప్పారు.

**మహిళా రిజర్వేషన్ బిల్లు ఏమిటి?**

మహిళా రిజర్వేషన్ బిల్లు (లేదా 'నారీ శక్తి వందన్ అధినియం') ప్రకారం, లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలోని మొత్తం స్థానాల్లో 33 శాతాన్ని మహిళల కోసం కేటాయిస్తారు. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలోని స్థానాల సంఖ్యను 50 శాతం మేర పెంచాలని ప్రతిపాదిస్తున్నట్లు భావిస్తున్న 'డీలిమిటేషన్ బిల్లు'ను కూడా కేంద్ర మంత్రివర్గం ఆమోదించిందని 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రిక తెలిపింది. లోక్‌సభ స్థానాలను 543 నుండి 816కు పెంచడం, అందులో 273 స్థానాలను మహిళలకు కేటాయించడం ఈ ప్రతిపాదన ముఖ్య ఉద్దేశమని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ ప్రక్రియ అమలు కాలాన్ని వేగవంతం చేసే లక్ష్యంతో, 2027 జనాభా లెక్కల కోసం వేచి చూడకుండా, 2011 జనాభా లెక్కల ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను చేపట్టాలని ప్రభుత్వం యోచిస్తుండటం ఇక్కడ గమనార్హం.

## వివక్షాపూరిత వ్యవస్థను రద్దు చేస్తాం





**ఉదయం డెస్క్, ఏప్రిల్ 9:**

తమ పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు, కేంద్ర సాయుధ పోలీసు బలగాల (సిఎపిఎఫ్) సిబ్బందికి నాయకత్వ అవకాశాలను నిరాకరించే వివక్షాపూరిత వ్యవస్థను రద్దు చేసి, వారికి దక్కాల్సిన హక్కులు, విశేష అధికారాలు లభించేలా చూస్తామని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ గురువారం తెలిపారు. కేంద్ర రిజర్వ్ పోలీస్ దళం (సిఆర్‌పిఎఫ్) 'శౌర్య దినోత్సవం' సందర్భంగా గాంధీ మాట్లాడుతూ, తాను, కాంగ్రెస్ పార్టీ సిఎపిఎఫ్ సిబ్బంది పట్ల అత్యంత గౌరవాన్ని కలిగి ఉన్నామని పేర్కొన్నారు. తమ సొంత దళాలలోనే పదోన్నతి అవకాశాలు, ఉన్నత నాయకత్వ బాధ్యతలను చేపట్టే వెసులుబాటు, తగిన గౌరవం పొందడం వారి హక్కులని ఆయన నొక్కి చెప్పారు. సీఆర్పీఎఫ్ శౌర్య దినోత్సవం సందర్భంగా, మన దళంలోని ధైర్యవంతులైన సైనికులకు నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, గౌరవపూర్వకంగా నివాళులు అర్పిస్తున్నాను," అని గాంధీ సామాజిక మాధ్యమం ఎక్స్‌పై ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు.

మీ ధైర్యం, త్యాగం ప్రతి రోజూ మన దేశాన్ని రక్షిస్తాయి. సరిహద్దుల్లో మోహరించి, మీరు దేశాన్ని సురక్షితంగా ఉంచుతారు, ఉగ్రవాదం, నక్సలిజం ముప్పులను ఎదుర్కొంటారు. అలాగే ప్రజాస్వామ్యపు మహోత్సవమైన మన ఎన్నికలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా చూస్తారు, అని ప్రతిపక్ష నాయకుడు వారి సేవలను కొనియాడారు.

అయితే, నిజమైన నివాళి కేవలం మాటలతో ముగిసిపోదు. సంవత్సరాల తరబడి త్యాగం, కఠోరమైన విధి నిర్వహణ, సేవ చేసినప్పటికీ, సిఎపిఎఫ్ సిబ్బందికి సకాలంలో పదోన్నతులు గానీ, తమ సొంత దళానికి నాయకత్వం వహించే హక్కు గానీ లభించడం లేదు. ఎందుకంటే, ఉన్నత నాయకత్వ పదవులు సంస్థ వెలుపలి వ్యక్తుల కోసం కేటాయించారు, అని ఆయన అన్నారు. సిఎపిఎఫ్ సిబ్బంది ప్రత్యేక శిక్షణను, విలువైన క్షేత్రస్థాయి అనుభవాన్ని, గాఢమైన వ్యూహాత్మక అంతర్దృష్టిని కలిగి ఉంటారని గాంధీ పేర్కొన్నారు. కనుక, జాతీయ భద్రతా దృక్పథం నుండే చూసినా, ఈ దళాలకు నాయకత్వం వహించేవారు ఆ వ్యవస్థ నుండే ఎంపికైనవారై ఉండటం అత్యవసరం. అప్పుడే వారు సైనికుల ప్రత్యేక సవాళ్లను, అవసరాలను నిజంగా అర్థం చేసుకోగలరు, అని గాంధీ వాదించారు.

నాయకత్వ అవకాశాలు నిరాకరించబడటం నుంచి, వేతనం, సంక్షేమం, గౌరవానికి సంబంధించి దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ఎదుర్కోవడం వరకు ఈ సంస్థాగత అన్యాయం, దేశ సేవ, భద్రత కోసం తమ జీవితాలనే అంకితం చేసిన సైనికుల మనోధైర్యాన్ని దెబ్బతీస్తోందని ఆయన అన్నారు. ఐదు కేంద్ర బలగాలకు సంబంధించిన ప్రస్తుతం ఉన్న విభిన్న సేవా నిబంధనల విధానాల స్థానంలో, వివిధ కేంద్ర సాయుధ పోలీసు బలగాల (సిఎపిఎఫ్) సిబ్బందిని నియంత్రించే ఒకే చట్టపరమైన విధానాన్ని రూపొందించే బిల్లుకు పార్లమెంటు ఆమోదం తెలిపిన కొద్ది రోజులకే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ఈ బిల్లును సమగ్ర పరిశీలన, సంబంధిత వర్గాల సంప్రదింపుల కోసం పార్లమెంటు సంయుక్త కమిటీకి పంపాలని పలువురు ప్రతిపక్ష సభ్యులు వాదించారు. కొత్త చట్టపరమైన వ్యవస్థను తీసుకువచ్చే ముందు సిబ్బంది, అధికారులను సంప్రదించాలని వారు తెలిపారు.

సిఎపిఎఫ్ సిబ్బంది, అధికారుల సమస్యలను ప్రభుత్వం అర్థం చేసుకుని ఉంటే, ఎప్పుడో ఒక మెరుగైన చట్టం అమల్లోకి వచ్చేదని వారు పేర్కొన్నారు. గత బుధవారం రాజ్యసభ ఆమోదించిన ఈ బిల్లును, లోక్‌సభ మూజువాణి ఓటు ద్వారా ఆమోదించింది. ఈ బిల్లు ద్వారా సిఎపిఎఫ్ జవాన్ల పట్ల జరుగుతున్న వివక్షను చట్టబద్ధంగా శాశ్వతం చేయడానికి ప్రభుత్వం కంకణం కట్టుకుందని గాంధీ విమర్శించారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు అటువంటి వివక్షాపూరిత చట్టాన్ని రద్దు చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## రూ.1000 అవినీతికి సంబంధించిన స్టింగ్ వీడియో విడుదల

- బిజెపి నాయకుల ప్రమేయం ఉందని టిఎంసి ఆరోపణలు
- ఈడీ విచారణకు డిమాండ్



**కోల్‌కత, ఏప్రిల్ 9 (ఉదయం):**

హుమాయున్ కబీర్‌కు సంబంధించినదిగా భావిస్తున్న ఒక స్టింగ్ ఆపరేషన్ వీడియోను తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) విడుదల చేయడంతో పశ్చిమ బెంగాల్‌లో కొత్త రాజకీయ దుమారం చెలరేగింది. సీనియర్ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకుల జోక్యం ఉన్న ఒక భారీ ఆర్థిక ఒప్పందాన్ని సూచించే సంభాషణలు ఈ ఫుటేజీలో ఉన్నాయని అధికార పార్టీ పేర్కొంది.

టిఎంసి ప్రకారం, ఆ వీడియోలో కబీర్ రూ. 1,000 కోట్ల విలువైన ఒక ఒప్పందం గురించి చర్చిస్తున్నట్లుగా కనిపిస్తోందని, ఇందులో రూ. 300 కోట్ల అడ్వాన్స్ చెల్లింపు ప్రస్తావన కూడా ఉందని ఆరోపణలు చేసింది. ఇది అత్యంత తీవ్రమైనదని అభివర్ణిస్తూ, ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని ఆ పార్టీ డిమాండ్ చేసింది.

ఆ సంభాషణగా భావిస్తున్న దానిలో పలువురు ప్రముఖ బీజేపీ నాయకుల ప్రస్తావన ఉందని టిఎంసి నాయకులు ఆరోపించారు. వీరిలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, పశ్చిమ బెంగాల్ బీజేపీ నాయకుడు సువేందు అధికారి, చివరకు ప్రధానమంత్రి కార్యాలయం (పిఎంఒ) కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. కాగా, ఈ ఆరోపణలపై బీజేపీ స్పందించలేదు.

**పెద్ద సంచలనం: రాజకీయ కుట్రను ఎత్తిచూపిన టిఎంసి**

విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, టిఎంసి సీనియర్ నాయకులు ఫిర్హాద్ హకీమ్, అరూప్ బిస్వాస్, కునాల్ ఘోష్ ఆ వీడియోను ఒక పెద్ద సంచలనంగా అభివర్ణించారు. ఆ వీడియోలోని అంశాలు, ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ ఎన్నికల సన్నాహాల సమయంలో, ఒక భారీ రాజకీయ కుట్రను సూచిస్తున్నాయని వారు వాదించారు.

**ఈడీ విచారణకు పిలుపు: రాజకీయ పోరు తీవ్రతరం**

ఇంత పెద్ద మొత్తాలకు సంబంధించిన ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరగాలని నొక్కిచెబుతూ, ఆరోపిత ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు చేయాలని టీఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ని కోరింది.




# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ ఉమ్మడి జిల్లాల వార్తలు

## అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ సాధ్యం
### జిల్లా కలెక్టర్ డా. సత్యశారద



**వరంగల్, ఏప్రిల్ 09 (వుదయం ప్రతినిధి) :**
'ప్రజాపాలన-పట్టణ ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా బుధవారం నగరంలో నిర్వహించిన ఎయిడ్స్ అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ డా. సత్యశారద జెండా ఊపి ప్రారంభించారు.

**ర్యాలీ, మానవహారం**
వరంగల్ మహానగర పాలక సంస్థ కేఎంసీ కార్యాలయం నుండి ఎంజీఎం ఆసుపత్రి వరకు ఈ ర్యాలీ కొనసాగింది. అనంతరం ఎంజీఎం కూడలి వద్ద నిర్వహించిన మానవహారంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎయిడ్స్ పట్ల సమాజంలో ఉన్న అపోహలను తొలగించి, సరైన అవగాహన కల్పించడం అత్యంత కీలకమని పేర్కొన్నారు.వ్యాధి వ్యాప్తి చెందే తీరుపై ప్రజలు స్పష్టత కలిగి ఉండాలని, సురక్షిత జీవన విధానాల ద్వారానే దీనిని నివారించగలమని సూచించారు.

**ఉచిత హెల్త్ క్యాంప్ ప్రారంభం**
అనంతరం వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత హెల్త్ క్యాంప్‌ను కలెక్టర్ ప్రారంభించారు. అక్కడ జరుగుతున్న వైద్య పరీక్షలను స్వయంగా పరిశీలించి, కార్మికుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వై.వి. గణేష్, సంధ్యారాణి, జెడ్పీ సీఈవో రామ్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు, ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ
### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ, ఏప్రిల్ 09 (వుదయం ప్రతినిధి) :**
ఎయిడ్స్ పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించడం ద్వారానే ఆ వ్యాధిని సమూలంగా అరికట్టవచ్చని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపునిచ్చారు. '99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఆరోగ్య వారోత్సవాల నాలుగో రోజున గురువారం జిల్లా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రెడ్ రన్' వాకథాన్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు.స్థానిక బస్టాండ్ చౌరస్తా నుండి కలెక్టరేట్ వరకు సాగిన ఈ ర్యాలీలో తెలంగాణ సాంస్కృతిక కళాకారులు కళాజాత పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...వ్యాప్తి నివారణ: అసురక్షిత లైంగిక సంబంధాలు, కలుషిత రక్తం, వాడిన సిరంజీల ద్వారా ఎయిడ్స్ వ్యాప్తి చెందుతుందని, సురక్షిత పద్ధతులే దీనికి శ్రీరామరక్ష అని పేర్కొన్నారు.చికిత్సా సౌకర్యాలు జిల్లాలో ప్రస్తుతం 1,342 మంది బాధితులు జనగామ జీజీహెచ్‌లోని ఏఆర్టీ కేంద్రంలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. జనగామ, స్టేషన్ ఘనపూర్ ప్రాంతాల్లో ఐసీటీసీ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని, బాధితులు ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు.ప్రజా భాగస్వామ్యంతో పల్లెలు, పట్టణాల్లో నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాల్లో ప్రజలు చురుగ్గా పాల్గొని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని కోరారు. "ఎయిడ్స్ నయం చేయలేని వ్యాధి అయినప్పటికీ, సరైన జాగ్రత్తలు, అవగాహనతో దీనిని పూర్తిగా నివారించవచ్చు"నిజిల్లాకలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు, ప్రోగ్రామ్ అధికారి డా. అశోక్, డా. కమల్ హసన్, డా. శ్రీతేజ, ఏఆర్టీ వైద్యాధికారులు, వైద్య విద్యార్థులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, ఎన్జీఓలు, ట్రాన్స్‌జెండర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎయిడ్స్ నివారణ నినాదాలతో హోరెత్తించారు.

## విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
### డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**ఎర్రుపాలెంలో 648 విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ**
**ఖమ్మం విద్యాశాఖ ఎఫ్.ఆర్.ఎస్. హాజరు లో రాష్ట్రంలో అగ్రస్థానం**
**ఎర్రుపాలెం, ఖమ్మంఏప్రిల్ 09 (వుదయం ప్రతినిధి):**

విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు.డిప్యూటీ సి.ఎం.,గురువారం ఎర్రుపాలెం మండలం కేంద్రంలోని టి.జి.ఎస్.డబ్ల్యు. రెసిడెన్షియల్ స్కూల్లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ విద్యార్థులు విద్యాసంస్థలకు చేరుకోవడంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకూడదనే ఉద్దేశంతో కొంతమంది స్నేహితులు,అమ్మ ఫౌండేషన్ సహకారంతో సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఇది విద్యార్థులను చదువుకు ప్రోత్సహించేందుకు ఇచ్చే చిన్న బహుమతిగా అన్నారు.విద్య ద్వారానే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే నమ్మకం తెలంగాణ ప్రభుత్వానికి ఉందన్నారు. ప్రతి పేద విద్యార్థికి అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య అందించాలనే లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనారిటీ అన్ని వర్గాల విద్యార్థులు ఒకేచోట చదివే విధంగా డిజిటల్ విద్య, ఇంగ్లీష్ మీడియం, క్రీడా మైదానాలు, ల్యాబ్, లైబ్రరీ వంటి సదుపాయాలతో ఈ పాఠశాలలు రూపొందుతున్నాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 100 పాఠశాలల పనులు ప్రారంభమైనట్లు, మధిర నియోజక వర్గంలోని బోనకల్ మండలం నిరిపురం గ్రామంలో పాఠశాల వేగంగా నిర్మాణంలో ఉందని తెలిపారు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడు



తూ 8వ తరగతి నుండి 10వ తరగతి, ఇంటర్ చదువుతున్న బాలురు, బాలికలకు అమ్మ ఫౌండేషన్ ద్వారా మొత్తం 648 సైకిళ్లను డిప్యూటీ సీఎం చేతుల మీదుగా పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన విద్య అందించేందుకు భారీగా వ్యయం చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్రహస్త కళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ దివాకర టి.ఎస్ జన్మదిన వేడుకలు

**జూన్ 13న భారీ రక్తదాన శిబిరానికి పిలుపు**
**ములుగు, ఏప్రిల్ 09 (వుదయం ప్రతినిధి):**



ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ పుట్టినరోజు వేడుకలను తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యాలయంలో కలెక్టర్‌కు అసోసియేషన్ ప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందజేసి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. 500 యూనిట్ల లక్ష్యంతో మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఈ సందర్భంగా టీజీఓ జిల్లా అధ్యక్షులు ఎం. సంపత్ రావు మాట్లాడుతూ... జిల్లా కలెక్టర్ జన్మదినోత్సవ స్ఫూర్తితో, సామాజిక బాధ్యతగా వచ్చే జూన్ 13, 2026 సోమవారం రోజున జిల్లాలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమం గురించి ఆయన వివరాలు వెల్లడించారు. కనీసం 500 యూనిట్ల రక్తాన్ని సేకరించాలని లక్ష్యం పెట్టుకున్నాం. భాగస్వామ్యంతో ఈ రక్తదాన శిబిరంలో జిల్లాలోని వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, ఎన్జీవో అసోసియేషన్లు, స్వచ్ఛంద సేవా సంస్థలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి. రక్తదానం ప్రాణదానంతో సమానమని, యువత మరియు ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ సామాజిక యజ్ఞంలో పాలుపంచుకోవాలని కోరారు. ఈ వేడుకల్లో టీజీఓ జిల్లా సెక్రెటరీ కందుల జీవన్ కుమార్, ట్రెజరర్ ప్రకాశ్ రెడ్డిలతో పాటు కిరణ్ కుమార్, కొమురయ్య, ఉపాధ్యక్షులు రాజు, శ్రీనివాస్, యశ్వంత్, రఫీక్, రాజు, రహీం, ప్రేమలత, ఇతర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు

## బీర్ల ఐలయ్య చిత్రపటానికి పాలాభిషేకం

**వడ్ల కొనుగోలు కేంద్రాన్ని మంజూరు చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు**
**- కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాలలో అభివృద్ధి సాధ్యం**
**- మండల సేవాదళ్ అధ్యక్షులు జల్లార్ రాజు యాదవ్**
**యాదాద్రి భువనగిరి, ఏప్రిల్9 (వుదయం జిల్లా ప్రతినిధి):**

మోటకొండూరు మండలంలోని పెద్దబావి (చాకలపల్లి) గ్రామానికి నూతనంగా వడ్ల కొనుగోలు కేంద్రాన్ని మంజూరు చేసినందుకు కృతజ్ఞతగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ మండల సేవాదళ్



అధ్యక్షులు, ఆలేరు యువజన కాంగ్రెస్ నాయకులు, గ్రామ వార్డు సభ్యులు జల్లార్ రాజు యాదవ్ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు యాదవ్ మాట్లాడుతూ ... ఆలేరు నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పెద్దబావి (చాకలపల్లి) రైతుల కష్టాలను గుర్తించి వెంటనే స్పందించి గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా రైతుల ఇబ్బందులను తొలగించినందుకు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకిటి మల్లారెడ్డి, పెద్దపెద్ద సిద్ధులు యాదవ్, వాకిటి సత్తిరెడ్డి, వాకిటి చంద్రారెడ్డి, జల్లారి శ్రీను, వాకిటి రామ్, వాకిటి తిరుమలరెడ్డి, రమేష్, వాకిటి యాదిరెడ్డి, ప్రశాంత్ యాదవ్, గ్రామ నాయకులు, రైతులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పిఎన్జీ,సీఎన్జీ గ్యాస్ పై ప్రజల్లో అవగాహన కల్పించాలి

**– జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**
**హనుమకొండ, ఏప్రిల్ 09 (వుదయం జిల్లా ప్రతినిధి) :**



జిల్లాలో పైప్డ్ నేచురల్ గ్యాస్ (PNG), కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (CNG) వినియోగాన్ని ప్రోత్సహించాలని, దీనిపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు.గురువారం రోజున హనుమకొండ కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మేఘా గ్యాస్ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో కలిసి 'జిల్లా స్థాయి సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ విస్తరణ కమిటీ' సమావేశాన్ని నిర్వహించారు.సురక్షితం, పొదుపు పీఎన్జీ, సీఎన్జీ గ్యాస్ వినియోగం గృహ, వాణిజ్య మరియు పారిశ్రామిక అవసరాలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని, ఇది తక్కువ ధరతో కూడుకున్నది, సురక్షితమైనదని కలెక్టర్ పేర్కొన్నారు. గ్యాస్ పైప్‌లైన్ పనులకు సంబంధించి వివిధ శాఖల నుండి అనుమతులు పొందేందుకు వీలుగా పరిశ్రమల శాఖ జీఎం నవీన్ కుమార్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని వెల్లడించారు.విస్తృత ప్రచారంతో గ్యాస్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకునే విధానం, సంబంధిత పోర్టల్ మరియు సబ్సిడీ వివరాలపై ప్రజలకు తెలిసేలా క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహించాలని మేఘా గ్యాస్ ప్రతినిధులను ఆదేశించారు.ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో పైప్‌లైన్ పనుల పురోగతి, ఇప్పటివరకు జరిగిన రిజిస్ట్రేషన్ల వివరాలను మేఘా గ్యాస్ ప్రతినిధి అవినాష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.నగర పరిధిలో గ్యాస్ కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.
ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్. రవి, మేఘా గ్యాస్ జిల్లా మేనేజర్ అవినాష్, డీసీఎస్వో వాజిద్ అలీ, విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్ రావు, ఏసీపీ నరసింహరావు, ఆర్ అండ్ బీ ఈఈ సురేష్ బాబు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ పై అవగహన సమాజ రక్షణ

**వ్యాధి గురించి తెలుసుకోవడం రక్షణకు మొదటి అడుగు**
**భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**
**భూపాలపల్లి ఏప్రిల్ 09 (వుదయం విలేకరి):**



ఎయిడ్స్ పై అవగహన సమాజ రక్షణ వ్యాధి గురించి తెలుసుకోవడం రక్షణకు మొదటి అడుగు అని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం డా బిఆర్ అంబేద్కర్ మైదానం నుండి డా బిఆర్ అంబేద్కర్ సెంటర్ వరకు ఎయిడ్స్ అవగాహన ర్యాలీని ఘనంగా నిర్వహించారు.ఈ ర్యాలీని జిల్లా కేంద్రంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ స్టేడియం వద్ద జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ఎయిడ్స్ నివారణే ఉత్తమ మార్గమని, సురక్షిత జీవనం ఆరోగ్యకరమైన సమాజమని అన్నారు వ్యాధి గురించి తెలుసుకోవాలని అపుడే రక్షణ అపోహలు దూరం అవుతాయని తెలిపారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్య రక్షణకు కట్టుబడి ఉందని, ఇలాంటి అవగాహన కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పులు తీసుకువస్తాయని తెలిపారు. కావున ప్రతి ఇక్కరు బాధ్యతగా వ్యవహరించి సురక్షిత జీవన విధానాన్ని అనుసరించాలని సూచించారు.ఈ ర్యాలీ ద్వారా ప్రజలకు వ్యాధి గురించి తెలుసుకోవడం రక్షణకు మొదటి అడుగు అనే సందేశాన్ని సమర్థవంతంగా చేరవేయగలిగామని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఎయిడ్స్ వంటి ప్రాణాంతక వ్యాధులపై ప్రజల్లో సరైన అవగాహన కల్పించడం అత్యంత అవసరమని తెలిపారు. వ్యాధి వ్యాప్తి మార్గాలు, నివారణ పద్ధతులు గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, అపోహలు, వివక్షలను నివారించాలని సూచించారు. ఈ కార్యక్రమం నిర్వహణ ద్వారా ఎయిడ్స్ వ్యాధి గురించి సరైన సమాచారం ప్రజలకు చేరవేయడం, వ్యాధి నివారణపై అవగాహన పెంపొందించడం, మరియు బాధితుల పట్ల సమాజంలో ఉన్న వివక్షను తగ్గించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా మధుసూదన్, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్లు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆవాస విద్యాలయాల తనిఖీలో లోపాలపై ఆగ్రహం

**– ఎంఈఓకు షోకాజ్ నోటీస్ జారీకి కలెక్టర్ ఆదేశం**
**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏప్రిల్ 09 (వుదయం ప్రతినిధి):**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాతకొత్తగూడెంలో ఉన్న సమగ్ర శిక్ష పరిధిలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాస విద్యాలయం, పట్టణ బాలుర ఆవాస విద్యాలయం ను గురువారం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఏడవ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, భోజనం, ఆహార నాణ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల ఇంగ్లీష్ పఠన సామర్థ్యాన్ని పరీక్షించిన కలెక్టర్, విద్యార్థుల ప్రదర్శన పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు సరిగా చదవలేకపోవడానికి గల కారణాలపై ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించిన కలెక్టర్, బోధనలో లోపాలు ఎందుకు ఉన్నాయో వివరణ కోరారు. పట్టణ స్థాయి పాఠశాల అయినప్పటికీ విద్యార్థుల సామర్థ్యం తక్కువగా ఉండటం ఆందోళనకరమని తెలిపారు.స్టోర్‌రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్, అవసరమైన సరుకులు తగినంతగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, సరఫరాలో లోపాలు ఎందుకు ఉన్నాయో సంబంధిత అధికారులను ప్రశ్నించారు. అనంతరం కిచెన్‌ను పరిశీలించిన కలెక్టర్, పరిశుభ్రత లోపాన్ని గమనించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోదని హెచ్చరించారు.
ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను సమగ్రంగా పరిశీలించిన కలెక్టర్, పాఠశాలలోని ఉపాధ్యాయులు, సిబ్బంది అందరూ కాంట్రాక్టు పద్ధతిలోనే విధులు నిర్వహిస్తున్నట్లు గమనించారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థుల అభ్యాసంపై ప్రభావం పడకుండా బాధ్యతతో పని చేయాలని సూచించారు. పాఠశాలలో వీధి బాలలు, రక్షించబడిన బాలలు, డ్రాప్ అవుట్ బాలలు చదువుతున్నందున వారికి ప్రత్యేక శ్రద్ధ అవసరమని కలెక్టర్ అన్నారు . అయితే పర్యవేక్షణలో లోపం స్పష్టంగా కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో సంబంధిత ఎంఈఓకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని అధికారులకు కలెక్టర్ అంకిత్ ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలల నిర్వహణ, బోధన ప్రమాణాలు, విద్యార్థుల సంక్షేమంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట పాఠశాల ప్రిన్సిపల్ రాంబాయి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు మేలు జరిగేలా చూడాలి

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**
**సూర్యాపేట ఏప్రిల్ 9(వుదయం):**

ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు మేలు జరిగే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం సూర్యాపేట రూరల్ మండలం ఎర్కారం గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి తో కలిసి కలెక్టర్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. తదుపరి పత్రికా విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 281 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, వడ్ల మిల్లులను కూడ గుర్తించడం జరిగిందని, కొనుగోలు కేంద్రాలకు వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం 4 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం రావచ్చని, ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో బేసిక్ మౌలిక సదుపాయాలైన వేయింగ్ మిషన్లు, మాయిశ్చరైజింగ్ మిషన్లు, త్రాగునీరు, టెంట్లు, వర్షాలు వస్తే అత్యవసరం పరిస్థితులలో టార్బలిన్ పట్టాలు, ట్యాగింగ్ మిషన్లు, సన్న వడ్ల కొనుగోలు కేంద్రాలలో కాలిబర్ స్కేల్స్ ఏర్పాటు చేశామని, 2,3 మండలాలకు కలిపి ఒక ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ను ఏర్పాటు చేశామని , జిల్లాస్థాయిలో కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని దీనిని జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ జిల్లాస్థాయిలో ధాన్యం కొనుగోలును పర్యవేక్షిస్తారని అలాగే మండల స్థాయిలో ధాన్యం కొనుగోలు కమిటీని ఏర్పాటు చేశామని వీరు ఆయా మండలాల పరిధిలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షిస్తారని, కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే కాంటాలు వేయాలని సూచించారు.



అకాల వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున రైతులను ముందుగానే అప్రమత్తం చేయాలని తెలిపారు. ఆలస్యం లేకుండా 2-3 రోజుల్లో వరి ధాన్యానికి కాంటాలు పూర్తి చేయాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని పిఎసిఎస్ అధికారులను కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై అధికారులు మోహన్ బాబు, శ్రీధర్, జిల్లా కోపరేటివ్ అధికారి ప్రవీణ్, అధికారులు పిఎసిఎస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్య కొనుగోలు కంట్రోల్ రూమ్ ప్రారంభం



**– జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**
**రైతులు సమస్యల పరిష్కారం కోసం 9347416178 నంబర్ కు కాల్ చేయండి**
**ములుగు, ఏప్రిల్ 09 (వుదయం ప్రతినిధి) :**

యాసంగి (రబీ) 202526 సీజన్ కలెక్టరేట్ లోని సివిల్ సప్లై కార్యాయం లో ఏర్పాటు చేసిన వరి ధాన్య కొనుగోలు కంట్రోల్ రూమ్ ను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.ప్రారంభించారు.సమస్యల పరిష్కారం కోసం రైతులు9347416178 నంబర్ ను సంప్రదించాలని తెలిపారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యాసంగి (రబీ) 202526 సీజన్ ప్రారంభమైన సందర్భంగా ములుగు జిల్లాలోని వరి ధాన్య కొనుగోలు ప్రక్రియను సులభతరం చేసేందుకు, రైతులకు ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని జిల్లా సివిల్ సప్లయ్ కార్యాలయం లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తూకం, రవాణా, మద్దతు ధర ఇతర సాంకేతిక ఇబ్బందులు తలెత్తినప్పుడు రైతులకు కంట్రోల్ రూమ్ ద్వారా తక్షణ పరిష్కారం లభిస్తుందని, సమస్యల ఫిర్యాదుల కోసం 9347416178 నంబర్‌ను సంప్రదించవచ్చని స్పష్టం చేశారు.రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసేలా పౌరసరఫరాల శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి హెచ్ మహేందర్ జి, సివిల్ సప్లై డి యం కృష్ణవేణి, డిప్యూటీ తహాశీల్దార్ విజయ్ కుమార్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఐవిపై అప్రమత్తతే రక్షణ



**– హెచ్ఐవిపై భారీ అవగాహన ర్యాలీ**
**మహబూబాబాద్, ఏప్రిల్ 09 (వుదయం ప్రతినిధి) :**

హెచ్ఐవి/ఎయిడ్స్‌పై సమాజంలో ఉన్న అపోహలను తొలగించి, బాధితుల పట్ల వివక్షను తగ్గించడమే లక్ష్యంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం రోజున మహబూబాబాద్ పట్టణంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా కోర్టు నుండి ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ వరకు సాగిన ఈ ర్యాలీని అధికారులు ప్రారంభించారు.
అవగాహన ప్రదర్శనలు, కళాకారుల బృందం సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా సురక్షిత జీవన విధానంపై ప్రజలకు సందేశాలను అందించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్ మాట్లాడుతూ.. హెచ్ఐవి పట్ల భయం వీడి, ముందస్తు పరీక్షల ద్వారా వ్యాధిని నియంత్రించవచ్చని సూచించారు. బాధితులపై సామాజిక వివక్షను (స్టిగ్మా) వీడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రిలో బాధితులకు అందుతున్న ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు కోరారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అర్జున్ నివారణా చర్యలను వివరించారు.ర్యాలీ అనంతరం జిల్లా కారాగారంలో ఖైదీలకు హెచ్ఐవి, టిబి, హెపటైటిస్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. అలాగే, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేక హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, సర్వోదయ యువజన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, శాంతారాజ్, నర్సింగ్ విద్యార్థులు, యూపీహెచ్‌సీ సిబ్బంది, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సహజ వాయువు సరఫరా వేగవంతం చేయాలి
### కలెక్టర్ బి. చంద్రశేఖర్



**నల్గొండ,ఏప్రిల్ 09 (వుదయం ప్రతినిధి):**

నల్గొండ జిల్లాలో పైపుల ద్వారా సహజ వాయువు) సరఫరా విస్తరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. వాణిజ్య ఎల్‌పిజి పై ఆధారపడడం తగ్గించేందుకు జిల్లా స్థాయిలో గ్యాస్ పంపిణీ విస్తరణ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో పౌరసరఫరాలు, పరిశ్రమలు, పంచాయతీరాజ్, విద్యుత్, పోలీస్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మధ్య ప్రాచ్య సంక్షోభం కారణంగా ఇంధన సరఫరాల్లో అంతరాయం ఏర్పడుతున్న నేపథ్యంలో వినియోగాన్ని విస్తరించడం అవసరమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ విస్తరణ పనులు చేపడుతున్నామని, మెగా సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ద్వారా పనులు జరుగుతున్నాయని తెలిపారు. పనులు వేగవంతం చేయడానికి 24 గంటలపాటు అనుమతి ఇచ్చినా, శబ్ద కాలుష్య నిబంధనలు మరియు భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ఇంటింటికి పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేయడం లక్ష్యమని, దీర్ఘకాలంలో వినియోగాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వాణిజ్య , పారిశ్రామిక వినియోగదారులు ముందుగా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల వద్ద నమోదు చేసుకుని, కోసం దరఖాస్తు చేయాలని సూచించారు.
ప్రాజెక్ట్ మేనేజర్ వంశీకృష్ణ మాట్లాడుతూ వలిగొండ నుంచి నార్కట్‌పల్లి వరకు ప్రాజెక్టు విస్తరించిందని, ప్రతి మూడు కిలోమీటర్లకు ట్యాంక్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నార్కట్‌పల్లి నుంచి నల్గొండ వరకు ఐదు గ్రామాలను పైప్‌లైన్ ద్వారా కలుపుతూ పనులు కొనసాగుతున్నాయని వివరించారు.ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఏఎస్పీ రమేష్, పౌరసరఫరాల అధికారి వెంకటేష్, జిల్లా పరిశ్రమల మేనేజర్ సతీష్, ఆర్ అండ్ బి ఈఈ శ్రీధర్ రెడ్డి, పంచాయతీరాజ్ అధికారి శేఖర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## ట్రాన్స్ జెండర్ క్లినిక్ ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్




**కామారెడ్డి, ఏప్రిల్ 9 (వుదయం ప్రతినిధి):**
ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వైద్యశాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 6 నుండి 11 వరకు నిర్వహిస్తున్న ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా గురువారం ప్రభుత్వ ఆసుపత్రి నుండి మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, ప్రజల్లో ఆరోగ్య సంరక్షణ పట్ల చైతన్యం కలిగించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు నిర్వహించిన స్పెషల్ క్యాంపులో భాగంగా సంపూర్ణ సురక్ష కేంద్రం, ట్రాన్స్ జెండర్ క్లినిక్‌ను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ కేంద్రాల ద్వారా ప్రత్యేక వర్గాలకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ఆరోగ్య వారోత్సవాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యమని, ముఖ్యంగా మహిళలు, పిల్లలు, ప్రత్యేక వర్గాల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నదని తెలిపారు. పరిశుభ్రత, పోషకాహారం, నివారణాత్మక వైద్యంపై దృష్టి పెట్టడం ద్వారా అనేక వ్యాధులను ముందుగానే నివారించవచ్చని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో వైద్యశాఖ అధికారి రవీందర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్, డీసీహెచ్ ఎస్ విజయ భాస్కర్ రెడ్డి, ఆర్డీవో ఎన్ వి గిరి, తహసీల్దార్ హిమబిందు, డిపిఆర్వో తిరుమల, ఎంపీడీఓ రాణి, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

## రబీ ధాన్యం కొనుగోలుకు పక్కా కార్యాచరణ

- తేమ వచ్చిన 24 గంటల్లోనే ధాన్యం కొనుగోలు,
- మిల్లులకు తరలింపు
- అనధికార మిల్లర్లకు ధాన్యం పంపితే
- కఠిన చర్యలు
- హమాలి కార్మికులు, టార్పాలిన్ కవర్లు
- సమృద్ధిగా సిద్ధం చేయాలి
- చిన్న రైతులకు ప్రాధాన్యం –
- వివక్ష లేకుండా కొనుగోలు జరగాలి
- ఆన్‌లైన్ నమోదు 24 గంటల్లో
- 100% పూర్తి చేయాలి





**పెద్దపల్లి, ఏప్రిల్ 09 (వుదయం ప్రతినిధి) :**
జిల్లాలో రబీ ధాన్యం కొనుగోలుకు పక్కా కార్యాచరణ సిద్ధం చేసి, లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో రబీ ధాన్యం కొనుగోలు పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి. వేణుతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, జిల్లాలో సుమారు 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ధారించామని, ఏప్రిల్ లో కొనుగోలు ప్రారంభించి మే నెలాఖరు నాటికి పూర్తి చేయాలని సూచించారు. తేమ శాతం వచ్చిన వెంటనే 24 గంటల్లో ధాన్యం కొనుగోలు పూర్తి చేసి కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కొన్ని కొనుగోలు కేంద్రాలు కేటాయించని మిల్లర్లకు ధాన్యం పంపిస్తున్నట్లు గమనించామని, యాసంగి సీజన్‌లో ఇది పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.ఆకస్మిక వర్షాల నేపథ్యంలో ప్రతి కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని, అవసరమైన హమాలి కార్మికులను సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో హమాలి ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. తేమ ధాన్యాన్ని ముందుగా ఎత్తివేయాలని, ఎటువంటి వివక్ష లేకుండా కొనుగోలు జరగాలని స్పష్టం చేశారు. రామగిరి గ్రామ సభలో చిన్న రైతుల ధాన్యం ముందుగా కొనుగోలు చేయలేదని వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకొని, ఈసారి అలాంటి పరిస్థితి రాకుండా చిన్న రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.నాణ్యమైన ధాన్యాన్ని 24 గంటలలోపు కేటాయించిన మిల్లులకు తరలించాలని, కొనుగోలు చేసిన ధాన్యం కొనుగోలు క కేంద్రాల్లో నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు.
యాసంగి ధాన్యం కొనుగోలుకు అవసరమైన గన్ని సంచుల సరఫరాపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ఎటువంటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.
కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ట్యాబ్‌ల ద్వారా 24 గంటల్లో 100% ఆన్‌లైన్ నమోదు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.
ఈ సమావేశంలో అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా సహకార అధికారి శ్రీ మాల, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## నిర్మల్ జిల్లా కు రాంజీ గోండ్ పేరు పెట్టాలి



**అదిలాబాద్ , ఏప్రిల్ 9 (వుదయం ప్రతినిధి):**
నిర్మల్ జిల్లాకు తొలి స్వాతంత్ర్య సమర యోధుడు, ఆదివాసీల పోరాట వీరుడు మర్సుకోలా రాంజీ గోండ్ పేరు పెట్టాలని, ఆయన పేరుతో మ్యూజియం ఏర్పాటు చేయాలనీ తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (TAGS) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు.

గురువారం జిల్లా కేంద్రం లోని సీఐటీయూ కార్యాలయం లో మర్సుకోలా రాంజీ గోండ్ 166 వ వర్ధంతి కార్యక్రమం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1857 సిపాయిల తిరుగుబాటు కన్నా ముందే దేశ స్వాతంత్ర కోసం బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన మహా నాయకులు మర్సుకోలా రాంజీ గోండ్ నాయకత్వం లో ఆదివాసీలు పోరాడారని, నిర్మల్ ప్రాంతంలో 1000 మంది ఆదివాసీలు తమ ప్రాణాలను ఇచ్చారని గుర్తు చేశారు. ఇంత గొప్ప పోరాటం చరిత్రలో ఎక్కడ రాయబడలేదని నేటి తరం యువత తొలి స్వాతంత్ర సంగ్రామం గురించి తెలుకోవాల్సిన అవశ్యకత ఉందని అందుకోసం ప్రభుత్వంమర్సుకోలా రాంజీ గోండు నాయకత్వం లో జరిగిన పోరాటాన్ని మ్యూజియం రూపంలో తేవాలని డిమాండ్ చేశారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఆదివాసీలకు అడవిపై భూమిపై హక్కుల కోసం జరిగిన పోరాటం చరిత్రలో పుటలో ఎక్కించాలని కోరారు.కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం ఆదివాసీలను అడవులకు దూరం చేసేలా, అడవులను ప్రయివేట్ కంపెనీలకు అప్పజెప్తుతుందని దీనికి వ్యతిరేకంగా మర్సుకోలా రాంజీ గోండ్ పోరాట స్ఫూర్తి తో పోరాడాలని పిలుపునిచ్చారు.
ఆదివాసీ హక్కుల సంరక్షణ, సమస్యల పరిష్కారం కోసం అందరు ఐక్య ఉద్యమాలకు సిద్ధం అవ్వాలని పిలుపునిచ్చారు

.ఈ కార్యక్రమం లో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లంకా రాఘవులు, జిల్లా అధ్యక్షులు స్వామి, రైతు సంఘం అధ్యక్షులు బండి దత్తాత్రి,ఐద్వ జిల్లా కార్యదర్శి మంజుల, నాయకులు పోచక్క, రామన్న, గంగారాం తదితరులు పాల్గొన్నారు

## రోగ నిర్ధారణ పరీక్షలు చేయాలి మెరుగైన వైద్యం అందించాలి




**ఆరోగ్య అవగాహన కల్పించాలి**
**కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ వారోత్సవాలు**
**రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన ర్యాలీ**

**రాజన్న సిరిసిల్ల, , ఏప్రిల్ 9 (వుదయం ప్రతినిధి):-**
జిల్లాలోని అన్ని ప్రభుత్వ దవాఖానల్లో రోగ నిర్ధారణ పరీక్షలు చేయాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా 99 రోజుల కార్యాచరణలో వైద్య ఆరోగ్య శాఖ ఆద్వర్యంలో వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో గురువారం వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్ద ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ర్యాలీ అంబేద్కర్ చౌక్ నుంచి బతుకమ్మ ఘాట్ వరకు నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా అన్ని ప్రభుత్వ దవాఖానల్లో రోగ నిర్ధారణ పరీక్షలు చేయాలని, రోగులకు ఉత్తమ సేవలు అందించాలని సూచించారు.
ఇంకా మెరుగైన వైద్య సేవల కోసం కరీంనగర్ లోని ప్రభుత్వ ఆసుపత్రులకు రెఫర్ చేయాలని ఆదేశించారు. ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా ఎయిడ్స్ నియంత్రణపై అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి,వేములవాడ ఏరియా ఆసుపత్రి, అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. నిర్ధారణ పరీక్షలు చేయాలని ఆదేశించారు. ఎయిడ్స్ బాధితులకు మెరుగైన వైద్యం, మందులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ట్రాన్స్ జెండర్స్ కోసం ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి రజిత, జీ జీ హెచ్ సూపరింటెండెంట్ ప్రవీణ్ కుమార్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




**అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులకు అంతర్జాతీయ సోషల్ స్టడీస్ ఒలంపియాడ్ లో**

## బంగారు పతకాలు

**కరీంనగర్, ఏప్రిల్ 9 (వుదయం ప్రతినిధి)**
విద్యార్థులకు సాంఘిక శాస్త్రం పట్ల అవగాహన ఉండాలని మరియు వాటిలోని విషయాల పట్ల పట్టు సాధించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇటెక్నో పాఠశాలలో చెందినటువంటి విద్యార్థులకు అంతర్జాతీయ సోషల్ స్టడీస్ ఒలంపియాడ్లో బంగారు పతకాలు సాధించడం పట్ల ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి సోషల్ స్టడీస్ పట్ల అవగాహన ఉండాలని మరియు వాటిలోని విషయాలను విశ్లేషణాత్మకంగా తెలుసుకొని వివిధ స్థాయిలలో నిర్వహింపబడేటువంటి పోటీ పరీక్షలకు హాజరై విజయాలను నమోదు చేయాలని వారు చెప్పారు. సాంఘిక శాస్త్రం ద్వారా పోటీ పరీక్షలలో సైతం విజయాలను చాలా సులభంగా సాధిస్తారని వారు అభిప్రాయపడ్డారు. సాంఘిక శాస్త్రంలోని విషయాలు కేవలం పోటీ పరీక్షలకే కాకుండా సామాజిక అవగాహన పెంపొందించుటకు చాలా ఉపకరిస్తాయని వారు చెప్పారు.ఈ నిర్వహణలో భాగంగా ఇటీవల కాలంలో ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ అయినా సిల్వర్ జోన్ ఫౌండేషన్ వారు నిర్వహించినటువంటి అంతర్జాతీయ సోషల్ స్టడీస్ ఒలింపియాడ్ లో పాఠశాలకు చెందినటువంటి పలువురు విద్యార్థులు బంగారు పతకాలతో పాటు రజత పతకాలను సాధించడం చాలా గొప్ప విషయం వారు చెప్పారు "విజేతల వివరాలు"
కోలా అతిథి కిషన్ వి.వేద విహార్, బి. కార్తికేయ గౌడ్, విగ్నేష్ , హెచ్. శ్రీహాన్, చైతన్య తదితరులు బంగారు పతకాలతో పాటు సర్టిఫికెట్లను గెలుచుకున్నారని వారు హర్షం వ్యక్తం చేశారు విద్యార్థులందరికీ పుష్పగుచ్ఛాలను అందజేసి భవిష్యత్తులోను మరిన్ని విజయాలను నమోదు చేయాలని వారు ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

## కావేటి సమ్మయ్య చౌరస్తా నామకరణ బోర్డును ప్రారంభించిన ఎమ్మెల్సీ దండే విఠల్

**తెలంగాణ ఉద్యమకారుడు మాజీ ఎమ్మెల్యే కావేటి సమ్మయ్య చౌరస్తా గా నామకరణ బోర్డును ప్రారంభించిన ఎమ్మెల్సీ దండే విఠల్**




**కాగజ్ నగర్ , ఏప్రిల్ 9 ( వుదయం ప్రతినిధి)**
కాగజ్ నగర్ పట్టణం బట్టుపల్లి చౌరస్తా వద్ద తెలంగాణ ఉద్యమకారుడు కావేటి సమ్మయ్యా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ మరియు కాగజ్ నగర్ మున్సిపల్ చైర్ పర్సన్ షాహిన్ సుల్తానా మాజీ ఎమ్మెల్యే కావేటి సమ్మయ్యా సతీమణి మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కావేటి సాయి లీలా మరియు కాగజ్ నగర్ మున్సిపల్ పాలకవర్గం సభ్యులు నివాళులు అర్పించి కావేటి సమ్మయ్య చౌరస్తా గా నామకరణం చేసిన బోర్డు ను ఎమ్మెల్సీ దండే విఠల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం నేడు మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు స్వర్గీయ కావేటి సమ్మయ్య గౌరవాన్ని అందించారు.ఈరోజు ప్రజా ప్రభుత్వం కాగజ్ నగర్ పట్టణంలోని బట్టుపల్లి చౌరస్తాను కావేటి సమ్మయ్య చౌరస్తాగా నామకరణం చేసినట్లు ఆయన తెలిపారు. కావేటి సమ్మయ్య సతీమణి మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కావేటి సాయి లీలా మాట్లాడుతూ కాగజ్ పట్టణంలోని బట్టుపల్లి చౌరస్తాకు స్థానిక ఎమ్మెల్సీ దండే విఠల్ చొరవతో మునిసిపల్ పాలకవర్గం ఏకగ్రీవ ఆమోదంతో కీర్తిశేషులు స్వర్గీయ కావేటి సమ్మయ్య చౌరస్తాగా నామకరణం చేసినందుకు వారి కటుంబ సభ్యులు మరియు వారి అభిమానులు ఎమ్మెల్సీ దండే విఠల్ కి పాలకవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో కాగజ్ నగర్ మున్సిపల్ చైర్మన్ షాహిన్ సుల్తానా పాలక వర్గ సభ్యులు ఎమ్మాజీ శారద సంతోష్,కచ్చకాయల జ్యోతి, వసిమ్మునిస, కావేటి విజయ్ కుమార్, మరియు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్మాజీ సంతోష్,జిల్లా ఉపాధ్యక్షులు యూసఫ్ ఖాన్,కొండ్ర జగ్గ గౌడ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కావేటి సమ్మయ్య అభిమానులు పాల్గొన్నారు.

## కరుడుగట్టిన కాంగ్రెస్ వాదికి పట్టాభిషేకం

**జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా సంగనభట్ల దినేష్ బాధ్యతల స్వీకరణ...**

**ధర్మపురి,ఏప్రిల్ 10 (వుదయం ప్రతినిధి):**
కరుడుగట్టిన కాంగ్రెస్ వాదిగా జగిత్యాల జిల్లా రాజకీయాలలో తనదైన ముద్ర వేసి,పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీని నమ్ముకున్న వ్యక్తికి గా పార్టీ లో క్రియాశీలకంగా ఉంటూ పార్టీ విధేయుడిగా అధిష్టానం గుర్తించి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆశీస్సులతో గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా అవకాశం లభించడంతో చైర్మన్ గా ఈ నెల 11 న జగిత్యాల జిల్లాలో సుమంగళి గార్డెన్ లో నిర్వహించే సభ లో సంగనభట్ల దినేష్ పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ జిల్లా గ్రంథాలయాల అభివృద్ధికి, పఠనాశక్తిని పెంచేం దుకు తన నియామకం దోహద పడుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభిమానుల



నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

**పుష్ప గుచ్చాలు వద్దు.. పుస్తకాలే ముద్దు జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పిలుపు**


సమాజంలో పుస్తక పఠనాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. శుభకార్యాలు,
సన్మాన కార్యక్రమాల్లో సాధారణంగా ఇచ్చే పూలగుత్తులు, శాలువాలకు బదులుగా "పుస్తకాలను" బహుమతిగా ఇవ్వాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ ప్రజలకు విన్నవించారు. పూలగుత్తులు తాత్కాలిక సంతోషాన్ని ఇస్తే, పుస్తకాలు కలకాలం నిలిచిపోయే జ్ఞానాన్ని అందిస్తాయని చైర్మన్ పేర్కొన్నారు.ఈ పుస్తకాలు విద్యార్థులకు, నిరుద్యోగులకు సాధారణ పాఠకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఆయన వివరించారు.ప్రజలు సేకరించిన లేదా బహుమతిగా పొందిన పుస్తకాలను జిల్లా గ్రంథాలయ సంస్థకు విరాళంగా అందజేయాలని, తద్వారా గ్రంథాలయాలను మరింత బలోపేతం చేయవచ్చని కోరారు.
ఆడంబరాలకు పోకుండా అర్థవంతమైన బహుమతులు ఇచ్చే సంస్కృతిని అలవాటు చేసుకో వాలని ఆయన జిల్లా ప్రజలను కోరారు.ఒక పుస్తకం వంద మంది స్నేహితులతో సమానం అనే నినాదాన్ని నిజం చేస్తూ, జగిత్యాల జిల్లాలో ఈ సరికొత్త సంప్రదా యాన్ని మొదలుపెట్టాలని సూచించారు.

## ఉల్లాసంగా ఉత్సాహంగా దీక్ష డిగ్రీ ఉత్సవ్ 2కె26




**నిర్మల్ జిల్లా 9 ఏప్రిల్ (వుదయం ప్రతినిధి)**
నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్కే కన్వెన్షన్ హాల్లో గురువారం "దీక్షా డిగ్రీ కళాశాల ఆన్యువల్ డే" ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ యు.గంగాధర్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థులు మంచి లక్ష్యాలను ఎంచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.అలాగే పోటీ ప్రపంచంలో ఏప్పటికప్పుడు స్కిల్స్ అప్డేట్ చేసుకోవాలన్నారు. జీవితంలో ఉద్యోగము సాధించడం ఒక్కటే లక్ష్యం కాదని మంచి తెలివితేటలూ ఉంటే ఎక్కడైనా బ్రతకచ్చన్నారు. అంతకుముందు విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ అధ్యాపకులు శ్రీహరి మరియు దీక్షా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ యం.శ్రీధర్ దీక్ష కళాశాల డైరెక్టర్స్ సి.వెంకట్ రెడ్డి టీ.ప్రమోదరావు కె.శంకర్అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్ఎస్‌యూఐ



**నిజామాబాద్, వుదయం, ఏప్రిల్ 09:**
జిల్లా కేంద్రం లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు నిజామాబాద్ కార్పొరేషన్ డిసిసి అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం రోజు NSUI ఫౌండేషన్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జెండా ఎగరవేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1971 ముందు కేరళ స్టూడెంట్స్ యూనియన్ మరియు పశ్చిమ్ బెంగాల్ స్టేట్ ఛాత్ర పరిషత్ లను విలీనం చేసి ఒక జాతీయ విద్యార్థి సంస్థను ఏర్పాటు చేసిన తర్వాత, 1971 ఏప్రిల్ 9వ తేదీన ఇందిరా గాంధీ గారి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి అనుబంధ సంఘాలుగా విలీనం చేసి నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా గా ఆవిర్భవించిందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా NSUI నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాకు చెందిన మహేష్‌కుమార్ గౌడ్ తన రాజకీయ అనుభవాన్ని NSUI విభాగంలో మొదలుపెట్టి ఈరోజు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఎదగడం జరిగిందని, అదేవిధంగా జిల్లాలో డి శ్రీనివాస్ గారు కూడా NSUI నాయకుడి నుండి రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు వరకు తన ప్రస్థానం కొనసాగించడం జరిగిందని ఈ సందర్భంగా బొబ్బిలి రామకృష్ణ వివరించారు. NSUI మరియు యూత్ కాంగ్రెస్ రెండు కాంగ్రెస్ పార్టీకి అనుబంధ విభాగాలు అని వీటికి ప్రత్యేక ఎజెండాకు ఏమీ ఉండదని వ్యక్తిగత ఎజెండా కూడా ఉండదని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆదేశాలను నియమాలను రెండు పాటించాల్సి ఉంటుంది అని, భవిష్యత్తులో ఎవరైనా పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని వ్యక్తిగత ఏజెండాలు పెట్టుకొని పని చేయకూడదని పార్టీ ఇచ్చే ఆదేశాలను నియమాలను పాటిస్తూ పార్టీ అభివృద్ధికి దోహద పడాలని బొబ్బిలి రామకృష్ణ అన్నారు.త్వరలోనే జిల్లా NSUI కమిటీని ఎన్నికల ద్వారా గాని ఇంటర్వ్యూ ద్వారా గానీ రాష్ట్రవ్యాప్తంగా అధిష్ఠానం ఆదేశాలతో నియమించడం జరుగుతుందని అలా వచ్చిన వారు కాంగ్రెస్ పార్టీ చెప్పే నియమాలకు క్రమశిక్షణకు కట్టుబడి ఉండాలని ఎవరైనా పార్టీ నియమాలను ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని రామకృష్ణ అన్నారు.
ఈ కార్యక్రమం లో అలాగే మాజీ జిల్లా NSUI అధ్యక్షులు శరత్ , GV రామకృష్ణ, రాంభూపాల్ , గన్ రాజ్ , విపుల్ గౌడ్ ,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను పకడ్బందీగా అమలు

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు**

**మంచిర్యాల జిల్లా ,ఏప్రిల్ 10 (వుదయం ప్రతినిధి):**
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 13వ తేదీ నుండి 18వ తేదీ వరకు అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు అన్నారు.
గురువారం హైదరాబాద్ నుండి రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ శివధర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్, రవాణా, విద్య వైద్య, రహదారులు భవనాల శాఖల అధికారులతో అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు
. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రహదారి భద్రతపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను , ఈ కమిటీలకు సర్పంచ్ చైర్మన్‌గా, ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది, యువత సభ్యులుగా వ్యవహరిస్తారని, గ్రామాల్లో రహదారి భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

## ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



**కామారెడ్డి, ఏప్రిల్ 9 (వుదయం ప్రతినిధి):-**
తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 202627 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశ పరీక్ష కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల పాఠశాల లింగంపేట్ ప్రిన్సిపల్ డా.బి.వనితరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 202526 విద్య సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఈ నెల 25వ తేదీలోపు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ గురుకులాల్లో లభించే నాణ్యమైన విద్య, వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మహబూబ్ నగర్ | మెదక్ ఉమ్మడి జిల్లాల వార్తలు



## మహిళల సాధికారతకు ప్రభుత్వ ప్రాధాన్యం

- సంగారెడ్డిలో ప్రత్యేక కార్యక్రమం

సంగారెడ్డి వుదయం

సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకం. ఈ దిశగా మహిళలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోంది. ఈ క్రమంలో సంగారెడ్డి జిల్లాలో మహిళల సాధికారతకు మరో అడుగు ముందుకేసింది.జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటి బచావో – బేటి పడావో పథకం కింద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు.
ఈ కార్యక్రమంలో భాగంగా 50 మంది లబ్ధిదారులకు కుట్టు యంత్రాలను పంపిణీ చేశారు. అదేవిధంగా 25 మంది మహిళలకు బ్యూటీషియన్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ చర్యల ద్వారా మహిళలు స్వయంగా ఉపాధి సంపాదించి తమ కుటుంబాలకు ఆర్థికంగా తోడ్పడగలుగుతారు.
ప్రత్యేకంగా ఆర్థికంగా వెనుకబడిన మహిళలు, ఒంటరి మహిళలు, వితంతువులు, చదువు మధ్యలో మానేసిన వారు వంటి వర్గాలకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతోంది. వీరికి ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడటమే కాకుండా, సమాజంలో గౌరవప్రదమైన స్థానం పొందేందుకు దోహదపడుతోంది.ఈ కార్యక్రమాన్ని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి మరియు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు సంకేతంగా మొక్కలు నాటడం జరిగింది.ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ, మహిళల అభ్యున్నతికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని, మహిళలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, బేటి బచావో – బేటి పడావో పథకం ద్వారా అందిస్తున్న కుట్టు యంత్రాలు, శిక్షణ కార్యక్రమాలు మహిళల జీవనోపాధిని మెరుగుపరుస్తాయని తెలిపారు.మొత్తానికి, ఈ కార్యక్రమం మహిళల ఆర్థిక స్వావలంబనకు దారితీసే కీలకమైన అడుగుగా నిలిచింది. ఇటువంటి కార్యక్రమాలు విస్తృత స్థాయిలో కొనసాగితే, మహిళలు సమాజంలో మరింత శక్తివంతమైన స్థానం సంపాదించగలరనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

## ఇల్లు అద్దెకిస్తే రద్దు



- డబుల్ బెడ్ రూం లబ్దిదారులకు గద్వాల కలెక్టర్ హెచ్చరిక
- మెడికల్ కళాశాల విద్యార్థుల, సిబ్బంది హాజరు నివేదించాలి
- ఇందిర మహిళా శక్తి భవన నిర్మాణం వేగవంతం కావాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల, ఏప్రిల్ 9 (వుదయం ప్రతినిధి):

గద్వాల పట్టణ శివారులోని రెండు పడక గదుల ఇండ్ల సమీపంలో జిల్లా ఆసుపత్రి, మెడికల్, నర్సింగ్ కళాశాలలు, సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్ భవనాలు నిర్మించడంతో ఈ ప్రాంతం మెడికల్ హబ్ గా అభివృద్ధి చెందబోతోందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.గురువారం గద్వాల శివారులో రూ. 5.7 కోట్ల నిధులతో నిర్మిస్తున్న ఇందిర మహిళా శక్తి భవనంతో పాటు పక్కనే కేంద్రీయ విద్యాలయ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. అలాగే మెడికల్, నర్సింగ్ కళాశాలల భవనాలు, రెండు పడక గదుల ఇండ్ల సముదాయంను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిర మహిళా శక్తి భవన నిర్మాణం నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని గుత్తేదారును ఆదేశించారు. ఈ భవనం ప్రారంభించుకున్నాక మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు వివిధ సందర్భాల్లో శిక్షణ కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. భవనంలో నిర్మిస్తున్న డార్మెటరీ హాల్స్, ఓపెన్ డైనింగ్, కిచెన్, తదితర గదులను తిరిగి పరిశీలించారు. భవనం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి, ఫర్నిచర్, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన నిధులకై ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కేంద్రీయ విద్యాలయ నిర్మాణానికి ఐదు ఎకరాల స్థలం కావలసి ఉండడంతో రెవెన్యూ అధికారులు ప్రతిపాదించిన స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. మ్యాప్ ద్వారా పూర్తి వివరాలను సంబంధిత అధికారులు కలెక్టర్ కు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవన నిర్మాణ డిజైన్ పూర్తయితే ప్రతిపాదిత స్థలం వద్ద రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు చేయవచ్చన్నారు. 2026 2027 విద్యా సంవత్సరంలోనే కేంద్రీయ విద్యాలయ తరగతులు ప్రారంభించాల్సి ఉన్నందున భవన నిర్మాణం పూర్తయ్యే వరకు గోనుపాడు గ్రామం వద్ద ఉన్న గద్వాల మండల కస్తూరిబా విద్యాలయ భవనంలో తాత్కాలికంగా తరగతులు నిర్వహించాలన్నారు. కలెక్టరేట్ సమీపంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న నర్సింగ్ కళాశాల భవనంలో కస్తూరిబా విద్యాలయ నిర్వహణకు పరిశీలించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం సమీపంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవనంలో తాత్కాలికంగా నిర్వహిస్తున్న మెడికల్ కళాశాలను కలెక్టర్ సందర్శించారు. విద్యార్థుల, సిబ్బంది హాజరు నివేదికను ఎప్పటికప్పుడు తమకు పంపాలని ఆదేశించారు. కళాశాలలోని వివిధ విభాగాల్లో పనిచేసే ఔట్సోర్సింగ్ సిబ్బంది నియామకానికి ఉన్న సమస్యలను పరిష్కరించి నిబంధనల ప్రకారం నియామకాలు చేపట్టాలన్నారు. అనంతరం మెడిసిన్ విద్యార్థులకు తరగతి గదిలో నిర్వహిస్తున్న క్విజ్ పోటీలను కలెక్టర్ కాసేపు కూర్చుని పరిశీలించారు. ప్రస్తుత భవనం ముందు రూ.140 కోట్ల అంచనాతో నిర్మించే మెడికల్ కళాశాల భవన నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురు మెడిసిన్ విద్యార్థులు తమ సమస్యలపై కలెక్టర్ కు వినతిపత్రాలు ఇవ్వగా పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. అలాగే పక్కనే రూ.12 కోట్లతో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. నర్సింగ్ కళాశాల అకాడమిక్, వసతి గృహ భవనాల నిర్మాణ పనులు మిగిలి ఉంటే వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నర్సింగ్ కళాశాల భవనంలో వివిధ విభాగాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం సమీపంలోని సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్ భవనాన్ని సందర్శించి అక్కడి అధికారులతో మాట్లాడారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ వైద్యశాలలకు ఇక్కడి నుంచే మందులను, ఇతర మెడికల్ సామాగ్రిని సరఫరా చేస్తున్నందున తగు సూచనలు చేశారు. చివరగా రెండు పడక గదుల ఇండ్లను సందర్శించిన జిల్లా కలెక్టర్ అక్కడి పలువురు లబ్ధిదారులతో మాట్లాడారు. డిప్పు విధానంలో రెండు పడక గదుల ఇండ్లను కేటాయించబడ్డ అర్హులైన లబ్ధిదారులే నివాసం ఉండాలని, అద్దెకు ఇవ్వడం, అమ్ముకోవడం వంటివి చేస్తే కేటాయింపు రద్దుచేసి ఇతర అర్హులైన లబ్ధిదారులకు ఆ ఇండ్లను ఇవ్వడం జరుగుతుందన్నారు. రెండు పడక గదుల ఇండ్ల సముదాయం వద్ద నీటి సమస్యను పలువురు లబ్ధిదారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రింగ్ రోడ్డు సమీపంలో మెడికల్ హబ్ గా అభివృద్ధి చెందుతున్న ప్రాంతంలో రెండు పడక గదుల సముదాయం నిర్మించడంతో ఈ ప్రాంతానికి భవిష్యత్తులో ఎంతో ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇలాంటి విలువైన ప్రదేశంలో నిర్మించిన రెండు పడక గదుల ఇండ్లను వినియోగించుకోకుండా దుర్వినియోగం చేయడం తగదన్నారు. లబ్ధిదారులకు ఏ సమస్య ఉన్న పరిష్కరిస్తామని, నివసించకుండా ఉన్నవాళ్లు నెల రోజుల్లోగా గృహప్రవేశాలు చేసుకోవాలని లేదంటే వారికి కేటాయించిన ఇండ్లను ఇతర అర్హులైన వారికి కేటాయింపు చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఆర్డీవో శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్, డిఈ లక్ష్మన్న, డీఈవో విజయలక్ష్మి, టిజి ఎంఎస్ ఐడిసి డిఈ శ్రీనివాసులు, ఏఈ రహీం, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, పర్యవేక్షకులు ఇందిర, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ హనుమంతమ్మ, గద్వాల తహసిల్దార్ హరికృష్ణ, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### పాడి గేదెల పంపిణీ పథకం
## దరఖాస్తుల గడువు పొడగింపు

- ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు బి. విజయ్ భార్గవ

వుదయం, సిద్దిపేట (ఏప్రిల్ 09)



202526లో ఎస్సీ కార్యాచరణ ప్రణాళిక భాగంగా అమలు చేస్తున్న పాడి గేదెల పంపిణీ పథకం దరఖాస్తు గడువును ఈ నెల 16 వరకు పొడిగించినట్లు ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు బి. విజయ్ భార్గవ గురువారం ఓ ప్రకటన లో తెలిపారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రం, పట్టాదారు పాస్‌బుక్, ఫోటోలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దివ్యాంగులు సదరం సర్టిఫికేట్ జత పరచాలని అలాగే గేదెల పోషణకు కనీసం 10 గుంటల భూమి ఉండాలి లేదా గడ్డి కొనుగోలు చేసే సామర్థ్యం ఉండాలని తెలిపారు.ఆన్‌లైన్ దరఖాస్తు పూర్తి చేసిన తర్వాత గ్రామీణ ప్రాంతాల వారు ఎంపీడీవో కార్యాలయంలో, పట్టణ ప్రాంతాల వారు మున్సిపల్ కార్యాలయంలో సంబంధిత ధృవీకరణ పత్రాలు సమర్పించాలని సూచించారు. అర్హులైన ఎస్సీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

### భూ సమస్యల పరిష్కారంపై
## కలెక్టర్ల స్పెషల్ ఫోకస్!



వనపర్తి ఏప్రిల్ 9( వుదయం ప్రతినిధి)

జిల్లాలో భూ భారతి పెండింగ్ దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని ఎన్ఐసి హాల్లో జిల్లా కలెక్టర్ భూభారతి పెండింగ్ అప్లికేషన్లు సహా సాదాబైనామ అప్లికేషన్ల అంశంపై అన్ని మండలాలు తహసిల్దార్లు ఇతర రెవెన్యూ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు.కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భూ భారతి పెండింగ్ దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. భూభారతి పెండింగ్ ఫైల్స్ ను కలెక్టర్ లాగిన్ కు పంపడంతో పాటు వాటి యొక్క ఫిజికల్ ఫైల్స్ కూడా పంపాలని సూచించారు. అలాగే సాదా బైనామా దరఖాస్తులను జీ ఓ 76, 77 ప్రకారం నిబంధనల మేరకు పరిష్కరించాలని ఆయన తెలిపారు. ప్రభుత్వ భూములకు సంబంధించి అన్ని మండలాల్లో తహసిల్దార్ ల వద్ద ప్రత్యేకంగా జాబితా సిద్ధం చేసి ఉంచుకోవాలని చెప్పారు. అదేవిధంగా త్వరలో ప్రారంభం కానున్న జనగణన ప్రక్రియలో భాగంగా తహసీల్దార్లు తమ సీఎంఎంఎస్ లాగిన్ లో హెచ్ ఎల్ బి లను ( హౌస్ లిస్టింగ్ బ్లాక్ ) క్రియేట్ చేయడం మొదలుపెట్టాలన్నారు. చిన్న గ్రామాలను గుర్తించి వాటిని త్వరగా హెచ్ ఎల్ బిలు క్రియేట్ చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, అన్ని మండలాల తహసిల్దార్లు ఇతర రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### పోటు రంగారావు మీద పెట్టిన దేశద్రోహ కేసును
## వెంటనేఎత్తివేయాలి

నారాయణపేట, ఏప్రిల్ 9 (వుదయం ప్రతినిధి):



సిపిఎంఎల్ మాస్ లైన్ కేంద్ర కమిటీ సహాయ కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి అయిన పోటు రంగారావు మీద కేంద్ర ప్రభుత్వం, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ఎన్ఐఏ పెట్టిన దేశద్రోహం, ఉప, తదితర కుట్ర కేసులను వెంటనే ఎత్తివేయాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ డివిజన్ కార్యదర్శి కె కాశీనాథ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమిత్ షా, మోడీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల మీద, దేశ సంపదను అదాని, అంబానీ లకు దోచిపెడుతూ,ప్రజల మీద మోపుతున్న దేశద్రోహం, కుట్ర కేసులను,ప్రశ్నించి, వ్యతిరేకిస్తున్నందుకు, నిరసన తెలియపరచినందుకు సహించలేక బంధించుటకు ప్రభుత్వం అనేక రకాలుగా వేధింపులకు గురి చేస్తుందని వారు విమర్శించారు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ చట్టబద్ధంగా బహిరంగ కార్యకలాపాలను నిర్వహిస్తూ, ప్రజా సమస్యల మీద పోరాడుతున్నదని, పాలకవర్గాలు పెట్టుబడిదారీ వర్గాలు ప్రజలను దోపిడీ చేస్తున్న తీరుతెన్ను లను ప్రజలకు వివరించి,చైతన్య పరుస్తున్నందుకు తప్పుడు కేసులను బనాయించి జైల్ లో బంధించటానికి పూనుకున్న దని వారు విమర్శించారు. ప్రొఫెసర్ సాయిబాబా, జేఎన్యు యూనివర్సిటీ నాయకుడు ఉమర్ ఖలీదు, హర గోపాల్, విమలక్క, గాదె ఇన్నయ్య తదితరుల మీద కూడా తీవ్రవాద కార్యకలాపాల నిరోధక చట్టం,దేశద్రోహం కేసులను మోపిందనీ బెదిరి పాలకవర్గాలు వాటినే ఎత్తివేసిందని వారు తెలిపారు. అత్రాస్లో ఒక బాలిక మీద అత్యాచారం జరిపితే న్యూస్ ని కవర్ చేయడానికి వెళ్లిన కప్పన్ మీద కూడా ఉప కేసు మోపి జైల్లో బంధించిందని ఈ చర్య అప్ర ప్రజాస్వామికమైనదని వారు విమర్శించారు. పోటు రంగారావు 50 సంవత్సరాల నుండి విప్లవోద్యమంలో, పి డి ఎస్ యు, పి వై ఎల్ వంటి విద్యార్థి యువజన సంఘాలలో సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా విప్లవ పార్టీఆధ్వర్యలో సుదీర్ఘకాలం పోరాటాలలో పాల్గొన్నారని తెలియపరిచారు. అందుకు కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యల మీద పోరాడుతున్నందుకు కట్టడి చేయటానికి తప్పుడు ఆరోపణలు చేసి కుట్ర కేసులు బనాయిస్తుందని, ఇది ఇది దోపిడీ పాలకవర్గాలకు నచ్చటం లేదని వారు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం బనాయించిన దేశద్రోహం ఉపా లాంటి కుట్టపూరితమైన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.




### అవగాహనతోనే
## ఎయిడ్స్ నివారణ సాధ్యం

- కలెక్టర్ ప్రతిమా సింగ్

వుదయం, మెదక్ (ఏప్రిల్ 09):

మెదక్ జిల్లాలో ఎయిడ్స్‌పై అవగాహన పెంపొందించడం ద్వారా సమాజాన్ని ఆరోగ్యవంతంగా ఉంచుకోవచ్చని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరోగ్య వారోత్సవాల్లో నాలుగో రోజు ఎయిడ్స్ అవగాహన, నివారణ దినోత్సవం సందర్భంగా రెడ్ రన్ వాకథాన్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, డీసీహెచ్ఎస్ శివ దయాల్ తదితరులతో కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.ప్రభుత్వ ఆసుపత్రి నుండి రాందాస్ చౌరస్తా వరకు నిర్వహించిన ఈ ర్యాలీ ద్వారా ఎయిడ్స్ నివారణపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హెచ్ఐవి/ఎయిడ్స్ ఒక నివారించలేని వ్యాధి అయినప్పటికీ సరైన జాగ్రత్తలు పాటిస్తే దాని వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. అసురక్షిత లైంగిక సంబంధాలు, సంక్రమిత రక్త మార్పిడి, వాడిన సిరంజీల ద్వారా వ్యాధి వ్యాప్తి చెందుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సురక్షిత పద్ధతులు పాటించాలని సూచించారు.జిల్లాలో ప్రస్తుతం 385 హెచ్ఐవి/ఎయిడ్స్ కేసులు నమోదై ఉండగా, బాధితులకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఏఆర్టీ కేంద్రంలో అవసరమైన చికిత్స అందిస్తున్నామని తెలిపారు. బాధితులు భయపడకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందాలని సూచించారు. అనంతరం అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ, ఎటువంటి భయాలకు గురికాకుండా హెచ్ఐవి పరీక్షలు చేయించుకోవాలని, పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వారు తగు జాగ్రత్తలు పాటిస్తూ జీవన శైలిని కొనసాగించవచ్చని చెప్పారు. జిల్లాలో గ్రామాలు, పట్టణాల్లో అవగాహన కోసం కళాజాతలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ర్యాలీలో వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్య మరియు నర్సింగ్ విద్యార్థులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఎన్జీఓ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్లకార్డులు పట్టుకుని ఎయిడ్స్ నివారణ నినాదాలతో ప్రజలకు సందేశం అందించారు.




### అంగన్వాడి కేంద్రాలను
## బలోపేతం చేయాలి

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల ఏప్రిల్ 9 (వుదయం ప్రతినిధి)

జిల్లాలో అంగన్వాడి కేంద్రాలను బలోపేతం చేసి, పిల్లల సంక్షేమం కోసం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్‌లో అంగన్వాడీ కార్యక్రమాల అమలు, పిల్లల సంక్షేమం, పోషకాహారం, బాల్య వివాహాల నివారణ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అంగన్వాడి కేంద్రాలను మరింత బలోపేతం చేయాలని, ప్రతి సిబ్బంది తమ బాధ్యతలను కట్టుదిట్టంగా నిర్వహించాలని సూచించారు. పోషకాహార లోపంతో ఉన్న సామ్, మామ్ పిల్లలను ముందుగానే గుర్తించి వారికి ప్రత్యేక పోషకాహార సేవలు అందిస్తూ, వారి సంఖ్యను గణనీయంగా తగ్గించేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పిల్లల్లో మానసిక, శారీరక ఎదుగుదలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎదుగుదల లోపం ఉన్నవారికి పౌష్టికాహారం, అవసరమైన వైద్య సేవలు అందించి సాధారణ స్థితికి తీసుకురావాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల్లో పిల్లల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, వారు సురక్షితంగా ఇంటికి చేరే వరకు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. కేంద్రాల్లో అందించే ఆహార పదార్థాల నాణ్యతను కచ్చితంగా పాటిస్తూ, బ్యాచ్ వారీగా సరైన విధంగా పంపిణీ చేయాలని, స్టాక్ రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో శిశు, మాత మరణాల రేటును తగ్గించేందుకు సమగ్ర చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో తాగునీరు, పరిశుభ్రత, హ్యాండ్‌వాష్ అలవాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. జిల్లాలో బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలని సూచించారు. బాల్య వివాహాల నివారణకు అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, ప్రజాప్రతినిధులు కలిసి గ్రామ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌పై విస్తృత అవగాహన కల్పించి, సమస్యలు ఎదురైతే వెంటనే స్పందించాలని ఆదేశించారు. అలాగే సఖి కేంద్రాల సేవలపై ప్రజల్లో అవగాహన పెంచాలని తెలిపారు. సఖి టీమ్, జిల్లా బాలల సంరక్షణ కమిటీతో సమన్వయం చేసుకుని గ్రామ సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాలను సమయానికి తెరచి చిన్నారులకు సేవలను క్రమబద్ధంగా అందించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల సంక్షేమానికి ఉత్తమ విధానాలు అమలు చేసిన సిబ్బందిని గుర్తించి సత్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి సునంద, సీడీపీవోలు, సూపర్వైజర్లు, అంగన్వాడి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



### పాడి గేదెల పథకానికి
## దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్ నగర్ ఏప్రిల్ 9 (వుదయం ప్రతినిధి)

ఎస్.సి.యాక్షన్ ప్లాన్ 202526 కార్యక్రమంలో భాగంగా 70 శాతం సబ్సిడీతో (2) పాడి గేదెల పథకం చేసుకునేందుకు ఈ నెల 16 వరకు గడువు పొడిగించినట్లు జిల్లా కలెక్టర్,ఎస్.సి. కార్పొరేషన్ చైర్మన్ ఖుష్బూ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తికల షెడ్యూల్డు కులాల అభ్యర్థులు టి జి ఓ బి ఎం ఎం ఎస్ ఆన్లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తులు నమోదు చేసుకోవచ్చని ఆమె తెలిపారు .ఆన్లైన్ లో ధరఖాస్తు చేసుకున్నవారు సంబంధిత పత్రాలు మండల కార్యాలయము , మున్సిపల్ కార్యాలయంలో (2) జిరాక్స్ కాపీలు సమర్పించగలరని,ఇతర వివరములకు 9849905996 నందు సంప్రదించాలని ఆమె ఈ ప్రకటనలో తెలిపారు.

## 'అరైవ్.. అలైవ్ కార్యక్రమాలను విజయవంతం చేయాలి

- ఈ నెల13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహించే అరైవ్, అలైవ్, కార్యక్రమాలు,
- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్,

నాగర్ కర్నూల్, ఏప్రిల్ 09 (వుదయం ప్రతినిధి):




గురువారం నాడు హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు డిజిపి శివధర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహించే అరైవ్, అలైవ్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీ లను ఆదేశించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ....., రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు,ప్రాణ నష్టాలను తగ్గించాలనే సంకల్పంతో పోలీసు శాఖ' రాష్ట్ర రోడ్డు రవాణా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే అరైవ్, అలైవ్' కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించాలన్నారు.
నాగర్ కర్నూల్ కలెక్టరేట్ నుండి జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ తో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ...., జిల్లాలో రోడ్డు ప్రమాదాలు, ప్రాణ నష్టాలను తగ్గించాలనే సంకల్పంతో పోలీసు శాఖ 'అరైవ్.. అలైవ్' ప్రచార కార్యక్రమాలను విరివిగా చేపట్టి ప్రజలకు విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ బాదావత్ సంతోష్ వివరించారు. జిల్లాలో రోడ్ సేఫ్టీ సమావేశాలను నిర్వహించడం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా గుర్తించిన బ్లాక్ స్పాట్ ల వద్ద ప్రమాదాలు జరగకుండా ఎందుకు కావలసిన ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని, ప్రజల భాగస్వామ్యంతో రోడ్డు ప్రమాదాలను, మరణాలను తగ్గించడమే జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమని, రోడ్డు భద్రత ప్రాముఖ్యతను ప్రతి పౌరుడి మనసులో బలంగా నాటేందుకే అరైవ్ అలైవ్‌ను కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమం ద్వారా ప్రజలకు సురక్షిత డ్రైవింగ్ సంస్కృతిని అలవాటు చేసి, రోడ్డు భద్రతా వ్యవస్థలను పటిష్ఠం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. విద్యార్థులు, ప్రముఖులు, మీడియా, ప్రజాప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో రోడ్డు భద్రతలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్నది తమ ధ్యేయమని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో విద్యార్థుల నుంచి ఉన్నతాధికారి వరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ వివరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం, కార్లలో సీటు బెల్టులు పెట్టుకోకపోవడం, వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ వాడడం, మద్యం సేవించి నడపడం, సిగ్నల్ జంప్, స్టాప్ లైన్ దాటడం, హైవేలపై ఆటోల ఓవర్ లోడింగ్, ఎడమవైపు నుంచి ఓవర్ టేకింగ్ వంటి ప్రమాదకర అలవాట్లపై ఈ ప్రచారంలో ప్రత్యేక దృష్టి పెట్టామని కలెక్టర్ తెలిపారు. జిల్లా స్థాయిలో జిల్లా యంత్రాంగం నేతృత్వంలో, గ్రామాల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ ట్రాఫిక్ సేఫ్టీ కమిటీల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తామని, జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలల విద్యార్థులను తరలించే బస్సు డ్రైవర్లు, ఆటో డ్రైవర్లకు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాల నిర్వహించడం జరుగుతుంది తెలిపారు ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్డీవో చిన్న బాలు, డిఇఓ రమేష్ కుమార్, డిఎంహెచ్ఓ డాక్టర్ రవి కుమార్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### నర్రా రాఘవరెడ్డి కుటుంబాన్ని
## పరామర్శించిన మాజీ ఎంపీ

వుదయం , కొండపాక ప్రతినిధి ఏప్రిల్ 9:

మండల పరిధిలోని దుద్దెడ శంభూదేవాలయ ట్రస్ట్ డైరెక్టర్ నర్రా రాఘవ రెడ్డిగత వారం రోజులకింద గుండెపోటుతో మరణించగ మాజీ ఎంపీ, మహబూబాబాద్ బీఆరెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలుమాలోతు కవిత గురువారం రోజు సాయంత్రం దుద్దెడలోని నర్రా రాఘవరెడ్డి ఇంటికి చేరుకొని మృతుని చిత్ర పఠానికిపూల మాల వేసి నివాళి సమర్పిస్తు, కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కొండపాక మండల అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్, మాజీ సర్పంచ్ పెద్దంకుల శ్రీనివాస్ గౌడ్, నాయకులు గొనె శ్రీనివాస్, గొల్లపల్లి రమేష్ కుమార్ శర్మ, వెంకీ రెడ్డి, దుర్గాప్రసాద్, చిక్కుడు బాను, పల్లె బాబు, తలారి ఎల్లం, ప్రేమ్ చందు, రాఘవ రెడ్డి కుటుంబ సభ్యులు, కూతురు అల్లుడు బండి కీర్తి మాధవరెడ్డి పాల్గొన్నారు.



# రోడ్ సేఫ్టీ కార్యక్రమాలు విజయవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల ఏప్రిల్ 9 (వుదయం ప్రతినిధి)**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈనెల 13 నుంచి 18 వరకు అరైవ్ అలైవ్ రోడ్ సేఫ్టీ పై నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపి శివధర్ రెడ్డి, సంబంధిత ఉన్నతాధికారుల తో కలిసి రోడ్ సేఫ్టీ వీక్ పై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహదారి ప్రమాదాల్లో ఏటా తెలంగాణ రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ప్రాణ నష్టాలు జరుగుతున్నా యన్నారు. గత మూడు నెలల కాలంలోనే రాష్ట్ర వ్యాప్తంగా 330 మంది రహదారి ప్రమాదాల్లో మృత్యువాత పడ్డారన్నారు. ఈ నేపథ్యంలోనే రహదారి ప్రమాదాల నివారణకు 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 13 నుంచి 18 వరకు రోడ్ సేఫ్టీ పై వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోజు వారీగా నిర్వహించే వివిధ అవగాహన కార్యక్రమాల గురించి తెలియజేశారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వీసి అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ రోడ్ సేఫ్టీ కార్యక్రమాలను జిల్లాలో విజయవంతం చేయాలన్నారు. ఈనెల 13న రోడ్ సేఫ్టీ పై గ్రామస్థాయి కమిటీ ఎన్నిక కావాలన్నారు. 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా రోడ్ సేఫ్టీ ప్రతిజ్ఞ, ఇతర కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆర్టీసీ ఆధ్వర్యంలోనూ రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలీస్ శాఖ తరపున అరైవ్, అలైవ్ కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించడం, కారులో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్టును పెట్టుకోవడం వంటి జాగ్రత్తలు పాటిస్తే రహదారి ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చు అన్నారు. పిల్లల చేత పెద్దలకు రహదారి భద్రతపై అవగాహన కలిగిస్తే పరివర్తన వస్తుందని అభిప్రాయపడ్డారు. రోడ్ సేఫ్టీ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు సంబంధిత శాఖల అధికారులందరూ సహకరించాలని ఈ సందర్భంగా ఎస్పీ కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, అదనపు ఎస్పీ శంకర్, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులకు
# దరఖాస్తులను ఆహ్వానించిన జిల్లా కలెక్టర్

**గద్వాల, ఏప్రిల్ 9 (వుదయం ప్రతినిధి):**



శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా సాంకేతిక శిక్షణా సంస్థలో 202627కు పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులకు అర్హత గల బాలికల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నందు 3 సంవత్సరాల పాలిటెక్నిక్ డిప్లమా కోర్సులకు 202627 విద్యా సంవత్సరానికి తల్లిదండ్రుల కోల్పోయిన అనాధ బాలికలు, నిరాశ్రయులు, చైల్డ్ హోమ్స్/మహిళా సంస్థలలో ఉన్న బాలికలు, అక్రమ రవాణాకు గురైన బాధితులు, దివ్యాంగ బాలికలకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సంస్థలో సివిల్, ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్, సెమీకండక్టర్ టెక్నాలజీ,ల్యాండ్‌స్కేప్ డిజైన్ వంటి డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ప్రతి కోర్సులో 60 సీట్ల చొప్పున మొత్తం 360 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఈ మొత్తం సీట్లలో 70% సీట్లు అనాధ, నిరాశ్రయ బాలికలకు కేటాయించబడినట్లు, అలాగే 3% సీట్లు దివ్యాంగులకు కేటాయించినట్లు తెలిపారు. అర్హతగా కనీసం పదవ తరగతి ఉత్తీర్ణత ఉండాలని, పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష రాయకపోయినా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత విద్యతో పాటు వసతి సౌకర్యం కూడా కల్పించబడుతుందని తెలిపారు. కుల,ఆదాయ ధృవీకరణ పత్రాలు (అనాధలకు మినహాయింపు), తల్లిదండ్రుల మరణ ధృవీకరణ పత్రం, సంబంధిత సంస్థ నుండి బోనఫైడ్ సర్టిఫికేట్, టీసీ, అధ్యయన ధృవీకరణ పత్రం, పదవ తరగతి మార్కుల మెమో సమర్పించాలన్నారు. అభ్యర్థులు అవసరమైన ధృవీకరణ పత్రాలతో పాటు పూర్తి చేసిన దరఖాస్తులను మే 25, 2026లోగా హైదరాబాద్‌లోని డైరెక్టర్, మహిళాభివృద్ధి&శిశు సంక్షేమ శాఖ #83222, మధురానగర్, సారథి స్టూడియో సమీపంలో, యూసఫ్ గూడ, అమీర్‌పేట్, హైదరాబాద్ - 500038 కార్యాలయానికి పంపించాలని సూచించారు. మరిన్ని వివరాలకు గద్వాల పాత కలెక్టరేట్‌లోని బాలరక్షా భవన్‌ను సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.

# సిద్దిపేటలో సంచలనం సృష్టించిన డాక్టర్ ఇంటి దోపిడీ కేసు ఛేదన

- 9 మంది నిందితుల అరెస్ట్
- రూ.20 లక్షల విలువైన ఆస్తి రికవరీ
- మీడియాకు వివరాలు వెల్లడించిన పోలీస్ కమిషనర్ ఎస్.రష్మీ పెరుమాళ్ (ఐపీఎస్ )

**వుదయం, సిద్దిపేట (ఏప్రిల్ 09):**

సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బురుగుపల్లి చెర్విత మెడోస్ లో ఈ నెల 4వ తేదీన జరిగిన డాక్టర్ ఇంటి దోపిడీ కేసును సిద్దిపేట పోలీసులు కేవలం 72 గంటల్లో ఛేదించారు. ఈ కేసులో 9 మంది నిందితులను అరెస్ట్ చేసి, సుమారు రూ.20 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్, ఐపీఎస్ తెలిపారు. ఈ మేరకు సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఏప్రిల్ 4 రాత్రి 8 గంటల సమయంలో గుర్తు తెలియని దుండగులు డాక్టర్ ఇంట్లోకి చొరబడి, ఇంట్లో ఉన్న మహిళలు, పిల్లలను కత్తులతో బెదిరించి తాళ్లతో కట్టివేసి నగదు, బంగారు ఆభరణాలు దోచుకుని పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసు ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ సీఐ ఎం. శ్రీను నేతృత్వంలో బృందాలు నిరంతరం 72 గంటలు శ్రమించి కేసును ఛేదించాయి. ఈ దోపిడీకి మాస్టర్ మైండ్‌గా బెల్లంపల్లికి చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి నరేంద్రుల శ్రీకాంత్ అలియాస్ క్రాంతిని గుర్తించగా, మొత్తం 9 మందిని అరెస్ట్ చేయగా వీరిలో కొందరు పాత నేరస్థులు కాగా వారి నుండి రికవరీ చేసిన



సొత్తు 4.3 తులాల బంగారు ఆభరణాలు, యమహా R15 బైక్, మారుతి డిజైర్ కారు (TG 09 T 5140)తో పాటు 10 మొబైల్ ఫోన్లు రూ. 50,000 నగదు స్వాధీనం పరుచుకున్నట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన ఏసీపీ ఎం. రవీందర్ రెడ్డి, సీఐ ఎం. శ్రీను, సీసీఎస్ బృందం, ఎస్సైలు, ఫింగర్ ప్రింట్ టీమ్ మరియు ఐటీ సెల్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ ఇళ్ల వద్ద, కాలనీల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని పోలీస్ కమిషనర్ సూచించారు.



## కార్మికుల ఏపీఎస్ఈబి రూల్స్
# సాధించేవరకుఉద్యమం ఆగదు

**నారాయణపేట ,ఏప్రిల్ 9 (వుదయం ప్రతినిధి):**

తెలంగాణలో విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులకు శాశ్వత ఉద్యోగులతో సమానంగా ఏపీఎ స్.ఈబి. రూల్స్ వర్తించేవ రకు ఉద్యమం విరమించేది లేదని 1104 యూనియన్ నారాయణపేట సర్కిల్ ప్రచార కార్యదర్శి జె.వెంక టేష్ , లక్ష్మీకాంత్ గురువారం రెండవ రోజు సమ్మెలో పాల్గొని స్పష్టం చేశారు .గత ముప్పై ఏళ్ల నుండి విద్యుత్ శాఖ ను నమ్ముకొని విధులు నిర్వహిస్తుంటే ప్రభుత్వం వారి పట్ల నిర్లక్ష్య ధోరణి వ్యవహరించడం పట్ల కార్మికులు తీవ్ర ఆవేదనకు లోనవుతున్నారు. శాశ్వత ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న ఆర్టిజ న్ కార్మికులకు జీవితంలో వ్యత్యాసం వహించడం ప్రభుత్వం వారి పట్ల తీరని అన్యాయం చేస్తుందిని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం ఆర్టిజన్ కార్మికు లకు ప్రత్యేక జీ.వో ను తీసుకు వచ్చి , ఒకే సంస్థలో రెండు జీవోలు అమల వుతున్నది కేవలం ఈ విద్యుత్ శాఖలో మాత్రమేనని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానం వల్ల కార్మికులకు గొడ్డలిపెట్టు గా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ ని నమ్ముకుని చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్నప్పటికీ తమ విధుల పట్ల యాజమాన్యం సరైన నిర్ణయం తీసుకోటంలో తాత్సారం చేస్తున్నరని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సర్వీసులో వారికి దక్కాల్సిన హక్కులు కోల్పోతున్నారు. చాలా మంది ఆర్టిజన్స్ కార్మికులు పదవి విరమణ కు దగ్గర గా ఉన్నారు. ఈ కార్మికులు పదవి విరమణ అయిన తరువాత ఖాళి చేతులతో ఇంటికి వెళ్లాల్సిన దుస్థితి ఉందన్నారు. ఆర్టిజన్ కార్మికులంతా టివిఏఈ జే.ఏ.సి.గా రాష్ట్ర నాయక త్వం ఏర్పడి ట్రేడ్ యూని యన్ ల మద్దత్తు కోరారు. ఈ ధర్నాకు 1104 యూనియ న్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయి బాబా మద్దత్తు తెలిపారన్నారు. ఆర్టిజన్ కార్మికుల్లో కొత్త ఉత్సాహం కనపడుతోందనీ,కార్మికులకు ఏపీఎస్ఈబి రూల్స్, విద్యా అర్హతను బట్టి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆందోళన ఉధృతంలో భాగంగా నిర్వహించే వంటా వార్పు కార్యక్రమంలో పెద్ద ఎత్తున తరలి రావాలని 1104 యూనియన్ సర్కిల్ ప్రధాన కార్యదర్శి జే.వెంకటేష్ కోరారు.రెండో రోజు సమ్మెలోనారాయణపేట సర్కిల్ అధ్యక్షుడు గోవింద్ రాజ్,వర్కింగ్ ప్రెసిడెంట్ నూనె రఘు,327 మహమ్మద్,కే.ఎల్ శ్రీనివాస్,ఎస్ సి ఎస్టీ వెంకటన్న, గోవింద్,దేవన్న,టివి జె ఏ సి చైర్మెన్ నర్సింలు,జిల్లా కన్వీనర్ దిల్ దార్,రమేష్,బాలరాజు, లక్ష్మి కాంత్,వినోద్ కుమార్,రాములు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాల సమస్యలపై
# అధికారులతో సమీక్ష

- ప్రతి గ్రామానికి నీటి సమస్య రాకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలి,,
- విద్యుత్ అద చేస్తూ ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించాలి.
- ఎమ్మెల్యే డాక్టర్ పి సంజీవరెడ్డి

**నారాయణఖేడ్ ఏప్రిల్ 09(వుదయం)**

విద్యుత్, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు గ్రామాలలో నీటి సమస్య, విద్యుత్ సమస్యలు ఉండకుండా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. నారాయణఖేడ్ మండల పరిధిలోని విద్యుత్ మరియు గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కారించాలని అధికారులకు సూచించారు. ఎండాకాలంలో నీటి ఎద్దడి లేకుండా అధికారులు చూడాలన్నారు. ఎండాకాలం దృశ్య మండలంలోని ఏ ఒక్క గ్రామంలో కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. గ్రామాలలో పైపులైన్లు లీకేజీలను అరికట్టాలని అవసరమైన చోటా కొత్త బోర్లు లేదా ట్యాక్స్ కార్ల ద్వారా నీటి సరఫరా చేయాలని సూచించారు. గ్రామాలలో విద్యుత్ కోతలు లేకుండా చూసి వ్యవసాయానికి గృహ అవసరాలకు నాణ్యమైన విద్యుత్ అందించే విధంగా విద్యుత్ శాఖ అధికారులు కృషి చేయాలన్నారు. ఎక్కడ ఏ ప్రమాదం జరగకుండా ఎక్కడ ట్రాన్స్ఫార్మర్స్ అవసరం ఉన్న వెంటనే ఆ విద్యుత్ సమస్యను పరిష్కరించాలన్నారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి సకాలంలో పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ లక్ష్యం ప్రజలకు మెరుగైన సేవలు అందించడమేనని ఇందులో నిర్లక్ష్యం వహించవద్దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, ఆర్డబ్ల్యూఎస్ శాఖ అధికారులు, అధికారులు అనాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ ప్రాంతా రైతుల భూ సమస్యలను పరిష్కరించే దిశగా కృషి



## తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి

**నాగర్ కర్నూల్, ఏప్రిల్ 09 (వుదయం ప్రతినిధి):**

నల్లమల్ల ఏజెన్సీ ప్రాంతాల రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రైతు కమిషన్ కృషి చేయనున్నట్లు రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని అమ్రాబాద్ మండల కేంద్రంలో రాష్ట్ర తెలంగాణ వ్యవసాయ & రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ వంశీకృష్ణ, రైతు కమిషన్ సభ్యులు మర్రికంటి భవానీ రెడ్డి, కెవిఎన్ రెడ్డి, రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి, రాములు నాయక్, భూమి సునీల్ కుమార్ హాజరయ్యా రైతు సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి మాట్లాడుతూ...., ఏజెన్సీ ప్రాంతాల్లో భూమి హక్కుల గుర్తింపు, పత్రాల సమస్యలు, భూ వివాదాలు వంటి అంశాలు రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని ఏసీ గదుల్లో కూర్చుని సమస్యను పరిష్కరించలేమని కమిషన్ భావించిందని అందుకే నేరుగా రైతులతో మాట్లాడి సమస్యను తెలుసుకొని రాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చించి అందుకు అనుగుణంగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఉద్దేశంతోనే నేడు రైతు కమిషన్ సభ్యులతో కలిసి క్షేత్రస్థాయి పర్యటనలకు వచ్చినట్లు ఆయన తెలిపారు. రైతులు కమిషన్ దృష్టికి తీసుకువచ్చిన ఈ సమస్యలను సమగ్రంగా పరిశీలించి, రైతులకు న్యాయం జరిగేలా చర్యలు చేపడుతున్నామని ప్రత్యేకంగా గిరిజన రైతుల భూ హక్కులను రక్షించడం, ప్రభుత్వ విధానాలను సమర్థవంతంగా అమలు చేయడం రైతు కమిషన్ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ, సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని, రైతుల సంక్షేమం కోసం కమిషన్ కట్టుబడి పని చేస్తుందని, భూ సమస్యల పరిష్కారానికి అవసరమైన సూచనలు, సిఫారసులు ప్రభుత్వానికి అందజేస్తామని కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాల వల్ల నేడు రైతులు ఇబ్బందులకు గురి అవుతున్నారని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని రైతులకు న్యాయం జరిగే విధంగా ఈ ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. నల్లమల్ల ఏజెన్సీ ప్రాంత సన్న చిన్న కారు రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చట్టాలను సవరించి అటవీ శాఖ భూములను పరిరక్షించుకుంటూ నే రైతులకు మేలు చేసేలా చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతోనే కమిషన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుందని ఈ సందర్భంగా రాష్ట్ర కమిషన్ చైర్మన్ వెల్లడించారు. నల్లమల్ల ఏజెన్సీ ప్రాంత రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ గుర్తించిందని రైతుల భూ సమస్యలను పరిష్కరించే దిశగా రాష్ట్ర తెలంగాణ వ్యవసాయ రైతు కమిషన్ కృషి చేస్తుందని రాష్ట్ర రైతు వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ...., ఏజెన్సీ ప్రాంత భూ సమస్యల పరిష్కారానికి రైతు సంక్షేమ కమిషన్ ఆధ్వర్యంలో నేడు నిర్వహించిన రైతు సదస్సులో ఏజెన్సీ ప్రాంత రైతులు రాష్ట్ర రైతు కమిషన్ దృష్టికి తీసుకువచ్చిన భూ సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుని రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా సాంకేతిక కారణాల వల్ల రైతులకు మార్టిగేజ్, ఎల్టీ లోన్లు అందడం లేదని రైతులు పేర్కొనగా, ఆ సమస్య పరిష్కారానికి ప్రత్యేక కార్యక్రమంతో (స్పెషల్ డ్రైవ్ ) నిర్వహించి సక్సెషన్ ప్రక్రియలను పూర్తి చేసి, నేరుగా బ్యాంకులతో సమన్వయం చేసి రైతులకు రుణాలు అందేలా చర్యలు తీసుకుంటామని, ఇప్పలపల్లి గ్రామ పరిధిలో ఉన్న 200 ఎకరాల భూమిపై రెవెన్యూ మరియు అటవీ శాఖ అధికారులతో జాయింట్ సర్వే నిర్వహించి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బక్క లింగాయపల్లి గ్రామ పరిధిలో భూమి సర్వే పూర్తయ్యిందని, ఆ భూమి రెవెన్యూ శాఖ పరిధిలోకి వస్తుందని తెలిపారు. సంబంధిత రైతులకు న్యాయం చేసేలా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపించామని, ప్రభుత్వ ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని ఈ సమస్య మొదటిసారి తమ దృష్టికి వచ్చిందని కలెక్టర్ తెలిపారు. అలాగే బుధవారం హైదరాబాద్‌లో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను పరిగణనలోకి తీసుకుని, క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యే అధ్యక్షతన సమావేశం నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడతామని నల్లమల్ల అటవీ ప్రాంతంలో ఇదివరకే గుర్తించిన ప్రదేశాల్లో టూరిజం ప్రాంతాలను అభివృద్ధిపరిచి ఈ ప్రాంత అభివృద్ధికి ప్రజల ఆర్థిక అభివృద్ధికి జిల్లా సంఘం కృషిచేస్తుందని కలెక్టర్ ఈ సందర్భంగా రైతు కమిషన్ చైర్మన్ కు వివరించారు. ఈ సందర్భంగా రైతు కమిషన్ అచ్చంపేట నియోజకవర్గంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న భూ సమస్యలపై సమగ్ర అవగాహన పొందేందుకు రైతులతో నేరుగా సంప్రదింపుల సమావేశం నిర్వహించారు. ఏజెన్సీ ప్రాంత రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, పత్రాల సమస్యలు, సాగుభూముల హక్కులపై తమ అభిప్రాయాలను, సమస్యలను కమిషన్ దృష్టికి వివరంగా తెలియజేశారు. అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ, అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని అమ్రాబాద్, పదర మండలాల్లో ఉన్న నల్లమల్ల ఏజెన్సీ ప్రాంత ప్రజల భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ మరియు సభ్యులకు ఈ విషయంపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గతంలో ఈ ప్రాంత రైతులకు మార్టిగేజ్ మరియు ఎల్.టి. లోన్లు లభించేవని, కానీ ప్రస్తుతం భూ సమస్యల కారణంగా బ్యాంకుల నుండి ఎలాంటి రుణాలు అందడం లేదని, ఈ ప్రాంత రైతుల సమస్యలను పరిష్కరించాలని సంకల్పంతోనే నేడు రైతుల వద్దకే రైతు కమిషన్ చైర్మన్ తన సభ్యులతో కలిసి రావడం సంతోషించదగ్గ విషయమని ఆయన కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. ఇక్కడ ఉన్న రైతుల సమస్యలను ఆలకించి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చించి శాశ్వత పరిష్కారం తీసుకునేలా కమిషన్ కృషి చేయాలని, గత ప్రభుత్వం కొంతమంది గిరిజనులకు భూములేనప్పటికీ పట్టాలు ఇచ్చారని, కొంతమంది రైతులు 1932 నుండి భూమిని సాగు చేస్తున్నప్పటికీ వారిపై పట్టాలు లేవని అలాంటి వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వత పరిష్కారం తీసుకునే దిశగా అధికారులు కమిషన్ చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నల్లమల్ల ప్రాంత రైతుల భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు "భూ దార్" వంటి కార్యక్రమాలను తీసుకువచ్చారని ఆయన పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పోడు భూముల సమస్యలను పరిష్కరించే దిశగా, అటవీ ప్రాంతాన్ని సంరక్షిస్తూ రైతులకు న్యాయం జరిగేలా ఆయిల్ పామ్ సాగుకు అవకాశం కల్పించాలని, అటవీ ప్రాంతంలో వన్య ప్రాణుల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, అలాగే నల్లమల్ల అటవీ ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పంతో పనిచేస్తోందని తెలిపారు. ఈ క్రమంలో నల్లమల్లలో 24 టూరిజం ప్రాంతాలను గుర్తించినట్లు, నల్లమల్ల ప్రాంత ప్రజలు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా తాను కృషి చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ అమరేందర్, అచ్చంపేట ఆర్డిఓ యాదగిరి, అమ్రాబాద్ సర్పంచ్ బిగుర్ల కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.



# మురుగు సమస్యకు మోక్షం

- వినాయక గుడి నుండి ఎల్లమ్మ గుడి వరకు మురుగు కాలువ నిర్మాణం
- స్థానిక నాయకులు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పూజలు

**సిద్దిపేట/జగదేవపూర్, ఏప్రిల్ 9 (వుదయం ప్రతినిధి)**

సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండల కేంద్రంలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయి. గ్రామస్తుల చిరకాల కోరికైన మురుగునీటి సమస్యను పరిష్కరించే దిశగా అడుగులు పడ్డాయి. గురువారం స్థానిక నాయకులు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామంలోని వినాయకుని గుడి నుండి ఎల్లమ్మ గుడి వరకు నూతన డ్రైనేజీ నిర్మాణ పనులను శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. నిర్మాణ పనుల్లో ఎక్కడా రాజీ పడకుండా, నాణ్యతతో కూడిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను కోరారు. ఈ డ్రైనేజీ నిర్మాణంతో వీధుల్లో మురుగునీరు నిలవకుండా, ముఖ్యంగా వర్షాకాలంలో ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ఈ అభివృద్ధి పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గణేష్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు బుద్ధ నాగరాజు, ఈవో రామ్ రెడ్డి, బత్తిని శ్రీనివాస్, ఇస్మాయిల్, భాస్కర్, దండే వెంకట్, బాబు, అనిత శేఖర్, బాల నరసయ్య, విష్ణు ప్రియ మల్లేశం, మంజుల బాల్ నర్సయ్య, మౌనిక నరసింహులు, సంధ్య సాయి, శ్రీలత చంద్రం, ఆంజనేయులు, శ్రీనివాస్ రెడ్డి, వంశీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో విద్యుత్ కార్మికులకు 'చీకటి' రోజులు



- అబద్ధాల పునాదులపై రేవంత్ సర్కార్.. వంటేరు ప్రతాప్ రెడ్డి ధ్వజం
- గజ్వేల్‌లో విద్యుత్ ఆర్టిజన్ల సమ్మెకు బిఆర్ఎస్ సంపూర్ణ మద్దతు

**గజ్వేల్, ఏప్రిల్ 9 (వుదయం ప్రతినిధి)**

ఎన్నికల ముందు వెలుగులు నింపుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక విద్యుత్ కార్మికుల జీవితాల్లో చీకట్లు నింపుతోందని గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఆర్టిజన్స్ ఎంప్లాయిస్ జేఏసీ పిలుపుమేరకు గజ్వేల్ డివిజన్ కార్యాలయం ముందు నిరావధిక సమ్మె చేస్తున్న కార్మికులకు ఆయన మద్దతు ప్రకటించారు. హామీలు గాలికి.. కార్మికులు రోడ్డుపైకి! ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి తన పాదయాత్రలో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని మండిపడ్డారు. విద్యా అర్హతను బట్టి ఆర్టిజన్ కార్మికులను వెంటనే కన్వర్షన్ చేయాలని, అన్‌మాండ్ కార్మికులందరినీ ఆర్టిజన్లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 20 వేల మంది కార్మికులు రోడ్లపై ధర్నాలు చేస్తుంటే ప్రభుత్వానికి చలనం లేకపోవడం సిగ్గుచేటన్నారు. మంటల్లో రైతాంగం.. ఎండిపోతున్న పంటలు విద్యుత్ కార్మికుల సమ్మె కారణంగా క్షేత్రస్థాయిలో విద్యుత్ సరఫరాకు తీవ్ర విఘాతం కలుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సరియైన సమయానికి కరెంటు అందక, సబ్ స్టేషన్లలో సమస్యలు పరిష్కారం కాక పొట్టకు వచ్చిన రైతుల వరి పంటలు ఎండిపోతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ మొండివైఖరి వల్ల అటు కార్మికులు, ఇటు రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే మోసమని వంటేరు ఎద్దేవా చేశారు. ఏటా 2 లక్షల ఉద్యోగాలన్నారు.. కానీ ఒక్కటి కూడా ఇవ్వలేదు. పీఆర్సీ ఇవ్వకుండా ఉద్యోగుల హక్కులను కాలరాస్తున్న ఏకైక ప్రభుత్వం ఇదేనని విమర్శించారు. వృద్ధులు, వికలాంగులు, విద్యార్థులను కూడా రేవంత్ సర్కార్ వంచించిందని ఆరోపించారు. గత కేసీఆర్ ప్రభుత్వం విద్యుత్ ఆస్తులను పెంచితే, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమ్ముకుంటోందని దుయ్యబట్టారు. వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే రోడ్లను దిగ్బంధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ చైర్పర్సన్ గంగిశెట్టి చందనా రవీందర్, కౌన్సిలర్లు బొగ్గుల స్వప్న సురేష్, మామిడి శ్రీధర్, ఉమ్మడి మెదక్ జిల్లా జేఏసీ కన్వీనర్ షాదుల్ పాషా, వైస్ చైర్మన్ రామగౌనీ రవికుమార్, డివిజన్ నేతలు సిరినేని భూపతి రాజు, శ్రీధర్, యాదగిరి గౌడ్, ఖలీల్ భాషా మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణా అరికట్టేందుకు సమన్వయ చర్యలు

- ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరి,
- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్ కర్నూల్, ఏప్రిల్ 09 (వుదయం ప్రతినిధి)**




జిల్లాలో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఇసుక తవ్వకాల అనుమతులు జరగాలని, ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్,అధికారులను ఆదేశించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, అదనపు కలెక్టర్ అమరేందర్, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు తదితర అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ-------.. జిల్లాలోని అన్ని ఇసుక రీచ్‌ల వద్ద అదనంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇసుక తవ్వకాల అనుమతులు, రవాణా, ప్రభుత్వ ఆదాయం పెంపు, అక్రమ తవ్వకాల నియంత్రణపై సమగ్రంగా చర్చించి కఠిన ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ఇసుక బుకింగ్ పూర్తిగా ఆన్లైన్ విధానంలో "మన ఇసుక వాహనం" యాప్ ద్వారానే జరగాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆఫ్‌లైన్ బుకింగ్ అనుమతించబడదని స్పష్టం చేశారు. జిల్లాలోని పలు మండలాల్లో పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలపై వచ్చిన దరఖాస్తులను పర్యావరణ అనుమతుల ఆధారంగా పరిశీలించి, తెలంగాణ మినరల్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా మాత్రమే ఇసుక రవాణా జరిగేలా అనుమతులు ఇవ్వాలని సూచించారు. అలాగే ఇసుక తరలింపుకు దరఖాస్తు చేసిన వాహనాల ద్వారానే రవాణా జరగాలని, వాహన రిజిస్ట్రేషన్ నెంబర్, డ్రైవర్ లైసెన్స్ తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి అనుమతులు ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. గ్రామాల్లో ఎక్కడైనా సమస్యలు లేదా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడితే తప్పనిసరిగా పోలీసుల సహాయం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఇటీవలే కలెక్టర్ ఇసుక రీచ్ ల వద్ద పరిశీలించిన సందర్భంలో అక్కడ గుర్తించిన పలు అంశాలను కలెక్టర్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అలాంటి వాటిని వెంటనే పరిష్కరించి ఇసుక సజావుగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ-------.. జిల్లాలో అక్రమ ఇసుక రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పోలీస్, రెవెన్యూ, మైనింగ్ శాఖల మధ్య సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఆఫ్‌లైన్ విధానంలో ఇసుక తరలింపులు కొనసాగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అమరేందర్ జిల్లా మైనింగ్ అధికారి వెంకటరమణ, జిల్లా నీటిపారుదల శాఖ అధికారి మురళి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, భూగర్భ జల శాఖ అధికారిని దివ్య జ్యోతి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఒరాకిల్ ఊచకోత మరువకముందే అమెజాన్‌లో భారీగా లేఆఫ్‌లు!

ప్రముఖ ఐటీ దిగ్గజం ఒరాకిల్‌లో ప్రపంచ వ్యాప్తంగా 30 వేల మంది ఉద్యోగులపై వేటు వేసిన ఘటన మరువక ముందే ప్రముఖ ఈ కామర్స్ సంస్థ అమెజాన్‌ఉద్యోగులపై పెద్ద ఎత్తున్న వేటు వేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఏకంగా 14 వేల మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఆసియా బిజినెస్ అవుట్ లుక్ ప్రకారం వచ్చే నెలలో ఈ లేఆఫ్‌లు ఉండబోతున్నాయి. అమెజన్ వెబ్ సర్వీసెస్, రిల్, హెచ్‌ఆర్ విభాగాల్లోని ఉద్యోగులపై వేటు పడబోతుందని తెలుస్తోంది. అయితే ఈ లేఆఫ్‌ల పై అమెజాన్ నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

కాగా 2025లో 14 వేల మందిని, ఈ 2026 ప్రారంభంలోనే మరో 16 వేల మందిని అమెజాన్ తొలగించింది. ఓ వైపు మైక్రోసాఫ్ట్, టీసీఎల్, యాక్సెంచర్, ఒరాకిల్ వంటి దిగ్గజ సంస్థలు వరుసగా ఉద్యోగులను తొలగిస్తుండగా అదే బాటలో అమెజాన్ సైతం వెళ్తుండటంతో తమ బతుకులు ఎప్పుడు రోడ్డున పడతాయో అనే ఆందోళన ప్రపంచ వ్యాప్తంగా ఆయా సంస్థలలోని ఉద్యోగుల్లో వ్యక్తం అవుతోంది.




# బంగారం, వెండి ధరల్లో ఎందుకీ ఊగిసలాట



నిన్న భారీగా పెరిగిన బంగారం, వెండి ధరలు.. నేడు ఆల్ మోస్ట్ అంతేరీతిలో తగ్గాయి. గురువారం 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.2340 తగ్గి రూ.1,51,480కి పడిపోయింది.22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.2,150 తగ్గి రూ.1,38,850 వద్ద కొనసాగుతోంది. మరోవైపు కిలో వెండి ధర రూ.5000 తగ్గి రూ.2,60,000 వద్ద స్థిరపడింది. లైవ్ ట్రేడింగ్ ను బట్టి ఈ ధరల్లో మార్పులుండవచ్చు. పెళ్లిళ్లు, శుభ కార్యాలకు ముహూర్తాలు ఇబ్బడిముబ్బడిగా ఉన్న సమయంలో బంగారం, వెండి ధరలు ఇలా పెరుగుతూ, తగ్గుతూ ఊగిసలాడుతుండటంతో ఎప్పుడు కొనాలో, ఎప్పుడు ఆగాలో తెలియక కొనుగోలుదారులు అయోమయానికి గురవుతున్నారు. దీనికి కారణం ఏంటి? నిన్న 24 క్యారెట్ల బంగారం, 22 క్యారెట్ల బంగారం ధరల ఏకంగా మూడున్నర వేల రూపాయలకు పైగా పెరిగింది. ధరలు పెరగడంతో ఇన్వెస్టర్లు ప్రాఫిట్స్ తీసుకున్నారు. దీంతో నేడు బంగారం ధర తగ్గిందని నిపుణులు చెప్తున్నారు. బంగారంపై పెట్టుబడులు పెరిగితే ధర పెరుగుతుందని, లాభాలు తీసుకుంటే ధర తగ్గుతుందని చెప్తున్నారు. అంతేకాదు.. డాలర్ బలపడినా, బలహీన పడినా బంగారం, వెండి ధరల్లో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకుంటాయి. మరోవైపు ట్రంప్.. ఇరాన్ పై యుద్ధం విషయంలో రోజుకో నిర్ణయం తీసుకుంటున్నారు. సీజ్ ఫైర్ ను మరో రెండువారాలకు పెంచిన ట్రంప్.. ఈ రోజు మళ్లీ మాస్ వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్ ఒక్క తప్పు చేసినా మళ్లీ యుద్ధం మొదలవుతుందని హెచ్చరించారు. ట్రంప్ చేసే వ్యాఖ్యలతో ఇన్వెస్టర్లలో గందరగోళం నెలకొంది. నష్టాలు ఎక్కడ ముంచేస్తాయోనన్న ఆందోళన వారిని ప్రాఫిట్స్ వైపు మళ్లిస్తోంది. ప్రస్తుతానికైతే పశ్చిమాసియా యుద్ధంపైనే బంగారం, వెండి ధరలు ఆధారపడి ఉన్నాయి.

# ఎన్‌బీఎఫ్‌సీలకు కొత్త మార్గదర్శకాలు



బ్యాంకింగ్, బ్యాంకింగేతర రంగాల్లో వ్యాపార నిర్వహణను మరింత సులభతరం చేసే దిశగా ఆర్‌బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. టాటా సన్స్ లిస్టింగ్ అంశంపై ఇంకా స్పష్టత లేని నేపథ్యంలో, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల (ఎన్‌బీఎఫ్‌సీ) కోసం కొత్త ముసాయిదా తీసుకురానున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించారు. కొత్త ముసాయిదా నిబంధనల ప్రకారం ఎన్‌బీఎఫ్‌సీలను వివిధ రకాలుగా వర్గీకరిస్తామన్నారు. ఉప్పు నుంచి సాఫ్ట్‌వేర్ వరకు విస్తరించిన టాటా గ్రూప్ ప్రధాన సంస్థ టాటా సన్స్, ప్రైవేట్‌గానే కొనసాగుతుందా లేదా పబ్లిక్ ఇష్యూకు (లిస్టింగ్) వెళుతుందా అనే అంశంపై స్పష్టమైన వివరాలు వెల్లడించేందుకు ఆర్‌బీఐ గవర్నర్ నిరాకరించారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం, అప్పర్ లేయర్ విభాగంలో ఉన్న 15 సంస్థల్లో ఒకన టాటా సన్స్, గతేడాది సెప్టెంబరు 30 నాటికే స్టాక్ మార్కెట్లో నమోదు కావాల్సి ఉంది. ఈ విభాగంలోని మిగిలిన సంస్థలన్నీ ఇప్పటికే ఈ నిబంధనను పాటించాయి. లైసెన్స్ రద్దయ్యే వరకు టాటా సన్స్, తన వ్యాపారాన్ని కొనసాగించొచ్చని ఆర్‌బీఐ గవర్నర్ గతంలో పేర్కొన్నారు. గడువు ముగిసి 6 నెలలు దాటినా, ఈ అంశంపై వ్యాఖ్యానించేందుకు బుధవారం నిరాకరించారు. ఫినో పేమెంట్స్ బ్యాంక్ సీఈఓ రిషీ గుప్తా అరెస్టుపై గానీ, స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌గా మారాలనే ఆ బ్యాంక్ లక్ష్యంపై ఈ అరెస్టు ప్రభావం గురించీ మల్హోత్రా స్పందించలేదు.బ్యాంకుల బోర్డు సమయాన్ని మరింత సమర్థంగా వినియోగించుకునేందుకు, వ్యూహాలు, నష్టభయం నిర్వహణపై మరింత దృష్టి సారించేలా మార్గదర్శకాలు సవరించనున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. వీటికి సంబంధించిన ముసాయిదాను త్వరలో విడుదల చేస్తామని వెల్లడించింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తాత్కాలిక చైర్మన్ అతాను చక్రవర్తి 'బ్యాంక్ పనితీరులో నైతిక కారణాలను ప్రస్తావిస్తూ' మార్చి 17న తన పదవికి హఠాత్తుగా రాజీనామా చేసిన నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. వ్యాపార నిర్వహణను సులభతరం చేయడంలో భాగంగా.. దాదాపు 9,000 పాత నియంత్రణ నిబంధనలను కుదించి, 238 మాస్టర్ డైరెక్షన్లుగా క్రోడీకరించే ప్రక్రియను పూర్తి చేసినట్లు ఆర్‌బీఐ గవర్నర్ తెలిపారు. పర్యవేక్షణ సూచనలకు సంబంధించి 9 విభాగాలకు చెందిన 64 మాస్టర్ డైరెక్షన్స్ ముసాయిదాలను ప్రజల అభిప్రాయాల కోసం ఆర్‌బీఐ వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు.



# అదానీ వినతిపై విచారణకు అమెరికా కోర్టు అనుమతి

అదానీ గ్రూపు ఛైర్మన్ గౌతమ్ అదానీకి అమెరికా కోర్టులో ఊరట లభించింది. 'అమెరికా మదుపుదార్లను మోసగించామంటూ, అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ కమిషన్ (ఎస్‌ఈసీ) మాపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ' గౌతమ్ అదానీ, ఆయన బంధువు సాగర్ అదానీ పెట్టుకున్న వినతి దరఖాస్తుపై, విచారణకు అమెరికా కోర్టు న్యాయమూర్తి అనుమతి ఇచ్చారు. ఎస్‌ఈసీ నమోదు చేసిన కేసు అమెరికా న్యాయ పరిధిలోకి రాదని, పలు అంశాల్లో ఆధారాలు చూపించడంలోనూ విఫలమైందని అదానీ తరపు న్యాయవాదులు తెలిపారు. 'ఫిర్యాదు కొట్టివేయాలని అభ్యర్థిస్తూ, ప్రతివాదులు పంపిన లేఖ కోర్టుకు అందింది. వీరి వినతిని పరిగణనలోకి తీసుకుని విచారణకు హాజరుకావాలని ఇరు పక్షాలను ఆదేశించినట్లు' ఈస్ట్రన్ డిస్ట్రిక్ట్ కోర్ట్ ఆఫ్ న్యూయార్క్ తన ఆదేశాల్లో తెలిపింది. 'భారత్‌లో కాంట్రాక్టులు పొందేందుకు అదానీ గ్రూప్ లంచం ఇచ్చేందుకు, అమెరికా మదుపర్ల సొమ్మును వినియోగించారనే' ఆరోపణలను సమర్థించే విశ్వసనీయ ఆధారాలను చూపించడంలో ఎస్‌ఈసీ విఫలమైందని అదానీ తరపు న్యాయవాదులు తెలిపారు. సౌర ఇంధన కాంట్రాక్టులను పొందేందుకు భారత్‌లో కొందరు పెద్దలకు 250 మిలియన్ డాలర్లను లంచం రూపంలో అదానీ చెల్లించారనే ఆరోపణలపై 2024 నవంబరులో ఎస్‌ఈసీ ఈ కేసును నమోదు చేసింది. సౌర ప్రాజెక్టుల కోసం నిధుల సకరణ సమయంలో ఈ విషయాన్ని అమెరికా పెట్టుబడిదార్లకు, బ్యాంకులకు అదానీ గ్రూప్ వెల్లడించలేదనీ ఆరోపించింది. ఈ ఆరోపణలన్నింటినీ అదానీ గ్రూపు ఖండించింది.

# బిట్‌కాయిన్ సృష్టికర్త అతడేనా..? ఎందుకీ అజ్ఞాతవాసం..!


క్రిప్టో కరెన్సీ బిట్‌కాయిన్ సృష్టికర్త సటోషీ నకమోటో) ఎవరో తెలుసుకోవడానికి కొన్నేళ్లుగా టెక్ ప్రపంచం అన్వేషిస్తూనే ఉంది. ఆ కరెన్సీ క్రియేటర్ ఇతడే అంటూ న్యూయార్క్ టైమ్స్ కథనం ఓ పేరు వెల్లడించడం ఆసక్తికరంగా మారింది. బ్రిటిష్ క్రిప్టాలజిస్ట్ అయిన ఆడమ్ బ్యాక్ అని పేర్కొంది. కొన్ని నెలల పాటు జరిపిన దర్యాప్తులో ఈ విషయాన్ని గుర్తించినట్లు, ఈ వాదనకు సరిపోయే ఆధారాలున్నాయని ఆ కథనం వెల్లడిస్తోంది.క్రిప్టో కమ్యూనిటీలో ఆడమ్ బ్యాక్ (Adam Back) ఫేమస్. బిట్‌కాయిన్ సృష్టికి కారణమైన ఆలోచనగతంలో బ్యాక్ ఆన్‌లైన్‌లో వాడిన పదజాలం కూడా నకమోటో వాడిన భాషకు దగ్గరగా ఉందని అంతర్జాతీయ మీడియా కథనం తెలిపింది.మళ్లీ అసెట్.. షేర్లు.. బంగారం ఒకే చోట

# యుద్ధంతో భారత వృద్ధికి ముప్పు



పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపబోతున్నాయని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్‌బిఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపిజి) సమావేశం అనంతరం బుధవారం గవర్నర్ డియాతో మాట్లాడుతూ.. యుద్ధం వల్ల తలెత్తే పరిణామాలను ప్రస్తావించారు. అమెరికాఇరాన్ మధ్య ఘర్షణ వాతావరణం అంతర్జాతీయంగా అనిశ్చితిని పెంచిందన్నారు. ఇది భారత వృద్ధికి సవాలుగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గతంలో దేశీయ ఆర్థిక పునాదులు పటిష్టంగా ఉన్నప్పటికీ మార్చి నెలలో యుద్ధ తీవ్రత పెరగడంతో పరిస్థితులు ప్రతికూలంగా మారాయని ఆయన విశ్లేషించారు. ముడిచమురు ధరలు పెరగడం వల్ల దిగుమతి ద్రవ్యోల్బణం పెరగడమే కాకుండా, కరెంట్ అకౌంట్ లోటు (సిఎడి) మరింత విస్తరించే ప్రమాదం ఉందన్నారు. అధిక వ్యయాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రుణగ్రహీతలు వడ్డీ రేట్లు తగ్గుతాయని ఆశించిన వారికి ఆర్‌బిఐ నిర్ణయం నిరాశకు గురి చేసింది. 202627 ఆర్థిక సంవత్సరపు తొలి సక్షలో రెపో రేటును 5.25 శాతం వద్దే యధాతథంగా ఉంచుతూ నిర్ణయం తీసుకుంది. గతేడాది ఫిబ్రవరి ఫిబ్రవరి నుంచి దాదాపు 1.25 శాతం మేర రేట్లను తగ్గించిన ఆర్‌బిఐ ఈసారి మాత్రం ఎలాంటి మార్పులు చేయలేదు. ఈ నిర్ణయం వల్ల బ్యాంకుల వద్ద వడ్డీ రేట్లు స్థిరంగా ఉండటమే కాకుండా పారిశ్రామిక వృద్ధికి, సామాన్యుల ఇఎంఐలపై భారం పడకుండా దోహదపడుతుందని గవర్నర్ పేర్కొన్నారు. పశ్చిమాసియా యుద్ధం వల్ల సరఫరా వ్యవస్థలో తలెత్తే అడ్డంకులు దేశంలోని పరిశ్రమలు, వ్యవసాయం, సేవా రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని గవర్నర్ మల్హోత్రా వివరించారు. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధిలో రవాణా ఆటంకాల వల్ల ముడివస్తువుల లభ్యత తగ్గి, దేశీయ ఉత్పత్తి క్షీణించవచ్చని హెచ్చరించారు. ప్రపంచ ఆర్థిక వృద్ధి మందగిస్తే భారత ఎగుమతులు, రెమిటెన్స్‌ల ప్రవాహంపై ప్రభావం పడుతుందన్నారు. ఇది చివరకు దేశీయంగా అప్పుల భారాన్ని కూడా పెంచవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. ఉసరఫరా వ్యవస్థలో మొదలైన అడ్డంకులు పునరుద్ధరణలో ఆలస్యమైతే.. అది మధ్యకాలికంగా డిమాండ్ పడిపోవడానికి దారితీయవచ్చు'' అని మల్హోత్రా హెచ్చరించారు.

# ఏడేళ్ల తర్వాత భారత్‌కు ఇరాన్ ఆయిల్



భారత ఇంధన రంగంలో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా ఆంక్షల కారణంగా గత ఏడేళ్లుగా నిలిచిపోయిన ఇరాన్ ముడి చమురు దిగుమతులు మళ్ళీ ప్రారంభమయ్యాయి. రాయిటర్స్ నివేదిక ప్రకారం, ఇరాన్ చమురుపై అమెరికా తాత్కాలికంగా ఆంక్షలను సడలించడంతో, భారత్ తన మొదటి షిప్‌మెంట్‌ను స్వీకరించడానికి సిద్ధమైంది. దీనితో పాటు, పశ్చిమ ఆసియాలో యుద్ధ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, భారత్‌కు వస్తున్న చమురు నౌకలు క్షేమంగా హోర్ముజ్ జలసంధిని దాటడం గమనార్హం. ఇరాన్ చమురు రాకతో ఇంధన భద్రత ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, 'జయ' అనే భారీ నౌక ద్వారా ఈ ముడి చమురును దిగుమతి చేసుకుంటోంది. ఈ నౌక ఈ వారం చివర్లో భారత తూర్పు తీరానికి చేరుకునే అవకాశం ఉంది. 2019లో అమెరికా ఆంక్షల తర్వాత ఇరాన్ నుండి దిగుమతులు పూర్తిగా ఆగిపోయాయి. ఇప్పుడు మళ్ళీ ఇరాన్ ఆయిల్ రావడం వల్ల భారత్‌కు ఇంధన వనరుల వేటలో మరిన్ని ఆప్షన్లు దొరికినట్లయింది. ఇదే కాకుండా 'జోర్డాన్' అనే మరో నౌక కూడా భారత్ వైపు వస్తున్నట్లు సమాచారం. క్షేమంగా వస్తున్న ఎల్‌పీజీ నౌకలు పశ్చిమ ఆసియాలో ఇరాన్‌ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా సముద్ర మార్గాల్లో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఇలాంటి సమయంలో కూడా 60,000 మెట్రిక్ టన్నుల కంటే ఎక్కువ ఒఖఉని మోసుకెళ్తున్న రెండు భారతీయ నౌకలు 'గ్రీన్ సాంఘ్వీ', 'గ్రీన్ ఆశా' హోర్ముజ్ జలసంధిని క్షేమంగా దాటాయి. 15,000 మెట్రిక్ టన్నుల ఎల్‌పీజీతో ఏప్రిల్ 9 నాటికి భారత్‌కు చేరుకోనుంది. ఈ నౌకల్లో మొత్తం 51 మంది భారతీయ నావికులు ఉన్నారు. వీరి భద్రతను కేంద్ర నౌకాయాన మంత్రిత్వ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తోంది. రక్షణగా నిలుస్తున్న ఇండియన్ నేవీ సముద్ర మార్గాల్లో వాణిజ్య నౌకలకు ఎలాంటి ముప్పు కలగకుండా భారత నావికాదళ యుద్ధనౌకలు సిద్ధంగా ఉన్నాయి. గల్ఫ్ ప్రాంతంలో ప్రస్తుతం 16 భారతీయ నౌకలు ఉండగా, అందులో దాదాపు 433 మంది భారతీయ నావికులు పని చేస్తున్నారు. ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లోని ఓడరేవు కార్యకలాపాలు సాధారణంగానే సాగుతున్నాయని అధికారులు తెలిపారు.




# బోణీ కొట్టిన గుజరాత్



ఐపిఎల్ 2026 సీజన్లో గుజరాత్ బోణీ కొట్టింది. నేడు ఢిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన ఉత్కంఠ మ్యాచులో ఒక్క పరుగు తేడాతో గుజరాత్ విజయం సాధించింది.వర్షం కారణంగా మ్యాచ్ ఆలస్యంగా మొదలైనప్పటికీ.. టాస్ గెలిచిన ఢిల్లీ బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ కు దిగిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లకు 4 వికెట్లు కోల్పోయి 210 పరుగులు చేసింది. ఉ• కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (70), జోస్ బట్లర్ (52), వాషింగ్టన్ సుందర్ (55) హాఫ్ సెంచరీలు సాధించారు. వచ్చిన వాళ్ళు వచ్చినట్టు ఫోర్లు, సిక్సులు బాది ఢిల్లీ బౌలర్లకు చుక్కలు చూపించారు. ఇక 211 పరుగుల టార్గెట్ తో బరిలోకి దిగిన ఢిల్లీ.. చివరి వరకూ పోరాడి 8 వికెట్లు కోల్పోయి 209 పరుగులు చేసి, కేవలం పరుగులు చేయగా.. చివర్లో వచ్చిన డేవిడ్ మిల్లర్ (41) మెరుపులు మెరించినా లాభం లేకుండా పోయింది. చివరి బతి వరకు టెన్షన్ గా సాగిన ఈ మ్యాచులో గుజరాత్ విజయం సాధించి, ఈ సీజన్లో తొలి గెలుపు ఖాతా తెరిచింది.

# మిల్లర్ పై ఢిల్లీ ఫ్యాన్స్ ఫైర్



ఐపీఎల్ 2026లో భాగంగా గుజరాత్ టాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఎదుర్కొన్న ఓటమి ఇప్పుడు పెను వివాదానికి దారితీసింది. కేవలం ఒక్క పరుగు తేడాతో విజయం చేజారిపోవడం, అందులోనూ బ్యాటర్ డేవిడ్ మిల్లర్ తీసుకున్న నిర్ణయం ఢిల్లీ అభిమానులకు తీవ్ర ఆగ్రహాన్ని కలిగిస్తోంది. గెలవాల్సిన మ్యాచ్‌ను మిల్లర్ తన అతి తెలివితో లేదా తప్పుడు అంచనాతో చేజేతులా పాడుచేశాడని సోషల్ డియా వేదికగా ఫ్యాన్స్ మండిపడుతున్నారు. మ్యాచ్ ఉత్కంఠ దశకు చేరుకున్న వేళ, ఢిల్లీ విజయానికి చివరి రెండు బంతుల్లో కేవలం రెండు పరుగులు అవసరమయ్యాయి. 5వ బంతికి సింగిల్ తీసే అవకాశం ఉన్నప్పటికీ, మిల్లర్ దానిని తిరస్కరించాడు. చివరి బంతికి తనే ఫోర్ లేదా సిక్స్ కొట్టి మ్యాచ్ ముగించాలనే అతివిశ్వాసంతో అతను రన్ తీయలేదు. అయితే, చివరి బంతికి కనీసం ఒక పరుగు తీసి మ్యాచ్‌ను చేద్దామని ప్రయత్నించినప్పటికీ, మరో ఎండ్‌లో ఉన్న కుల్దీప్ యాదవ్ రనౌట్ అయ్యాడు. ఒకవేళ 5వ బంతికే సింగిల్ తీసి ఉంటే, మ్యాచ్ కనీసం సూపర్ ఓవర్ వరకు వెళ్లేదని, మిల్లర్ స్వార్థం వల్లే ఢిల్లీ ఓడిపోయిందని ఫ్యాన్స్ వాదిస్తున్నారు. అంతేకాదు ఈ ఓటమితో ఢిల్లీ క్యాపిటల్స్ ఐపీఎల్ చరిత్రలో ఒక విచిత్రమైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. అత్యధిక సార్లు కేవలం ఒక్క పరుగు తేడాతో మ్యాచ్‌లు ఓడిపోయిన జట్టుగా ఢిల్లీ నిలిచింది. 2015 లో చెన్నై తో జరిగిన మ్యాచ్‌లో, 2016 లో గుజరాత్ లయన్స్‌పై, 2021 లో ఖీఅః చేతిలో, ఈ సీజన్లో మళ్ళీ గుజరాత్ టాన్స్‌తో ఒక్క పరుగు తేడాతో ఓటమి పాలైంది. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టును 'దురదృష్టానికి కేరాఫ్ అడ్రస్' అని పిలుస్తున్న నెటిజన్లు, ముఖ్యంగా ఈ మ్యాచ్‌లో మిల్లర్ తీరును తప్పుబడుతున్నారు. ''ఒక సీనియర్ ప్లేయర్ అయి ఉండి, మ్యాచ్ పరిస్థితిని బట్టి సింగిల్ తీయకుండా జట్టును ఓడించడం క్షమించరాని నేరం'' అంటూ కామెంట్స్ చేస్తున్నారు.

# అప్పుడే గెలుస్తామనే నమ్మకం వచ్చింది అసలు విషయం చెప్పేసిన గిల్!



ఐపీఎల్ 2026లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన థ్రిల్లింగ్ మ్యాచ్‌లో గుజరాత్ టాన్స్ ఒక్క పరుగు తేడాతో గెలిచింది. ముందుగా బ్యాటింగ్ చేసిన గుజరాత్ 4 వికెట్లకు 210 పరుగులు చేయగా.. ఢిల్లీ 8 వికెట్లకు 209 పరుగులే చేసింది. గుజరాత్ విజయంపై ఆ జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్పందించాడు. మూడు మ్యాచ్‌లు వరుసగా చివరి ఓవర్ వరకు వెళ్లినప్పటికీ.. ఈ మ్యాచ్‌లో విజయం సాధించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపాడు. చివరి బంతి వరకు పోరాడి గెలవడం జట్టుకు ఎంతో ఆత్మ విశ్వాసాన్ని ఇస్తుందని చెప్పాడు. ఈ మ్యాచ్‌లో గెలవడం నిజంగా అదృష్టమే అని పేర్కొన్నాడు. ఐదో బంతికి డేవిడ్ మిల్లర్ సింగిల్ తీయకపోవడంతో తాము గెలవగలమన్న నమ్మకం వచ్చిందని గిల్ చెప్పుకొచ్చాడు. మ్యాచ్‌లో కీలక మలుపుగా మారిన చివరి ఓవర్ గురించి శుభ్‌మన్ గిల్ ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. ముఖ్యంగా ఐదో బంతికి డేవిడ్ మిల్లర్ సింగిల్ తీసుకోకపోవడంపై స్పందిస్తూ.. 'మాకు గెలిచే అవకాశం ఉందని అప్పుడే నమ్మకం వచ్చింది' అని చెప్పాడు. చివరి బంతికి ముందు బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణతో చర్చించిన విషయాన్ని కూడా వెల్లడించాడు. 'చివరి బంతిని యార్కర్ వేయాలా లేక స్లో బంతి వేయాలా అనే విషయంలో బాగా చర్చించాము. పిచ్ పరిస్థితులను బట్టి స్లో బంతి వేయాలని నిర్ణయించుకున్నాము. ఆ నిర్ణయమే మ్యాచ్ ఫలితాన్ని ప్రభావితం చేసిందని చెప్పవచ్చు' గిల్ తెలిపాడు. ఫీల్డింగ్ ప్రదర్శనపై శుభ్‌మన్ గిల్ నిజాయితీగా స్పందించాడు. 'నేను ఇచ్చిన ఓవర్‌త్రోస్, బౌండరీల వల్ల కొన్ని పరుగులు వచ్చాయి. ఈ విషయాన్నీ నిజాయితీగా ఒప్పుకోవాల్సిందే. అయితే ఇలాంటి ఉత్కంఠభరిత మ్యాచ్‌లలో ఒక్కో రన్ ఎంత ముఖ్యమో ఈ మ్యాచ్ ద్వారా తెలిసొచ్చింది. చివరకు ఒకే ఒక్క రన్ తేడాతో గెలిచిన నేపథ్యంలో ప్రతి చిన్న తప్పు లేదా మంచి ప్రయత్నం ఎంత ప్రభావం చూపుతుందో అర్థమైంది. ఈ పిచ్‌పై 210 పరుగులు సాధించడం మంచి స్కోరే. ఈ వికెట్‌పై చివరి ఓవర్లలో భారీ షాట్లు కొట్టడం అంత ఈజీ కాదు. పిచ్ కొంచెం స్లోగా ఉండటంతో బంతిని బౌండరీకి పంపడం కష్టంగా మారింది. అందుకే 1015 పరుగులు ఎక్కువే చేశామని భావించాము. బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేస్తే మ్యాచ్ గెలుస్తామనే ముందే అనుకున్నాం' అని గిల్ పేర్కొన్నాడు.

# క్రికెటర్లకు షాక్..ఐపీఎల్ లో కొత్త రూల్



ఐపీఎల్ క్రికెటర్లకు బిగ్ అలర్ట్. ఐపీఎల్ జట్లలో బెంచ్ కు పరిమితం అయిన ఆటగాళ్లకు కొత్త రూల్స్ అమలు చేయబోతోంది భారత క్రికెట్ నియంత్రణ మండలి. ఇకపైన టీం షీట్ లోని 16 మందికే గ్రౌండ్ లోకి అనుమతి ఉంటుందని అధికారిక ప్రకటన చేసింది. మిగిలిన ప్లేయర్లు ఎవరూ కూడా గ్రౌండ్ లో అడుగు పెట్టకూడదని వెల్లడించింది. 16 మంది తప్ప మిగిలిన ప్లేయర్లు డ్రింక్స్, బ్యాట్లు, సందేశాలు తీసుకురాకూడదని ఆదేశాలు జారీ చేసింది బీసీసీఐ. బౌండరీ చుట్టూ ఐదుగురు కంటే ఎక్కువ మంది బెంచ్ ప్లేయర్లు ఉండకూడదని స్పష్టం చేసింది. ఒఇఅ యాడ్ బోర్డులు, బౌండరీ లైన్ మధ్య తిరగడానికి వీలులేదని పేర్కొంది భారత క్రికెట్ నియంత్రణ మండలి. ఈ రూల్స్ ఎవరైనా బ్రేక్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. అటు ఇప్పటికే స్లీవ్ లెస్ జెర్సీలతో గ్రౌండ్ లోకి రాకూడదని ఇప్పటికే బీసీసీఐ పేర్కొన్న సంగతి తెలిసిందే. అలాగే కుటుంబ సభ్యులు, భార్యలను డ్రెస్సింగ్ రూమ్స్ లోకి తీసుకురాకూడదు. సొంత వాహనాల్లో హోటల్స్ నుంచి స్టేడియాలకు రాకూడదని వెల్లడించింది బీసీసీఐ.

# ఆ కుర్రాడిని జాతీయ జట్టుకు ఎంపిక చేయండి.. బీసీసీఐకి సూచించిన ఇర్ఫాన్ పఠాన్



యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని జాతీయ జట్టుకు ఎంపిక చేయాలని భారత మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ బీసీసీఐకి సూచించాడు. ఇక అతని విషయంలో ఎదురుచూడాల్సిన అవసరం లేదన్నాడు.గత ఐపీఎల్ సీజన్‌లో అరంగేట్రం చేసిన వైభవ్ సంచలన ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ప్రస్తుత సీజన్‌లోనూ అదరగొడుతున్నాడు. సీఎస్కేపై 17 బంతుల్లో 52 రన్స్ చేసిన అతను మంగళవారం ముంబైపై 14 బంతుల్లో 39 రన్స్ చేశాడు. బుమ్రా వంటి వరల్డ్ క్లాస్ బౌలర్ బౌలింగ్‌లోనూ వైభవ్ ఇబ్బందిపడలేదు. పైగా తొలి బంతినే సిక్సర్‌గా మలిచి ఆశ్చర్యపరిచాడు. ఈ నేపథ్యంలోనే వైభవ్‌ను జాతీయ జట్టుకు ఎంపిక చేసే విషయంలో ఆలస్యం చేయొద్దని బీసీసీఐకి పఠాన్ సూచించాడు. ఉబుమ్రా కోసం నేను ఎదురుచూస్తున్నా. గతేడాది అతని బౌలింగ్‌లో అవుటయ్యా. ఈ సారి మాత్రం అతన్ని బౌలింగ్‌లో కొడతా'అని వైభవ్ చెప్పాడు. చెప్పినట్టే బుమ్రా బౌలింగ్‌లో తొలి బంతిని సిక్స్ కొట్టి చూపించాడు. వైభవ్ ఆడిన తీరు బుమ్రాను ఆలోచించేలా చేసింది. 'అని పఠాన్ చెప్పాడు. అలాగే, వైభవ్ ఫియర్‌లెస్ మైండ్‌సెట్ గురించి మాట్లాడుతూ..'ఎవరు బౌలింగ్ చేస్తున్నారు? వారి యాక్షన్ ఏంటి? అని వైభవ్ పెద్దగా ఆలోచించడు. బంతిని మాత్రమే చూస్తాడు. బాల్ కొట్టే విధంగా ఉంటే కొట్టేస్తాడు. అదే అతనిలోని ప్రత్యేకత. ఈ కుర్రాడిని చాలా కాలం వెయిట్ చేయించొద్దు. జాతీయ జట్టులోకి తీసుకోండి. ఇప్పుడే తీసుకుంటే 20 ఏళ్లు ప్రొఫెషనల్ క్రికెట్ ఆడతాడు.'అని పఠాన్ చెప్పుకొచ్చాడు.

# ఉత్కంఠ పోరులో సింధు గెలుపు



ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పివి సింధు శుభారంభం చేసింది. బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో సింధు మూడుసెట్ల హోరాహోరీ పోరులో మలేషియా షట్లర్‌ను చిత్తుచేయగా.. లక్ష్యసేన్ తొలిరౌండ్ గండం దాటలేకపోయాడు. ఉత్కంఠభరితంగా సాగిన మహిళల సింగిల్స్‌లో సింధు 1521, 2111, 2119తో మలేషియాకు చెందిన ప్రపంచ 38వ ర్యాంకర్ వాంగ్‌లిన్‌చింగ్‌ను ఓడించింది. ఈ మ్యాచ్ సుమారు ఒకగంట ఏడు నిమిషాలసేపు సాగింది. రెండోరౌండ్‌లో సింధు కఠిన పరీక్షను ఎదుర్కోనుంది. 2సార్లు ఛాంపియన్, చైనాకు చెందిన 2వ సీడ్ వాంగ్‌జీహీతో క్వార్టర్‌ఫైనల్ బెర్త్‌కోసం పోటీపడనుంది. ఇక మాళ్విక బన్సోద్ 1021, 1921తో థారులాండ్‌కు చెందిన బూసానన్ చేతిలో, తన్వీ శర్మ 1921, 1421తో మలేషియా షట్లర్ చేతిలో పరాజయాన్ని చవిచూసారు. అంతకుముందు ఆయుష్ శెట్టి ఏకంగా ప్రపంచ 7వ ర్యాంకర్‌ను చిత్తుచేసి ప్రి క్వార్టర్స్‌కు చేరాడు. తొలిరౌండ్‌లో ఆయుష్ శెట్టి 2113, 2116తో చైనాకు చెందిన లీ షీపెంగ్‌ను కేవలం 51 నిమిషాల్లోనే చిత్తుచేశాడు. ఇక లక్ష్యసేన్ 1221, 1921తో హాంకాంగ్‌కు చెందిన లీ చెక్‌యియు చేతిలో, కిదాంబి శ్రీకాంత్ 2118, 921, 1121తో సింగపూర్‌కు చెందిన మాజీ ప్రపంచ ఛాంపియన లోహ్ కీన్‌యెవ్ చేతిలో పరాజయాన్ని చవిచూశాడు.

# వుదయం సినిమా

MOVIE TIME!



## లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ

### కమర్షియల్ ఎంటర్‌టైనర్ : కృతి శెట్టి

వరుస బ్లాక్‌బస్టర్ విజయాలతో అల రిస్తున్న యంగ్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ హీరోగా, విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో రూపొందిన క్రేజీ లవ్ స్టోరీ 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'. ఈ చిత్రాన్ని నయనతార నిర్మించగా, కృతి శెట్టి హీరోయిన్‌గా నటించారు. ఈ చిత్రంలో ఎస్.జె. సూర్య, యోగి బాబు కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే విడుదలైన తెలుగు టీజర్, ట్రైలర్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. శ్రీ పద్మిని సినిమాస్ ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఏప్రిల్ 10న ఈ చిత్రం గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా కృతి శెట్టి విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

'ఉప్పెన' తర్వాత పూర్తిస్థాయి లవ్ స్టోరీ చేయలేదు. అలాంటి ఫుల్ లెంత్ ప్రేమ కథ చేసే అవకాశం ఇందులో వచ్చింది. ఇందులో ప్రేమకథ చాలా ఫ్రెష్‌గా ఉంటుంది. విగ్నేష్ శివన్ గారు కథ చెప్పినప్పుడు నాకు చాలా కనెక్ట్ అయ్యింది. ఇప్పుడు సోషల్ మీడియాలో ఉన్న ప్రతి ఒక్కరూ ఎన్ని లైక్స్ వచ్చాయి, ఎన్ని షేర్స్ వచ్చాయి అని కౌంట్ చేసుకుంటున్నారు. అది చాలామందికి హార్ట్‌కు దగ్గరగా ఉంటుంది. రియల్‌గా అనిపించే క్యారెక్టర్‌ని సినిమాటిక్‌గా చూపిస్తున్నారు. ఈ క్యారెక్టర్ చేయడం నాకు చాలా మంచి ఎక్స్‌పీరియన్స్.

ఈ జనరేషన్‌లో డబ్బులు లేకపోయినా పర్వాలేదు, కానీ ఫోన్ లేకుండా ఉండడం చాలా కష్టం. అలాంటి ఒక క్యారెక్టర్ చేస్తున్నాను. విజువల్ కాన్సెప్ట్ 2040 ఫ్యూచరిస్టిక్‌గా ఉన్నా, కథ మాత్రం అందరికీ రిలేటబుల్‌గా ఉంటుంది. మంచి ఫన్ ఫిల్మ్. అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఉంటాయి. మంచి లవ్ పోర్షన్ కూడా చాలా బాగుంటుంది.



**వుదయం సినిమా:**

'అర్ధనారి' 'తెప్ప సముద్రం' 'వెడ్డింగ్ డైరీస్' వంటి వైవిధ్యమైన సినిమాలతో హీరోగా గుర్తింపు తెచ్చుకున్న అర్జున్ అంబటి.. అటు తర్వాత బుల్లితెరపై 'బిగ్ బాస్' రియాలిటీ షోతో ఫ్యామిలీ ఆడియన్స్ కి మరింత దగ్గరయ్యారు. ప్రస్తుతం మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న పాన్ ఇండియా సినిమా 'పెద్ది' లో కూడా అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారు అర్జున్ అంబటి. అతను హీరోగా

## పరమపద సోపానం

### ఈ నెల 24న విడుదల

రూపొందిన లేటెస్ట్ మూవీ 'పరమపద సోపానం'. జెన్నిఫర్ ఇమ్మాన్యుయేల్ కథానాయికగా నటించిన ఈ సినిమాని 'గణపర్తి శ్వేత' సమర్పణలో 'స్వయంభూ క్రియేషన్స్' సంస్థ పై గణపర్తి నారాయణరావు తేలప్రోలు ప్రసన్న ఆంజనేయులు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. పులగం సుప్రియ సహ నిర్మాత. స్టార్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్ గా పని చేసిన నాగ శివ 'పరమపద సోపానం' చిత్రానికి కథ, మాటలు, స్క్రీన్ ప్లే, దర్శకత్వ బాధ్యతలు నిర్వర్తించారు.

## ఆమె మేకప్ ఆర్టిస్ట్ మాత్రమే కాదు

### ప్రీతీశీల్‌పై 'ధురంధర్' డైరెక్టర్ ప్రశంసలు





'ధురంధర్' సినిమాలకు వర్క్ చేసిన మేకప్, ప్రోస్థటిక్ ఆర్టిస్ట్ ప్రీతీశీల్ సింగ్ పై ఆదిత్యధర్ ప్రశంసలు కురిపించారు. ప్రీతితో కలిసి దిగిన ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. ఆమె ప్రతిభ గురించి అభిమానులకు చెప్పారు. 'ధురంధర్' కోసం ఆమెను సంప్రదించిన క్షణాలను గుర్తు చేసుకున్నారు.

''ధురంధర్' కోసం ప్రీతి పేరును కొందరు నాకు సూచించినప్పుడు నేను సందేహించా. అహంకారి అని, పారితోషికం ఎక్కువ అడుగుతుందని, భారీ ప్రాజెక్టులు మాత్రమే చేస్తుందని.. ఇలా ఆమె గురించి అంతకుముందు నేను విన్న మాటలే ఇందుకు కారణం. తర్వాత మనసు మార్చుకుని ఆమెను కలిశా. ఒక్క మీటింగ్‌లోనే అవన్నీ అవాస్తవాలని అర్థమైంది. ఇతరుల అభిప్రాయలపై ఆధారపడి ఎవరినీ అపార్థం చేసుకోకూడదని అనుకున్నా. ప్రీతి అసాధారణ ప్రతిభ కలిగిన ఆర్టిస్ట్ మాత్రమే కాదు.. మంచి మనిషి కూడా. అందరితోనూ ఎంతో ఆప్యాయంగా ఉంటుంది. సినిమాలోని ప్రతి పాత్ర గురించి, జీవితం గురించి సుదీర్ఘ చర్చలు సాగించేవాళ్లం. ఆ జ్ఞాపకాలు జీవితాంతం మర్చిపోలేనివి''

''ప్రీతి, ఆమె టీమ్ చాలా కష్టపడింది. మేం నిద్ర లేచే సమయానికే వాళ్లు సెట్స్‌లో ఉండేవారు. అందరూ వెళ్లిన తర్వాతే వాళ్లు సెట్స్ నుంచి వెళ్లేవారు. రోజుకు రెండు/మూడు గంటలపాటు నిద్రపోయేవారు. విజన్‌కు తగ్గట్టు అంకితభావంతో పని చేశారు. చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రతి పాత్రకూ సహజత్వాన్ని తీసుకొచ్చారు. ఇలా చేయడం అరుదు. ప్రీతి నా కుటుంబ సభ్యురాలు. నా సోదరి'' అని ఆదిత్య పేర్కొన్నారు. అల్లు అర్జున్ బ్లాక్‌బస్టర్ మూవీ 'పుష్ప' సినిమాకూ ప్రీతి వర్క్ చేశారు.



## డైమండ్ డెకాయిట్

### నేడే విడుదల మహిళలకు 4 షోలు ఉచితం





**వుదయం సినిమా:**

టాలీవుడ్ లో హాట్ టాపిక్ గా మారిన కంప్లీట్ ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామా "డైమండ్ డెకాయిట్" చిత్రం శుక్రవారం (ఏప్రిల్ 10న) తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా థియేటర్ లలో విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ తెలుగు ఫిలిం ఛాంబర్ లో ప్రీ రిలీజ్ ఫంక్షన్ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ మహిళా ప్రేక్షకులకు ఆకర్షణీయమైన ఆఫర్‌ను ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విడుదల కానున్న థియేటర్లలో 4 షోలు మహిళలకు ఉచితంగా ప్రదర్శించనున్నట్లు వెల్లడించింది. మహిళలు ఎక్కువ సంఖ్యలో థియేటర్లకు వచ్చి సినిమాను ఆస్వాదించాలని చిత్ర బృందం కోరింది. ఈ చిత్రంలో పార్థా గోపాల్ హీరోగా నటించడమే కాకుండా నిర్మాతగా వ్యవహరించగా, మేఘనా రెడ్డి హీరోయిన్‌గా నటించారు. రచయిత-దర్శకుడు సూర్య జి. యాదవ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం పూర్తి కుటుంబ వినోదంతో పాటు హృద్యమైన భావోద్వేగాలతో కూడిన ఎమోషనల్ డ్రామాగా తెరకెక్కింది. ఈ సినిమా చూస్తే కన్నీళ్లు ఆపుకోవడం కష్టమని చిత్ర యూనిట్ చెబుతోంది. ఈ మూవీ ప్రచార చిత్రాలకు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఇటీవల దర్శకేంద్రుడు కే. రాఘవేంద్ర రావు ట్రైలర్‌ను వీక్షించి చిత్ర బృందాన్ని అభినందించారు. ఇప్పటికే నిర్వహించిన ప్రివ్యూ షోలలో పలువురు సినీ ప్రముఖులు ఈ చిత్రాన్ని ప్రశంసించినట్లు చిత్ర యూనిట్ తెలిపింది.

## సర్కార్ బాయి

### ఘనంగా పూజా కార్యక్రమం



**వుదయం సినిమా:** తెలంగాణ సామాజిక నేపథ్యంతో రాబోతున్న చిత్రం 'సర్కార్ బాయి'. శ్రీరామ్ నిమ్మల, సాయి కీర్తన హీరోహీరోయిన్లుగా, లారా దర్శకత్వంలో రూపొందుతున్న 'సర్కార్ బాయి' చిత్రానికి సికింద్రాబాద్ గణేష్ టెంపుల్‌లో పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముహూర్తం కార్యక్రమంలో భాగంగా నిర్మాత తుమ్మల ప్రఫుల్ రాం రెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చేయగా, దర్శకుడు లారా సీన్ డైరెక్షన్ చేశారు. ముహూర్తం షాట్‌ను తెలంగాణ ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారి దాస్య నాయక్ క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ కు అతిథులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దర్శకుడు లారా మాట్లాడుతూ..1985 సంవత్సరంలో జరిగిన నీటి సంఘటనలు, కుల వివక్షత వంటి అంశాలను ఆధారంగా తీసుకుని ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలను ప్రతిబింబించే కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రం రెండు తెలుగు రాష్ట్రాల్లో మంచి ఆదరణ పొందుతుందనే నమ్మకాన్ని మూవీ యూనిట్ వ్యక్తం చేసింది. ప్రేక్షకులు ఈ సామాజిక కథాంశంతో వచ్చే చిత్రాన్ని ఆదరించాలని డైరెక్టర్ కోరారు. మూవీ ముహూర్తం కార్యక్రమానికి వచ్చిన ప్రముఖ దర్శకులు ప్రేమ్ రాజ్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిలో భాగంగా వచ్చే సినిమాలను ఆదరించాలని ఆయన కోరారు.



## విశ్వంభర విడుదల తేదీ వైరల్

చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో రూపొందుతున్న సోషియో ఫ్యాంటసీ యాక్షన్ మూవీ 'విశ్వంభర'. విడుదల తేదీ గురించి నెట్టింట ఒక వార్త వైరల్ అవుతుంది. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌లో వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలుగా నటిస్తున్నారు. సుమారు రెండేళ్లుగా ఈ చిత్రం కోసం ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. టీజర్‌కు ప్రేక్షకుల నుంచి విమర్శలు రావడంతో చిత్ర నిర్మాతలు వివిఎఫ్ఎక్స్ పై ఎక్కువ సమయం కేటాయించడంతో విడుదల విషయంలో ఆలస్యమైంది. తాజా అంచనాల ప్రకారం విశ్వంభర చిత్రం 2026 జూలై 10న థియేటర్లలోకి రావచ్చన ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటికే సోషల్ మీడియాలో పలు తేదీలు ప్రచారంలో ఉండగా.. ఈ తేదీపైనే అందరి చూపు ఉంది. అయితే, అభిమానులు అధికారిక ప్రకటన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ చాలా ఆలస్యం అయినందున, విడుదల తేదీ ప్రకటనను వీడియో కంటెంట్‌తో చేస్తే మరింత బజ్ క్రియేట్ అవుతుందని ఆశిస్తున్నారు. ఆ విధంగా, కొత్త తేదీ ప్రేక్షకుల మనసుల్లో బలంగా నాటుకుపోతుందని చెప్పుకొస్తున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో 'మన శంకరవరప్రసాద్‌గారు' విజయంతో ఫుల్ జోష్‌లో ఉన్న చిరంజీవి మరో కొత్త సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. వాల్తేరు వీరయ్య తర్వాత దర్శకుడు బాబీతో మరో సినిమాను పట్టాలెక్కించారు. త్వరలో షూటింగ్‌లో కూడా చిరు పాల్గొననున్నారు.



## తిమ్మరాజుపల్లి టీవీ మూవీ ట్రైలర్

టెక్నికల్ బ్రిలియన్స్, ఆర్టిస్టుల పర్ ఫార్మెన్స్ లు, అందమైన ఊరి వాతావారణం చూసేందుకు మా "తిమ్మరాజుపల్లి టీవీ"సినిమా చూడండి ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ లో హీరో కిరణ్ అబ్బవరం న్యూ టాలెంట్ ను ఎంకరేజ్ చేస్తూ హీరో కిరణ్ అబ్బవరం సుమైర స్టూడియోస్ తో కలిసి తన కేఏ ప్రొడక్షన్స్ పై నిర్మిస్తున్న సినిమా "తిమ్మరాజుపల్లి టీవీ". తేజ వేల్పుచర్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంతో సాయి తేజ్, వేద జలంధర్ హీరో హీరోయిన్స్ గా పరిచయమవుతున్నారు. "తిమ్మరాజుపల్లి టీవీ" చిత్రంతో వి.మునిరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే పీరియాడిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా ఈ నెల 17న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు హైదరాబాద్ లో "తిమ్మరాజుపల్లి టీవీ" సినిమా ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. నటుడు సాయికృష్ణ మాట్లాడుతూ "తిమ్మరాజుపల్లి టీవీ"సినిమాలో నేను దక్షిణం అనే క్యారెక్టర్ లో నటించాను. ఈ సినిమా షూటింగ్ ను మూడు రాష్ట్రాల సరిహద్దుల్లో చేశాం. సెల్ ఫోన్స్ ఏవీ లేకుండా అక్కడి స్థానికులతో కలిసిపోయి చిత్రీకరణ జరిపాం. షూటింగ్ చేస్తున్న టైమ్ లో మా చిన్నప్పటి జ్ఞాపకాలు గుర్తుకువచ్చాయి. సినిమా చూస్తుంటే మీకు అదే ఫీల్ కలుగుతుంది.

## మంచి ఎక్స్ పీరియన్స్ ఇస్తుంది

### తన సినీ కెరీర్‌కు సంబంధించి ఆసక్తికర విషయాలు పంచుకుంది మమితా బైజు



మలయాళ ముద్దుగుమ్మ మమితా బైజు.. ప్రజెంట్ బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా ఆఫర్స్ అందుకుంటూ బిజీ లైఫ్ లీడ్ చేస్తుంది. ఆమె నటిస్తున్న వరుస ప్రాజెక్టులలో 'విశ్వనాథ్ అండ్ సన్స్' ఒకటి. కోలీవుడ్ వర్సటైల్ యాక్టర్ సూర్య, సెన్సిబుల్ డైరెక్టర్ వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో రాబోతున్న ఈ ప్రాజెక్టు సంబంధించిన షూటింగ్ ప్రజెంట్ శరవేగంగా జరుగుతున్నది. ఇందులో భాగంగానే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని సినిమాపై ఆసక్తికర కామెంట్స్ చేసింది మమిత. 'విశ్వనాథ్ అండ్ సన్స్ చిత్రంలో ఎంటర్‌టైన్మెంట్ తో పాటు బలమైన ఎమోషనల్ కంటెంట్ కూడా ఉంటుంది. ఇది ఒక సంపూర్ణ వినోదాత్మక చిత్రంగా రూపొందగా.. ఈ చిత్రం ప్రేక్షకులకు పూర్తిస్థాయిలో ఎగ్జైట్‌మెంట్ ఎక్స్ పీరియన్స్ ను ఇస్తుంది. నన్ను నమ్మండి.. ఈ సినిమా అద్భుతంగా ఉండబోతోంది' అని తెలిపింది. అలాగే తన సినీ ప్రయాణం గురించి మాట్లాడుతూ.. 'నేను మలయాళ చిత్రసీమలో నా ప్రయాణాన్ని ఒక సహాయ నటిగా ప్రారంభించాను. ఇప్పుడు ప్రధాన పాత్రల వైపు అడుగులు వేస్తున్నాను. ప్రతి విషయాన్ని దశలవారీగా ముందుకు తీసుకెళ్లడాన్ని నేను విశ్వసిస్తాను.. ఎందుకంటే మనకు దక్కాల్సినవి సరైన సమయానికి తప్పక మనల్ని చేరుతాయి' అంటూ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది మమిత.

## బ్లాక్ డ్రెస్‌లో గ్లామర్ బ్యూటీ




ప్రియాంక అరుల్ మోహన్ పేరును ప్రత్యేకంగా తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఈమె ఇప్పటి వరకు అనేక తెలుగు చిత్రాల్లో నటించి మంచి గుర్తింపును సంపాదించుకుంది. ఈ చిన్నది నాని హీరోగా నటించిన గ్యాంగ్ లీడర్ చిత్రంతో టాలీవుడ్ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత ఈ హీరోయిన్ పలు తెలుగు చిత్రాల్లో నటించినప్పటికీ మంచి విజయాలు మాత్రం దక్కలేదు. దాంతో తమిళ ఇండస్ట్రీ వైపు ఆసక్తి చూపిన ఈమెకు అక్కడ మంచి అవకాశాలు, విజయాలు దక్కాయి. కొంతకాలం క్రితం ఈ నటి, పవన్ కళ్యాణ్ హీరోగా రూపొందిన ఓజీ చిత్రంలో హీరోయిన్గా నటించింది. తాజాగా ఈ నటి చంకీలు పొదిగిన బ్లాక్ కలర్ స్లీవ్‌లెస్ డ్రెస్సు ధరించి, తన కురులు ప్రత్యేకంగా హైలైట్ అయ్యేలా డిఫరెంట్ యాంగిల్స్‌లో ఫోటోలకు ఫోజులు ఇచ్చింది. ఇందులో ఈమె మోడ్రన్ లుక్‌లో చాలా అందంగా కనిపించడంతో ఆ ఫోటోలు వైరల్‌గా మారాయి. ఈ ఫోటోలకు అనేకమంది లవ్ సింబల్ ఎమోజీలతో కామెంట్లు చేస్తున్నారు.



## ఆహా ఓటిటిలో అదరగొడుతున్న డార్క్ నైట్

**వుదయం సినిమా:** పూర్ణ ప్రదాన పాత్రలో రూపొందిన ఎమోషనల్ థ్రిల్లర్ చిత్రం "డార్క్ నైట్". మార్చ్ 13న తెలుగు రాష్ట్రాల థియేటర్లలో రిలీజ్ అయ్యి మంచి రివ్యూస్ తో చిన్న చిత్రాలలో పెద్ద విజయం సాధించింది. జి.ఆర్. ఆదిత్య ఈ చిత్రానికి కథ రాసి దర్శకత్వం వహించారు. పూర్ణ ఇందులో హేమ పాత్రలో నటించి కథకు కీలకంగా నిలిచే పాత్రను పోషించారు. ఆమెతో పాటు త్రిగుణ్ (ఆదిత్ అరుణ్) రోషన్‌గా, విధార్థ్ అలెక్స్‌గా, సుభాశ్రీ రాయగురు సోఫియా పాత్రలో నటించారు. ఈ చిత్రానికి ప్రముఖ దర్శకుడు ఆధిత్యా, సంగీత దర్శకుడు మిస్కిన్ మ్యూజిక్ అందించిన ఈ చిత్రాన్ని పట్లోళ్ల వెంకట్ రెడ్డి సమర్పణలో పి 19 స్టూడియోస్ పతాకంపై సురేష్ రెడ్డి కొవ్వూరి ఈ చిత్రాన్ని నిర్మించారు. కాగా ఇక ఇప్పుడు ఈ సినిమా డిజిటల్ ప్రీమియర్‌కు రెడీ అయ్యింది. ఏప్రిల్ 8 నుంచి ఈ మూవీ ఆహా తెలుగులో స్ట్రీమింగ్ కాబోతోంది.



Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda,RTC X Roads, Hyderabad - 500020, Telangana.
Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.